


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY | నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 26 మంగళవారం ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 342

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Medak, Nizamabad, Krishna, Guntur, Easrt Godavari, West Godavari, Prakasam, Nellore, Srikakulam, Vizianagaram, Visakhapatanam, Kurnool, Chittoor, Kadapa, and Anantapur




## పెన్‌పహాడ్ సైన్స్ టీచర్‌కు జాతీయ అవార్డ్



**న్యూఢిల్లీ-నవభూమి బ్యూరో:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్-2025ను కేంద్రం ప్రకటించింది. అవార్డులకు వివిధ రాష్ట్రాలకు చెందిన 45 మంది టీచర్లను కేంద్రం ఎంపిక చేసింది. వీరిలో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌కు చెందిన మారం పవిత్ర ఈ జాతీయ అవార్డుకు ఎంపిక అయ్యారు.

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు మారం పవిత్ర జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2025కు తెలంగాణ నుంచి 150మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద ఈమె ఒక్కరే ఎంపికయ్యారు. కేంద్ర విద్యాశాఖ ఈ అవార్డులను సోమవారం ప్రకటించింది. మారం పవిత్ర 2023లోనూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పట్ల జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా విద్యాశాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డును సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేస్తారు.

## తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా వర్సిటీనే

◆ ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి ఉగ్రరూపం

- తెలంగాణ చరిత్రలో ఓయూకి ప్రత్యేక స్థానం ఉందని సీఎం వ్యాఖ్యలు
- పీవీ నరసింహరావు సహా పలువురు మహానేతలు ఓయూ విద్యార్థులే
- ఓయూకి పూర్వ వైభవం తీసుకురావాలని సీఎం హామీ
- దళితుడిని వీసీగా నియమించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- యువతకు సైద్ధాంతిక, సామాజిక చర్చల అవసరమని సూచన
- రాష్ట్రంలో డ్రగ్స్ విస్తరణపై సీఎం ఆందోళన
- విద్యార్థులకు నిరసన హక్కు ఉందని సీఎం రేవంత్ స్పష్టీకరణ
- సమస్యలు పరిష్కరించేందుకు వచ్చిన వారిని అడ్డుకోవద్దని పిలుపు
- డిసెంబర్‌లో మళ్లీ ఆర్ట్స్ కాలేజీ మీటింగ్‌లో హాజరవుతానని హామీ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రత్యామ్నాయ పదమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అలాంటి ఉస్మానియా యూనివర్సిటీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. దేశ రాజకీయాలను శాసించిన ఎంతో మంది నేతలు ఈ యూనివర్సిటీ నుంచి వచ్చిన విద్యార్థులేనని ఆయన గుర్తు చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి తదితరులంతా ఈ యూనివర్సిటీ విద్యార్థులేనని ఆయన సోదాహరణగా వివరించారు. కొందరు వ్యక్తులు.. ఉస్మానియా యూనివర్సిటీని కాలగర్భంలో కలపాలని చూశారని మండిపడ్డారు. కానీ ఓయూకు పూర్వ వైభవం తీసుకురావాలని తాము నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ క్రమంలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు.

దేశానికి యువ నాయకత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా వర్సిటీనేనని గుర్తు చేశారు. యూనివర్సిటీలు సమస్యలపై చర్చలకే కాదు.. సైద్ధాంతిక అంశాలకు వేదిక సైతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక, సాంకేతిక అంశాలపై చర్చలు జరపాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

**డ్రగ్స్, గంజాయిపై ఆందోళన..**

రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువతను డ్రగ్స్, గంజాయి పట్టి పీడిస్తున్నాయని ఆవేదన చెందారు. విద్యా సంస్థల్లో చైతన్యవంతమైన చర్చలు లేక పోవడం వల్లే డ్రగ్స్ సమస్య ఉత్పన్నమవుతుందని చెప్పారు. చిన్న కాలేజీల్లో సైతం విద్యార్థులు గంజాయికి అలవాటుపడుతున్నారని తెలిపారు. పేదలకు పంచేందుకు భూములు లేవు.. ఖజానా ఖాళీగా ఉందన్నారు.

**మళ్లీ ఓయూకి వస్తా..**

## పాకిస్థాన్‌కు కీలక హెచ్చరిక!

- పాకిస్థాన్‌కు వరద హెచ్చరికలు జారీ చేసిన భారత్
- జమ్మూలోని తావి నదికి భారీ వరద ముప్పుపై సమాచారం
- దౌత్య కార్యాలయం ద్వారా ఇస్లామాబాద్‌ను అప్రమత్తం చేసిన న్యూఢిల్లీ
- పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత నిలిపివేసిన సింధు జలాల ఒప్పందం

2

**పాకిస్థాన్-నవభూమి ప్రతినిధి**

పాకిస్థాన్ తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, భారత ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించింది. జమ్మూలోని తావి నదికి భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్‌ను అప్రమత్తం చేసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు అత్యంత క్లిష్టంగా ఉన్న తరుణంలో, దౌత్య మార్గాల ద్వారా ఈ సమాచారాన్ని అందించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పాకిస్థాన్ మీడియా వర్గాల కథనాల ప్రకారం, ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ ఆదివారం ఈ మేరకు పాక్ ప్రభుత్వానికి సమాచారం అందించింది. సాధారణంగా సింధు జలాల ఒప్పందం కింద ఇరు దేశాల కమిషనర్ల మధ్య ఇలాంటి సమాచార మార్పిడి జరుగుతుంది. అయితే, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత ఈ ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. అప్పటి నుంచి ఒప్పందం కింద సమాచార మార్పిడి జరగడం లేదు. ఈ నేపథ్యంలో దౌత్య కార్యాలయం ద్వారా హెచ్చరికలు పంపడం ఇదే తొలిసారి.



భారత్ నుంచి అందిన సమాచారంతో పాకిస్థాన్ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారని, నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారని తెలుస్తోంది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ తీసుకున్న కఠిన చర్యలలో భాగంగా సింధు జలాల ఒప్పందాన్ని పక్కనపెట్టింది. అప్పటి నుంచి మూడు నదులకు సంబంధించిన నీటిమట్టాల వివరాలను పాక్‌తో పంచుకోవడం లేదు. రుతుపవనాల సమయంలో భారత్ ఇచ్చే ఈ సమాచారం, పాకిస్థాన్‌లో వరద నష్టాన్ని తగ్గించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటీవల మే నెలలో ఇరు దేశాల మధ్య సైనిక

## స్వదేశీ ఉద్యమానికి యువతే నాయకత్వం వహించాలి
## మోదీ పిలుపు

- అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ బాలికల హాస్టల్‌కు వీడియో సందేశం ద్వారా శంకుస్థాపన
- స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలకు, యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 'ఇక్కడ స్వదేశీ వస్తువులే అమ్ముతాం' అని బోర్డులు పెట్టాలని దుకాణదారులకు సూచన
- మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రధాని మోదీ
- నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడి

2



**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

దేశ స్వావలంబనకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడమే కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది వందేళ్ల నాటి పాత నినాదం కాదని, దేశ భవిష్యత్తును బలోపేతం చేసే ఆధునిక ప్రచారమని ఆయన స్పష్టం చేశారు. ఈ నూతన స్వదేశీ ఉద్యమానికి సమాజం, ముఖ్యంగా యువత నాయకత్వం వహించాలని ఆయన పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సర్దార్‌ధామ్ ఫేజ్-2 కన్యా ఛాత్రాలయ (బాలికల వసతి గృహం) శంకుస్థాపన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదివారం ఆయన వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ప్రతి దుకాణదారుడు తమ వద్ద "కేవలం స్వదేశీ ఉత్పత్తులు మాత్రమే అమ్ముతాం" అనే బోర్డును ప్రదర్శించాలని సూచించారు. కుటుంబాలు కూడా దేశీయంగా తయారైన వస్తువులనే కొనుగోలు చేయాలని కోరారు. మంచి ఉద్దేశంతో పవిత్రమైన లక్ష్యంతో సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తే దైవబలం కూడా తోడవుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళా సాధికారత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని నొక్కిచెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న ఈ హాస్టల్‌లో 3,000 మంది బాలికలకు వసతి కల్పించనున్నామని,

## కేసీఆర్‌ను కూడా కడియం శ్రీహరి బ్లాక్ మెయిల్ చేశారు

- కూతురి ఎంపీ టికెట్ కోసమే కడియం పార్టీ మారారని రాజయ్య ఆరోపణ
- కడియం ఒక అవినీతి తిమింగలమంటూ ఘాటు వ్యాఖ్యలు
- విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు పోస్టులు అమ్ముకున్నారని విమర్శ
- విదేశాల్లో ఆస్తులు, బినామీ లావాదేవీలు ఉన్నాయని ఆరోపణలు
- స్పీకర్ వెంటనే కడియం అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒక అవినీతి తిమింగలమని, ఆయన ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పలేని అయోమయ స్థితిలో ఉన్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య ఎద్దేవా చేశారు. కేవలం తన కుమార్తెకు ఎంపీ టికెట్ ఇప్పించుకోవడం కోసమే శ్రీహరి పార్టీ మారారని, తన రాజకీయ సమాధిని తానే నిర్మించుకున్నారని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరానని స్వయంగా ప్రకటించిన కడియం శ్రీహరి, ఇప్పుడు అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. "పదిహేనేళ్ల పాటు మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు గుర్తుకురాని అభివృద్ధి, ఇప్పుడు కొత్తగా గుర్తుకువచ్చిందా?" అని రాజయ్య నిలదీశారు. స్టేషన్

## ఇది ఆరంభం మాత్రమే
మంత్రి నారా లోకేశ్



2

**మెప్మా, ర్యాపిడో భాగస్వామ్యంతో మహిళలకు స్వయం ఉపాధి**

**అమరావతి-నవభూమి బ్యూరో**

రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని, ర్యాపిడో భాగస్వామ్యంతో అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకం ఈ ప్రస్థానంలో ఒక ఆరంభం మాత్రమేనని మానవ వనరులు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభం
- విజయవాడలో ఇంటింటికీ వెళ్లి కార్డులు అందజేసిన మంత్రి నాదెండ్ల మనోహర్
- మొత్తం 4.42 కోట్ల మంది లబ్ధిదారులకు కొత్త కార్డులు
- సెప్టెంబర్ 15 నాటికి పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యం
- క్యూఆర్ కోడ్ స్కాన్‌తో పారదర్శకత, ఎక్కడైనా రేషన్ పొందే సౌకర్యం
- సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 1967 ఏర్పాటు

2



**అమరావతి-నవభూమి బ్యూరో**

రాష్ట్రంలో కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ప్రారంభమైంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం విజయవాడ, పెనమలూరు ప్రాంతాల్లో స్వయంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు కార్డులను అందజేసి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.42 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ స్మార్ట్ కార్డులను అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 15వ తేదీలోగా రాష్ట్రంలోని ప్రతి లబ్ధిదారుని ఇంటికి స్మార్ట్ కార్డును చేర్చేలా లక్ష్యం నిర్దేశించుకున్నామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 5.90 లక్షల మందికి, కృష్ణా జిల్లాలో 5.17 లక్షల మందికి ఈ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కొత్త కార్డుల ద్వారా లబ్ధిదారులు రాష్ట్రంలోని ఏ చౌకధరల దుకాణంలోనైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కలుగుతుందని స్పష్టం చేశారు. ఈ స్మార్ట్ కార్డులో ఉండే

## ఆలిని చంపి తగులబెట్టాడు

- భార్యను హత్య చేసి కాల్చిన భర్త
- అనుమానంతో దారుణానికి ఒడిగట్టిన రాక్షసుడు
- సోమశిల చూపిస్తానని మోసం చేసిన భర్త
- భార్య కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు
- హత్య ప్రదేశాన్ని స్వయంగా చూపించిన భర్త

2




**కర్నూల్ -నవభూమి బ్యూరో**

అక్రమ సంబంధాలు, అనుమానాలు, మనస్పర్థలతో భార్యాభర్తల మధ్య చోటు చేసుకుంటున్న ఘర్షణలు చివరకు ప్రాణాలు తీసేదాకా వెళ్తున్నాయి. హైదరాబాద్ బోడుప్పల్‌లో భార్యపై అనుమానంతో కట్టుకున్న భర్తే కాలయముడిగా మారి ముక్కలు ముక్కలు చేసి మూసీ నదిలో విసిరేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఐదు నెలల గర్భిణీ అని చూడకుండా భర్త మహేందర్ రెడ్డి దారుణానికి ఒడిగట్టాడు. ఈ ఘటన మరవక ముందే తాజా.. మరో దారుణం వెలుగులోకి వచ్చింది. సోమశిల చూపిస్తానంటూ భార్యను నమ్మించి తీసుకెళ్లిన ఓ భర్త.. నిర్మానుష్య అటవీ ప్రాంతంలో ఆమెను చంపి, ఆపై పెట్రోల్ పోసి కాల్చేశాడు. ఈ దారుణం నాగర్ కర్నూల్ జిల్లాలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం కొత్త రాయవరం గ్రామానికి చెందిన శ్రీశైలం మహబూబ్ నగర్‌కు చెందిన శ్రావణిని పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఒక బాబు, ఒక పాప సంతానం. కొంతకాలం వారి

## కొత్తగూడెంలో దారుణం

- భార్యను రెండేళ్లు గదిలో బంధించి అస్తిపంజరంలా మార్చి హత్య!
- కొత్తగూడెం జిల్లాలో వివాహిత అనుమానాస్పద మృతి
- మెట్లపై నుంచి పడి చనిపోయిందంటున్న భర్త
- అదనపు కట్నం కోసమే హత్య అని తల్లిదండ్రుల ఆరోపణ
- తిండి పెట్టకుండా, గదిలో బంధించి హింసించారని ఫిర్యాదు
- మృతదేహంపై పాత, కొత్త గాయాలు.. ఎముకలు తేలిన దేహం
- భర్తపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు

2




**కొత్తగూడెం-నవభూమి బ్యూరో**

తెలంగాణ రాష్ట్రం, కొత్తగూడెం జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. భార్యకు ఆహారం పెట్టకుండా ఆమె మరణానికి కారకుడైన ఓ కిరాతక భర్త ఉదంతం వెలుగులోకి వచ్చింది. భార్య మెట్లపై నుంచి జారిపడి మరణించిందని భర్త చెబుతుండగా, ఇది హత్యేనని, అదనపు కట్నం కోసం రెండేళ్లుగా నరకం చూపించి, చివరకి ప్రాణాలు తీశారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషాద ఘటన అశ్వారావుపేటలో జరిగింది. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం విశ్వనాథపురానికి చెందిన లక్ష్మీప్రసన్న (33)కు, ఖాన్‌ఖాన్‌పేట గ్రామ వాసి పూల నరేష్ బాబుకు 2015లో వివాహం జరిగింది. గత మూడేళ్లుగా వారు అశ్వారావుపేటలో నివాసం ఉంటున్నారు. శనివారం, తన భార్య లక్ష్మీప్రసన్న మెట్ల మీద నుంచి కింద పడిపోయిందని, ఆసుపత్రికి తీసుకొచ్చానని నరేష్ బాబు తన అత్తమామలకు ఫోన్ చేసి చెప్పాడు. ఆసుపత్రికి వెళ్లిన తల్లిదండ్రులు, అక్కడ గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఆమె శరీరంపై కొత్త గాయాలతో పాటు, పాత

## గణేష్ మండపం ఏర్పాటుకు నిబంధనలు ఇవే

### తప్పనిసరిగా పాటించాలన్న తెలంగాణ పోలీసులు




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలుగు రాష్ట్రాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఆగస్టు 27వ తేదీ నుంచి మొదలుకానున్నాయి. గణపతి విగ్రహాల తరలింపు, మండపాల నిర్మాణం, నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లతో నగరాలు ప్రస్తుతం ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తుల రద్దీ అధికంగా ఉంటుందన్న తరుణంలో భద్రతా సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలంగాణ పోలీసులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో మండప నిర్వాహకులకు మార్గదర్శకాలను జారీ చేశారు. మొదటగా, ప్రతి మండపానికి ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ కనెక్షన్లు కచ్చితంగా సంబంధిత అధికారుల అనుమతితోనే పొందాలి. మండపాల నిర్మాణాన్ని నిపుణులకే అప్పగించాలి, ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లను పూర్తిగా బ్లాక్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించకూడదు. డీజే వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ.. రాత్రి పది గంటల తర్వాత మైక్ వినియోగంపై పరిమితి విధించారు. సౌండ్ సిస్టమ్‌ను ప్రభుత్వ నిబంధనల్లో నిర్ణయించిన డెసిబెల్స్ లోపే వాడాలని ఆదేశించారు. భద్రత దృష్ట్యా మండపాల వద్ద సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు తప్పనిసరి చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మాణం బలంగా ఉండేలా చూసుకోవాలని, భక్తుల రద్దీకి తగ్గట్టుగా క్యూలైన్లు, వాలంటీర్లు ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహన పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రదేశాలు కేటాయించాలని సూచించారు. నవరాత్రి మండపాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఏపీలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు

- వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావం
- 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాల హెచ్చరిక
- శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాలకు అలర్ట్
- కాకినాడ, కోనసీమ, గోదావరి జిల్లాల్లో మోస్తరు వర్షాలు
- కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు

2



**అమరావతి-నవభూమి బ్యూరో**

వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలపై సముద్ర మట్టానికి 1.5 - 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రాబోయే 48 గంటల్లోపు అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. రేపు (మంగళవారం) ఉత్తరాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్
మంగళవారం
26 । ఆగస్టు । 2025

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్‌పై మరోసారి విచారణ ఫోన్



**హైదరాబాద్-నవభూమి:** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకరరావు ఏమాత్రం సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కు తెలిపింది. కేసు దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్ర, సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు చెప్పారు. అయితే ఎన్నిసార్లు పిలిచినా తన క్లయింట్ దర్యాప్తునకు హాజరైనట్లు ప్రభాకరరావు తరపు న్యాయవాది శేషాద్రి నాయుడు కోర్టుకు వెల్లడించారు. ఇదిలావుంటే ప్రభాకర్‌రావు ఎలక్ట్రానిక్ పరికరాలు, సాక్ష్యాధారాలు టాంపరింగ్ చేశారని ప్రభుత్వ తరపు న్యాయవాది లూత్ర చెప్పారు. డేటా రికవరీ చేయడానికి కూడా సహకరించడం లేదని తెలిపారు. తాను స్వయంగా వచ్చి కేసు వివరాలు అన్ని చెప్తానని విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు పాస్ ఓవర్ ఇవ్వాలని కోరారు.మరోవైపు ప్రభాకరరావు ఇచ్చిన ఎలక్ట్రానిక్ పరికరాలన్ని ఫార్మాట్ చేసి ఇచ్చారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్టాప్ కూడా అదే స్థితిలో ఉందని, అందులో ఎలాంటి డేటా లేకుండా చేశారని చెప్పారు. వాదనలు విన్న జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం కేసు విచారణను నాలుగు వారాలపాటు వాయిదా వేసింది. ప్రభుత్వం మారిన తర్వాత ఇవన్నీ బయటకు వచ్చాయి కదా అని జస్టిస్ నాగరత్న అన్నారు. ప్రభాకరరావు దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని మరోసారి ఆదేశించారు. దర్యాప్తు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మరో నాలుగు వారాల సమయం ఇచ్చారు.

## నవ వార్త




# రాష్ట్రపతి నిజంగా ప్రధానితో రాజీనామా చేయించగలరా? అసదుద్దీన్ ఒవైసీ

**న్యూఢిల్లీ-నవభూమి:**రాష్ట్రపతి నిజంగా ప్రధానమంత్రితో రాజీనామా చేయించగలరా? అని ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రుల తొలగింపు బిల్లులను ఆయన తప్పుపట్టారు. మంత్రి మండలి సలహాల ద్వారా మాత్రమే రాష్ట్రపతి మార్గనిర్దేశం చేస్తారని రాజ్యాంగం చెబుతున్నదని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రధానిని తొలగించడానికి ప్రతిపాదిత చట్టం రాష్ట్రపతికి ఆ అధికారం ఇస్తుందా? అని పీటీఐతో అన్నారు. 'ఏ రాష్ట్రపతి అయినా ప్రధానమంత్రిని రాజీనామా చేయిస్తారా?' అని నిలదీశారు.కాగా, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలపై కూడా అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. నలుగురు లేదా ఐదుగురు రాష్ట్ర మంత్రులను అరెస్ట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుంటే, ఆ రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా పడిపోతుందని అన్నారు. 'రాష్ట్రాలకు స్వాతంత్ర్యం ఎక్కడ ఉంటుంది? వారిని నియంత్రించేది మీరే అవుతారు. నలుగురు లేదా ఐదుగురు మంత్రులను అరెస్టు చేస్తే ప్రభుత్వం పడిపోతుంది' అని కేంద్రంపై మండిపడ్డారు.మరోవైపు రాజ్యాంగంలో పేర్కొన్న అధికారాల విభజన సూత్రాన్ని ఈ బిల్లులు ఉల్లంఘిస్తాయని, ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజల హక్కును దెబ్బతీస్తాయని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఈ ప్రభుత్వం పోలీసు రాజ్యాన్ని సృష్టించాలని నిశ్చయించుకున్నది. ఎన్నికైన ప్రభుత్వానికి చరమగీతం పాడుతుంది' అని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఆయన దుయ్యబట్టారు. ఆ పార్టీ నిజంగా నైతికత గురించి మాట్లాడుతుంటే అరెస్టైన నేత కేంద్ర ప్రభుత్వ పక్షంలో చేరకూడదన్న చట్టం కూడా చేయాలని డిమాండ్ చేశారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ వైఖరి ఇదే?

**హైదరాబాద్-నవభూమి:** ఉపరాష్ట్రపతి ఎన్నికల వేళ దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఎన్డీఏ, ఇండియా కూటములు తమ అభ్యర్థులను రంగంలోకి దింపగా, తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీల వైఖరి హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా తెలంగాణలో బీఆర్ఎస్ ఏ నిర్ణయం తీసుకోబోతుందన్న దానిపై దృష్టి కేంద్రీకృతమైంది. ఎన్డీఏ తరఫున మహారాష్ట్ర గవర్నర్ రాధాక్రిష్ణన్ పోటీ చేస్తుండగా, ఇండియా కూటమి అనూహ్యంగా తెలంగాణకు చెందిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. తెలుగు వ్యక్తి పోటీలో ఉన్నందున, అన్ని పార్టీలూ రాజకీయ భేదాలను పక్కన పెట్టి మద్దతు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన ఇప్పటికే ఎన్డీఏ కూటమిలో భాగమవడంతో వారి మద్దతు సహజంగానే రాధాక్రిష్ణన్‌కే వెళ్ళనుంది. వైసీపీ విషయానికొస్తే, బీజేపీ నుంచి వచ్చిన ఆహ్వానం సానుకూలంగా పరిగణించడంతో, వారి వైఖరి కూడా స్పష్టమైంది. అయితే తెలంగాణలో పరిస్థితి భిన్నంగా ఉంది. కాంగ్రెస్, బీజేపీ తమ తమ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయనున్నాయి. ఇక బీఆర్ఎస్ మాత్రం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. బీఆర్ఎస్‌కు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకపోయినా, రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉండటం ఈ ఎన్నికల్లో వారికి ప్రాధాన్యత తెచ్చింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే స్పందిస్తూ, "మాకు రెండు కూటముల పట్ల ఎలాంటి బాధ్యత లేదు. ఎవరికీ మద్దతు ఇవ్వమనే నిబంధన లేదు" అని పేర్కొన్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, కేసీఆర్ ఇప్పటికే సన్నిహిత నేతలతో చర్చలు జరిపారు. రెండు కూటములలో ఏదో ఒకటికి మద్దతు ఇస్తే, భవిష్యత్ రాజకీయ సంబంధాలపై ప్రభావం పడుతుందని భావిస్తున్నారని తెలుస్తోంది. అందుకే బీఆర్ఎస్ తటస్థంగా ఉండే అవకాశాలు బలంగా వినిపిస్తున్నాయి. వినాయక చవితి అనంతరం పార్టీ ముఖ్య నేతల సమావేశం ఏర్పాటు చేసి కేసీఆర్ తుది నిర్ణయం వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. అందువల్ల, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ వైఖరి మాత్రమే ఇంకా అనిశ్చితిలో ఉంది. వారి నిర్ణయమే తెలంగాణలో రాబోయే రాజకీయ సమీకరణాలపై పరోక్ష ప్రభావం చూపనుంది.

# ఉల్లిగడ్డల లారీ బోల్తా.. ముంబై హైవేపై 6 కిలోమీటర్లు ట్రాఫిక్ జామ్

**సంగారెడ్డి-నవభూమి:** సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ శివారులో ఉల్లిగడ్డ లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. దీంతో ముంబై జాతీయ రహదారిపై ఆరు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి ఉల్లిలోడుతో వెళ్తున్న లారీ ఇస్నాపూర్ వద్ద అదుపుతప్పి నేషనల్ హైవేపై డివైడర్‌ను ఎక్కించడంతో బోల్తాపడింది. దీంతో లారీలోని ఉల్లి బస్తాలు రహదారిపై పడిపోయాయి. సోమవారం మధ్యాహ్నం అవుతున్నప్పటికీ లారీని అక్కడి నుంచి తీయలేదు. మరోవైపు రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు నిదానంగా కదులుతుండటంతో ఓ అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది.

# కొత్తగూడెంలోదారుణం

**(1వపేజీ తరువాయి)**గాయాల ఆనవాళ్లు కూడా ఉండటంతో వారికి అనుమానం బలపడింది.రెండేళ్లుగా తమ కుమార్తెను ఒక గదిలో బంధించి, కనీసం తమతో కూడా మాట్లాడనివ్వలేదని లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు ఆరోపించారు. అదనపు కట్నం కోసమే నరేష్, అతని కుటుంబ సభ్యులు తమ కుమార్తెను ఆహారం పెట్టకుండా హింసించి, చివరకి చంపేశారని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఏపీలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు

**(1వపేజీ తరువాయి)**ఉందని వెల్లడించారు.అలాగే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో రేపు(మంగళవారం) అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అయితే, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని.. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించారు.అలాగే, విశాఖపట్నం జిల్లాల్లో బుధవారం అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

# హైదరాబాద్ వాసులకు తీపి కబురు..
## నగరంలో 4 కొత్త పార్కులు, ఈ ప్రాంతాల్లోనే..!



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ నగరవాసులకు తీపి కబురు. నగరంలో పచ్చదనం, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు జీహెచ్ఎంసీ మరో కీలక అడుగు వేసింది. జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు జోన్లలో కొత్తగా నాలుగు పార్కులను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. వీటిని శేరిలింగంపల్లి, సికింద్రాబాద్, ఖైరతాబాద్ జోన్లలో నిర్మించనున్నారు. మొత్తం 56 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ. 30 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ పార్కుల కోసం ఖాళీ ప్రదేశాలతో పాటు చెరువుల చుట్టూ ఉన్న బఫర్ జోన్లను కూడా వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నాలుగు పార్కులను ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసి, వాటి విజయం ఆధారంగా భవిష్యత్తులో మరిన్ని పార్కులను ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను సమీకరించడానికి జీహెచ్ఎంసీ వినూత్నంగా ఆలోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్స్‌పథకం కింద కేటాయించే నిధులను ఈ ప్రాజెక్టుకు వినియోగించుకోవాలని కమిషనర్ కర్ణన్ నిర్ణయించారు. ఈ పథకం కింద కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ నుంచి రూ. 25 కోట్లు రానుండగా, మిగిలిన రూ. 5 కోట్లు తన నిధుల నుంచి భరించనుంది.జూబ్లీహిల్స్ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న రెండు చిన్న పార్కులను పెద్దవిగా మార్చనున్నారు. ఒక్కో పార్కును 18 ఎకరాల చొప్పున అభివృద్ధి చేసి, వాటిని పూర్తిగా వినియోగంలోకి తీసుకురానున్నారు. ఒక పార్కుకు రూ. 9 కోట్లు, మరో పార్కుకు రూ. 8.80 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. నల్లగండ్ల వద్ద ఉన్న హుడా లేఅవుట్ కాలనీలో 12 ఎకరాల స్థలంలో కొత్త పార్కును నిర్మించనున్నారు. ఈ పార్కుకు రూ. 7 కోట్ల అంచనా వ్యయం అవుతుందని అధికారులు తెలిపారు. నగరానికి గుండెకాయ లాంటి ఇందిరా పార్కును ఆనుకుని ఉన్న 8 ఎకరాల స్థలంలో మరో పార్కును అభివృద్ధి చేయనున్నారు. దీని కోసం సుమారు రూ. 5.50 కోట్లు ఖర్చు చేయనున్నారు.అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు ఈ పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను రూపొందిస్తున్నారు. త్వరలో అంటే వచ్చే నెల చివరి నాటికి ఈ ప్రాజెక్టులకు సంబంధించిన టెండర్లను ఆహ్వానించి నిర్మాణంతో పాటు నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించాలని జీహెచ్ఎంసీ యోచిస్తోంది. ఈ కొత్త పార్కులు నగరవాసులకు ఒక చక్కటి వినోద, విశ్రాంతి కేంద్రాలుగా మారనున్నాయి.


# గ్రామీణ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ రావడం సంతోషదాయకం: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న శ్రీమతి పటోల్ల సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**మహేశ్వరంలో మ్యాక్స్ వెల్ లైఫ్ నూతన ఆసుపత్రిని మహేశ్వరం శాసనసభ్యురాలు శ్రీమతి పటోల్ల సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.
ఆసుపత్రి ప్రారంభోత్సవం తర్వాత సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పెద్ద పెద్ద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ రావడం సంతోషకరమైన విషయం అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటు ధరలలో వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్య సిబ్బంది డాక్టర్ చందన్ రెడ్డి స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ హిమబిందు రేడియాలజిస్ట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అలాగే డాక్టర్ యశ్వంత్ రెడ్డి హాస్పిటల్ నిర్వాహక సభ్యులు నిరంజన్ ప్రభాకర్ పులిపాటి శ్రీనివాస్ దర్శన్ అలాగే అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### మ్యాక్స్ వెల్ లైఫ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన శ్రీరాములు అందెల

**మహేశ్వరం-నవభూమి:** నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మ్యాక్స్ వెల్ లైఫ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలు అందించి మంచి పేరు ప్రఖ్యాతలు పొందాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్య క్రమంలో డాక్టర్లు చందన్ రెడ్డి డాక్టర్ హిమబిందు స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి రేడియాలజిస్ట్ ఆసుపత్రి కార్యవర్గ సిబ్బంది నిరంజన్ ప్రభాకర్ పులిపాటి శ్రీనివాస్ దర్శన్ అలాగే వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న బీజేపీ నేత అందెల శ్రీరాములు

# జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో టిఎల్ఎం మేళా



**మహబూబాబాద్ టౌన్ ఆగస్టు 25, నవభూమి ప్రతినిధి:** ఇనుగుర్తి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ఇనుగుర్తి పాఠశాలలో సోమవారం టి.ఎల్.ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళా ఘనంగా నిర్వహించబడింది. ఈ మేళాలో మండలానికి చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వారు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన లో ఖర్చుతో, కొత్త ఆవిష్కరణలతో తయారైన బోధనా సాధనాలను ప్రదర్శించారు.ఇనుగుర్తి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ఇనుగుర్తి పాఠశాలలో నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు తరగతి గదిలో బోధనను మరింత సులభంగా, ఆహ్లాదకరంగా చేయాలనే ఉద్దేశంతో ు చార్టులు, గృహోపకరణాలు, మోడళ్ల వంటి సాధనాల ద్వారా పాఠ్యాంశాల బోధనకు ఉపకరించే విధంగా వివిధ రూపాల్లో టి.ఎల్.ఎంలు ప్రదర్శించబడ్డాయి.కార్యక్రమానికి మండల విద్యాధికారి జె. రూపారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఎం.పి.పి ఎస్ ఇనుగుర్తి పాఠశాల ఎల్.ఎఫ్.ఎల్ హెడ్‌మాస్టర్ బీ. వీరన్న నాయక్, జడ్జెస్ అమ్మ యాకయ్య, ప్రవీణ్ కుమార్, ఇతర ఉపాధ్యాయులు బి. రాములు, సూరం భాస్కర్, రమేష్, వెంకటేశ్వర్ చారి, సారంగపాణి, రేవతి, చైతన్య, రోజా, స్వాతి, రాజ, సులోచన, ఎస్. వీరన్న, సాయి సాగర్, రాజు, సి.ఆర్.పీ నాగవాణి, రవి తదితరులు పాల్గొన్నారు.ఈ టి.ఎల్.ఎం మేళా ద్వారా ఉపాధ్యాయుల్లో బోధనా పద్ధతులపై అవగాహన పెరిగి, విద్యార్థుల బోధనను మరింత ప్రభావవంతంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు

# ఇది ఆరంభం మాత్రమే:మంత్రి నారా లోకేశ్

**(1వపేజీ తరువాయి)**తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం అందిస్తుందని, వెయ్యి మందికి పైగా మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు**

ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, మెప్మా సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలు స్వయం ఉపాధి మార్గంలో దూసుకెళుతున్నారు. 'ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త' అనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన స్ఫూర్తితో ఈ ఏడాది మార్చి 8న ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా మెప్మా, డ్వాక్రా సంఘాల ద్వారా అర్హులైన మహిళలకు బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పించి ఎలక్ట్రిక్ స్కూటర్లు, ఆటోలను అందించారు. తొలి దశలో భాగంగా విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, గుంటూరు సహా తొమ్మిది నగరాల్లో 1,003 కుటుంబాలకు వాహనాలు అందజేశారు.ఈ పథకంలో భాగంగా ర్యాపిడో సైతం తన వంతు సహకారం అందించింది. కొత్తగా చేరిన మహిళా డ్రైవర్లకు మూడు నుంచి నాలుగు నెలల వరకు ప్లాట్‌ఫామ్ ఫీజులో మినహాయింపు ఇవ్వడంతో పాటు, తొలి ఏడాది పాటు వారి ఈఎంఐలో నెలకు రూ.1,000 అందిస్తోంది. ప్రభుత్వం కూడా స్కూటర్‌కు రూ.12,300, ఆటోకు రూ.36,000 వరకు సబ్సిడీ ఇస్తుండటంతో మహిళలపై ఆర్థిక భారం తగ్గింది.

**మూడు నెలల్లోనే అద్భుత ఫలితాలు**

ఈ పథకం ద్వారా ర్యాపిడోలో చేరిన మహిళలు కేవలం మూడు నెలల కాలంలో (మే, జూన్, జూలై) 45 వేల రైడ్లు పూర్తి చేసి సుమారు రూ.35 లక్షల ఆదాయం సంపాదించారు. విజయవాడకు చెందిన గ్లోరీ మంజు, మాధవి, భవాని వంటి ఎందరో మహిళలు ఈ పథకంతో నెలకు రూ.10,000 నుంచి రూ.16,000 వరకు సంపాదిస్తూ తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఇంటి పనులు ముగించుకుని మిగిలిన సమయంలో పనిచేస్తూ ఆర్థిక స్వాతంత్ర్యం పొందడం ఎంతో ఆనందాన్నిస్తోందని వారు చెబుతున్నారు. ఈ విజయాలను స్ఫూర్తిగా తీసుకుని, వచ్చే ఏడాదిలో మరో 4,800 మంది మహిళలకు ఈ పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# గణేష్ మండపం ఏర్పాటుకు నిబంధనలు ఇవే

**(1వపేజీ తరువాయి)**విద్యుత్ వైర్లను పిల్లలకు అందకుండా సురక్షితంగా అమర్చడం, వాలంటీర్లకు ఐడీ కార్డులు ఇవ్వడం, రాత్రిపూట కూడా భక్తుల భద్రత కోసం వారు విధుల్లో ఉండడం తప్పనిసరి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు. ఉత్సవ నిర్వాహకులు టపాకాయలు లేదా ప్రమాదకర వస్తువులను మండపాల్లో నిల్వ చేయరాదని సూచించారు. ఎమర్జెన్సీ లైట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, జనరేటర్ల ఇంధనాన్ని మండపానికి దూరంగా ఉంచాలని తెలిపారు. ఆస్పత్రులు, విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న మండపాల్లో సౌండ్ సిస్టమ్ వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని.. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినప్పుడు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.విగ్రహాల తరలింపులో ట్రాఫిక్ రద్దీ సమయాలను దాటవేయాలని, చిన్న వాహనాల్లో భారీ విగ్రహాలను తరలించకూడదని, విద్యుత్ వైర్లకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ విగ్రహాల కోసం క్రేన్‌లు వినియోగించాలి, పిల్లలను ఈ తరహా కార్యక్రమాల్లోకి అనవసరంగా తీసుకురాకూడదని హెచ్చరించారు. చివరగా.. విగ్రహ నిమజ్జనం కోసం ప్రభుత్వం కేటాయించిన అధికారిక స్థలాలను మాత్రమే వినియోగించాలని, పోలీసులు సూచించిన మార్గాల్లోనే ర్యాలీలు కొనసాగించాలని ఆదేశించారు. ఈ మార్గదర్శకాలు ఉత్సవాలు శాంతియుతంగా సాగేందుకు, భక్తులు సురక్షితంగా గణేశుని దర్శించేందుకు.. నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు కీలక పాత్ర పోషించనున్నాయి.

# పాకిస్థాన్ కు కీలక హెచ్చరిక!

**(1వపేజీ తరువాయి)**ఘర్షణ వాతావరణం నెలకొన్న తర్వాత, సంబంధాలు మరింత క్షీణించిన తరుణంలో భారత్ ఈ చర్య తీసుకోవడం ఒక సానుకూల పరిణామంగా అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ విషయంపై ఇరు దేశాల ప్రభుత్వాల నుంచి ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి ఉగ్రరూపం

**(1వపేజీ తరువాయి)**చదువు ఒక్కటే మిమ్మల్ని గుణవంతులు, ధనవంతులను చేసేదంటూ విద్యార్థులకు సీఎం రేవంత్ సూచించారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టేలా ఉన్న నిర్ణయాలను వ్యతిరేకించండి.. అందుకు నిరసన తెలపండంటూ విద్యార్థులకు క్లియర్ కట్‌గా సందేశాన్ని ఇచ్చారు. కానీ సమస్యలు పరిష్కరించేందుకు వచ్చిన వారిని మాత్రం అడ్డుకోకండంటూ విద్యార్థులకు ఆయన హితవు పలికారు. తాను మళ్లీ ఉస్మానియా యూనివర్సిటీకి వస్తానని స్పష్టం చేశారు.
ఒక్క పోలీస్ కూడా ఉండకూడదు..
డిసెంబర్‌లో మళ్లీ ఆర్ట్స్ కాలేజీలోనే మీటింగ్‌కు హాజరవుతానన్నారు. తాను వచ్చే రోజు క్యాంపస్‌లో ఒక్క పోలీస్ కూడా ఉండొద్దన్నారు. విద్యార్థులను నిరసన చేసుకోనివ్వండంటూ పోలీసులకు సూచించారు. తానను అడ్డుకునే విద్యార్థులకు సమాధానం చెబుతానంటూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.
అంతకుముందు.. ఓయూలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. రూ. 90 కోట్లతో నిర్మించిన హాస్టల్ భవనాలను సీఎం ప్రారంభించారు. అలాగే హాస్టల్ భవనాలు, డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్ భవనాలను సైతం సీఎం రేవంత్ ప్రారంభించారు. దాదాప 20 ఏళ్ల తర్వాత ఉస్మానియా యూనివర్సిటీకి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేశారు. ఓయూకి సీఎం రాక సందర్భంగా పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు సీఎం పర్యటన సందర్భంగా యూనివర్సిటీలోని విద్యార్థులు ఆందోళనకు దిగనున్నారంటూ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# స్వదేశీ ఉద్యమానికి యువతే నాయకత్వం వహించాలి:మోదీ పిలుపు

**(1వపేజీ తరువాయి)**ఇది వారిని ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా చేస్తుందని తెలిపారు. వడోదర, సూరత్, రాజ్‌కోట్, మెహసానా వంటి నగరాల్లోనూ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు బాలికా విద్య కోసం ప్రారంభించిన 'కన్యా శిక్షా రథ యాత్ర' వంటి కార్యక్రమాలు ఇప్పుడు 'బేటీ బచావో, బేటీ పఢావో' రూపంలో దేశవ్యాప్త ఉద్యమంగా మారాయని గుర్తుచేశారు.గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక అవకాశాలు కల్పించేందుకు 'లఖ్‌పతి దీదీలు', 'డ్రోన్ దీదీ', 'బ్యాంక్ సఖి' వంటి పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని మోదీ తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా భారత నైపుణ్య మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోందని అన్నారు.
సౌరశక్తి, రక్షణ, డ్రోన్ పరిశ్రమలతో పాటు స్టార్టప్‌ల రంగంలో దేశం రికార్డు స్థాయిలో పురోగమిస్తోందని చెప్పారు. ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతోనే ఈ నెలలో రూ.1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను కూడా కడియం శ్రీహరి బ్లాక్ మెయిల్ చేశారు


**(1వపేజీ తరువాయి)**ఘన్‌పూర్‌ను అభివృద్ధి చేయడం పక్కనపెట్టి, కడియం శ్రీహరి మాత్రమే అభివృద్ధి చెందారని ఆరోపించారు.శ్రీహరి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగాలను అమ్ముకున్నారని, కాంట్రాక్టర్ల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారని విమర్శించారు. అంతేకాకుండా, విదేశాల్లో ఆస్తులు కూడబెట్టారని, హైడల్ ప్రాజెక్టులను అమ్ముకున్నారని, బినామీ పేర్లతో ఆయనకు భారీగా ఆస్తులున్నాయని ఆరోపించారు. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారుతానంటూ కేసీఆర్‌ను సైతం కడియం బ్లాక్‌మెయిల్ చేశారని రాజయ్య వ్యాఖ్యానించారు.
ఫిరాయింపుల విషయంలో స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని రాజయ్య డిమాండ్ చేశారు. "జస్టిస్ బీఆర్ గవాయ్ మూడు నెలల గడువు ఇచ్చారు. స్పీకర్ రాజ్యాంగాన్ని గౌరవించి, అంబేద్కర్ మీద గౌరవం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు వింటే స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లే అవుతుంది" అని హెచ్చరించారు. కడియం శ్రీహరికి ప్రజలు కచ్చితంగా కర్రుకాల్చి వాత పెడతారని రాజయ్య జోస్యం చెప్పారు.

# నాగర్ కర్నూల్ జిల్లాలో దారుణం

**(1వపేజీ తరువాయి)**వైవాహిక జీవితం సవ్యంగానే సాగినా.. ఇటీవల ఇద్దరి మధ్య తీవ్ర మనస్పర్థలు వచ్చాయి. దీంతో శ్రావణి తన పిల్లలతో కలిసి మహబూబ్ నగర్‌లోని పుట్టింటికి వెళ్లి ఉంటోంది. ఈ నెల 21న భర్త శ్రీశైలం మహబూబ్ నగర్ వెళ్లి శ్రావణిని కలిశాడు. సోమశిల పుణ్యక్షేత్రానికి వెళ్దామని మాయమాటలు చెప్పి ఆమెను తన బైక్‌పై తీసుకెళ్లాడు. మార్గమధ్యలో శ్రీశైలం ఆమెను పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ మారేడు మాన్ దీన్నె అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అప్పటికే తన భార్యను హత్య చేయాలని నిర్ణయించుకున్న శ్రీశైలం.. అక్కడే ఆమెను దారుణంగా హత్య చేశాడు. ఎవరూ గుర్తుపట్టకుండా ఉండటానికి ఆమె శరీరాన్ని పెట్రోల్ పోసి కాల్చివేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లుగా ఇంటికి తిరిగి వెళ్లిపోయాడు.శ్రీశైలంతో వెళ్లిన తన కుమార్తె ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన శ్రావణి తండ్రి మహబూబ్ నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంటనే శ్రీశైలంను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. మొదట కుంటిసాకులు చెప్పిన శ్రీశైలం.. పోలీసుల గట్టి విచారించటంతో నేరాన్ని అంగీకరించాడు. తానే శ్రావణిని చంపానని ఒప్పుకోవడమే కాకుండా.. హత్య చేసిన స్థలాన్ని కూడా పోలీసులకు చూపించాడు. శ్రావణి తండ్రి ఫిర్యాదు ఆధారంగా మహబూబ్ నగర్ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో కలకలం సృష్టించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
మంగళవారం
26 । ఆగస్టు । 2025

## భర్తకు ప్రాణం పోద్దామనుకుంది.. పాపం తను కూడా..





**న్యూఢిల్లీ-నవభూమి:** ఒక ఆపరేషన్ రెండు జీవితాలను బలి తీసుకుంది. లివర్ సమస్యతో బాధపడుతున్న భర్తను కాపాడుకోవాలనుకున్న భార్య ప్రయత్నం ఘోరంగా బెడిసికొట్టింది. ఆపరేషన్ ఫెయిల్ అయింది. భర్తతో పాటు ఆమె కూడా చనిపోయింది. ఈ సంఘటన మహారాష్ట్రలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. పుణెకు చెందిన బాపు కోమ్కర్ గత కొన్నేళ్ల నుంచి లివర్ సమస్యతో బాధపడుతూ ఉన్నాడు.గత కొన్నినెలల నుంచి అతడి పరిస్థితి దారుణంగా తయారైంది. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తే తప్ప అతడు బతకటం కష్టమని డాక్టర్లు తేల్చి చెప్పారు. దీంతో అతడి భార్య లివర్ ఇవ్వడానికి సిద్ధమైంది. ఆగస్టు 15వ తేదీన ఆపరేషన్ జరిగింది. అయితే, ఆపరేషన్ సక్సెస్ అవ్వలేదు. బాపు ఆరోగ్యం క్షీణించింది. రెండు రోజులకే.. ఆగస్టు 17వ తేదీన అతడు చనిపోయాడు. ఆ తర్వాత కామిని లివర్ దగ్గర ఇన్‌ఫెక్షన్ మొదలైంది. డాక్టర్లు ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు.చికిత్స పొందుతూ ఆమె ఆగస్టు 21వ తేదీన చనిపోయింది. లివర్ ట్రాన్స్‌ప్లాంట్ కారణంగా ఇద్దరూ చనిపోవటంతో కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సర్జరీ జరిగిన ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరూ చనిపోయారని, ఈ మరణాలపై దర్యాప్తు చేయాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆదివారం స్పందించింది. ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రొసిజర్‌కు సంబంధించిన అన్ని వివరాలు సోమవారానికి ఇవ్వాలని ఆదేశించింది.

## పూజ కోసం పూజారికి రూ.10 పంపి రూ 5.99 లక్షలు దోచేశారు!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇవాళ చేసింది రేపు చేయకపోవటం. సీజన్ కు తగ్గట్లు.. ట్రెండ్ కు సూట్ అయ్యే కాన్సెప్టులతో మోసం చేసే విషయంలో సైబర్ నేరగాళ్ల తర్వాతే ఎవరైనా. ఎప్పటికప్పుడు కొత్త తరహాలో మోసం చేసే వారు.. తాజాగా హైదరాబాద్ లోని ఒక పూజారిని 'పూజ' పేరుతో దారుణంగా మోసం చేసిన వైనం వింటే షాక్ కు గురి కావాల్సిందే. హైదరాబాద్ లోని పాతబస్తీకి చెందిన పురానాపూల్ పూజారిని సైబర్ నేరస్తులు ఎలా ట్రాప్ చేశారన్నది చూస్తే.. సికింద్రాబాద్ మిలిటరీ ఆఫీసు నుంచి తాము ఫోన్ చేస్తున్నట్లుగా పూజారికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశారు. కల్నల్ సారు ఆరోగ్యం బాగోలేదని.. ఆయన కోసం పూజలు చేయాలని కోరారు. మొత్తం 11 రోజుల పూజ కోసం 21 మంది పురోహితుల అవసరం ఉందని పేర్కొన్నారు. పూజల కోసం అడ్వాన్స్ కింద రూ.3 లక్షలు చెల్లిస్తామని ఎర వేశారు వీరి ట్రాప్ గురించి తెలియని పురోహితుడు.. వారి మాటల్ని పూర్తిగా నమ్మేశారు అడ్వాన్సుగా రూ.10 పంపిన సైబర్ నేరగాళ్లు.. వీడియో కాల్ చేసి మిగిలిన డబ్బులు పంపుతామని నమ్మించారు. కార్డు.. పిన్ వివరాల్ని సేకరించి.. పురోహితుడు పంపిన సమాచారంతో ఆయన అకౌంట్ నుంచి విడతల వారీగా రూ.5.99 లక్షలు దోచేశారు. తాను దారుణంగా మోసపోయిన వైనాన్ని గుర్తించి వెంటనే 1930కి కాల్ చేసి సమాచారాన్ని ఇచ్చారు. అనంతరం హైదరాబాద్ సీసీఎస్ కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఏ చిన్న అవకాశం లభించినా దోచేందుకు సిద్ధంగా ఉన్న సైబర్ నేరగాళ్ల విషయంలో అందరూ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం తాజా ఉదంతం చెప్పకనే చెప్పేస్తుందని చెప్పాలి.

## విజృంభిస్తున్న కుక్కలు.. గంటకు 14 మంది!




**న్యూఢిల్లీ-నవభూమి:** సాధారణంగా కుక్కలను చాలామంది ఇళ్లల్లో పెంచుకుంటూ కుటుంబ సభ్యులతో సమానంగా చూసుకుంటున్న విషయం తెలిసిందే. ఇక పెంపుడు కుక్కల సంగతి పక్కన పెడితే.. వీధి కుక్కల గురించి ఇప్పుడు అందరి ఆందోళన మొదలైంది. రాష్ట్రంలో కుక్కల బెడదకు పరిష్కారం ఎప్పుడు ? అనే ప్రశ్న తలెత్తుతోంది. ముఖ్యంగా కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం కావడంతో అటు తెలంగాణతో పాటు దేశంలోని చాలా ప్రాంతాలలో వీటి సంఖ్య భారీగా పెరిగిపోతోంది. ఇది అతి పెద్ద సమస్యగా మారిపోయిందని చెప్పవచ్చు. రాష్ట్రంలో గత ఏడాది సగటున గంటకు 14 మంది కుక్కకాటుకు గురయ్యారు. మొత్తం 13 మంది రేబిస్ బారిన పడి ఏకంగా ప్రాణాలనే కోల్పోయారు. ఈ వీధి కుక్కలు చిన్న పిల్లల్ని టార్గెట్ చేస్తూ దాడి చేస్తున్న వైనం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా వీధిలో ఆడుకుంటున్నప్పుడు, స్కూల్స్ కి వెళ్తున్నప్పుడు ఎక్కువగా చిన్నపిల్లలే ఈ కుక్క కాటుకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 2024లో 1,21,997 మందిని, ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 87,366 మందిని కుక్కలు కరిచాయి. ఇక గత ఏడాది దేశవ్యాప్తంగా చూసుకుంటే.. దాదాపు 37 లక్షల మంది ఈ కుక్కకాటు బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అటు ఢిల్లీలో కూడా ఈ ఏడాది ప్రథమార్థంలో 35,198 మంది కుక్కకాటుకు గురవడం నిజంగా ఆశ్చర్యకరమనే చెప్పాలి. ఇక్కడ మరో ఆశ్చర్యపరిచే అంశం ఏమిటంటే.. డబ్ల్యూహెచ్వో లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే రేబిస్ మరణాలలో 36% భారత్ నుండే కావడం గమనార్హం. బాధితులలో దాదాపు 15 ఏళ్ల లోపు వారే అధికంగా ఉన్నారు. ఇక వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ఇటీవల సుప్రీంకోర్టు కూడా ఢిల్లీ రోడ్లపై కుక్కలు కనిపించకుండా వాటన్నింటినీ సంరక్షణ కేంద్రాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఈ సమస్యపై విచారణకు సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తూ.. కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టకూడదని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ప్రజలను, వారి ప్రాణాలను పిల్లలను దృష్టిలో పెట్టుకొని సుప్రీంకోర్టు ఇలాంటి తీర్పు ఇస్తే.. కొంతమంది సెలబ్రిటీలు, జంతు ప్రేమికులు మాత్రం సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు అంటూ చాలామంది ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జంతువు ప్రేమికులు రోడ్డెక్కి మరీ నిరసనలు వ్యక్తం చేశారు. ఇంకోవైపు కుక్క కాటు బాధితులు, వారి మద్దతుదారులు పోటాపోటీగా శునక ప్రేమికుల వాదనలకు ప్రతి వాదాలు చేస్తున్నారు. వాస్తవానికి మన దేశంలో జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టం 1960 ప్రకారం ప్రజలకు హాని చేసే కుక్కలకు ప్రశాంత మరణాన్ని ఇవ్వాలి అని జిహెచ్ఎంసి చట్టం స్పష్టం చేసింది. ఇకపోతే తెలంగాణలో 20 లక్షల కుక్కలు ఉండవచ్చుని.. రెండు ఉండాల్సిన వీధిలో 20 వరకు కుక్కలు ఉన్నాయని.. సమస్యను కట్టడి చేయాలి అంటే సంతాన నిరోధక ఆపరేషన్లు చేయాలి అని కొంతమంది కామెంట్లు చేశారు. కానీ ప్రభుత్వాల వద్ద ఉన్న మౌలిక సౌకర్యాల సమస్యతో ఈ పద్ధతి అమలు కావట్లేదు. మరి భవిష్యత్తులోనైనా శునకాల సంఖ్యను తగ్గించాలని ప్రజలు కోరుకుంటున్నారు. మరి దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## ప్రేమ పెళ్లి చేసుకున్న ఏడాది తర్వాత.. అల్లుడ్ని కొట్టి చంపిన మామ


**భోపాల్-నవభూమి:** కుమార్తెను ప్రేమ పెళ్లి చేసుకున్న వ్యక్తిపై అత్తింటి కుటుంబం కక్షగట్టింది. ఏడాది తర్వాత గ్రామానికి వచ్చిన అల్లుడ్ని మామ, మరికొందరు దారుణంగా కొట్టి చంపారు.మృతుడి భార్య ఫిర్యాదుతో ఆమె తండ్రి, ఇతర కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హర్సి గ్రామానికి చెందిన ఓంప్రకాష్ బాథమ్ ఏడాది కిందట అదే గ్రామానికి చెందిన శివానీ ఝూను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. శివానీ కుటుంబం వీరి పెళ్లిని వ్యతిరేకించింది. దీంతో ఈ జంట తమ కుటుంబాలకు దూరంగా దబ్రాలో నివసిస్తున్నారు.కాగా, ఆగస్ట్ 19న ఓంప్రకాష్ తన భార్యతో కలిసి సొంత గ్రామానికి తిరిగి వచ్చాడు. అయితే శివానీ తండ్రి, సోదరుడు, ఇతర బంధువులు, పొరుగువారితో కలిసి కర్రలతో ఓంప్రకాష్‌పై దాడి చేశారు. అతడ్ని దారుణంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన అతడ్ని గ్వాలియర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న ఓంప్రకాష్ గాయాల నుంచి కోలుకోలేకపోయాడు. ఆరు రోజుల తర్వాత మరణించాడు.

# లైంగిక ఆరోపణలతో కాంగ్రెస్ యువనేతకు గట్టి షాక్




**చెన్నై- నవభూమి:** కేరళ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కూటథిల్‌పై వరుసగా లైంగిక ఆరోపణలు వస్తున్నాయి. ముందుగా నటి ప్రారంభించగా.. ఆ తర్వాత ఈయను ఓ మహిళను బెదిరిస్తున్న ఆడియో క్లిప్ వైరల్ అయింది. దీంతో బీజేపీ పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తోంది. పార్టీ నుంచి ఎమ్మెల్యే పదవి నుంచి ఆయన్ను తీసేయాలని డిమాండ్ చేసింది. ఈక్రమంలోనే ఎమ్మెల్యే.. యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అయినా నిరసనల జ్వాలలు ఆగకపోవడంతో.. తాజాగా కాంగ్రెస్ పార్టీ కూడా స్పందించింది. ఆరోపణలను తీవ్రంగా పరిగణిస్తూ.. ఎమ్మెల్యేపై పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.నటి రిని జార్జ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ఒక యువ ఎమ్మెల్యే తనను లైంగికంగా వేధిస్తున్నాడని చెప్పారు. అసభ్యకరమైన సందేశాలు, అభ్యంతరకరమైన చిత్రాలు పంపిస్తున్నాడని ఆరోపించారు. అలాగే తరచుగా తనను ఫైవ్ స్టార్ హోటళ్లో రూమ్ బుక్ చేశాను రమ్మంటున్నాడని కూడా చెప్పుకొచ్చారు. అయితే ఈ సమస్యపై పార్టీలోని సీనియర్ నాయకులను కలిసి ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని వివరించారు. ఆరోపణలు వస్తే చర్యలు తీసుకోవడానికి బదులుగా.. ఆ నాయకుడికి ఉన్నత పదవులు కట్టబెట్టారని కూడా వాపోయారు. నేరుగా ఈమె పేరు ప్రస్తావించకపోయినా బీజేపీ నేతలు మాత్రం.. నటి రిని జార్జ్‌ను వేధించింది పాలక్కాడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కూటథిలే అని తెలిపారు. ఆయన్ను యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి, ఎమ్మెల్యే పదవి నుంచి కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలోనే ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కూటథిల్..యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అయినప్పటికీ బీజేపీ నిరసనలను కొనసాగిస్తూనే వస్తోంది. ఇదే సమయంలో ఈయనకు సంబంధించిన మరో ఆడియో లీక్ అయింది. అందులో ఈయన ఓ మహిళను గర్భస్రావం చేయించుకోవాలని బలవంతం చేశారు. అలాగే చెప్పినట్లు వినకపోతే నీ ప్రాణాలు తీస్తానంటూ కూడా హెచ్చరించారు.ఇలా ఎమ్మెల్యేపై లైంగిక ఆరోపణలు ఎక్కువ కావడం.. దేశవ్యాప్తంగా ఈ విషయం రచ్చ లేపడంతో కాంగ్రెస్ పార్టీపై చర్యలు తీసుకోవాలనే ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కేరళ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన రాహుల్ మామ్‌కూటథిల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. ముఖ్యంగా ఆరు నెలల పాటు ఆయన్ను ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసింది.దీనిపై తాజాగా రాహుల్ మామ్‌కూటథిల్ స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తన వాదనకు మద్దతుగా కొన్ని వాట్సాప్ చాట్‌లు, ఫోన్ సంభాషణల ఆడియో రికార్డులను విడుదల చేశారు. అయితే మహిళను గర్భస్రావం చేయించుకోమని బలవంతం చేసిన ఆడియో టేప్ ఎవరో కావాలనే తయారు చేశారని ఆరోపించారు. మరోవైపు ఈ కేసును కేరళ మహిళా కమిషన్, బాలల హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించాయి. చూడాలి మరి ముమ్ముందు ఏం జరగనుంది అనేది.

## ఎక్కడ బెస్ట్ డీల్ ఉంటే అక్కడే చమురు కొంటాం: మరోసారి భారత్ క్లారిటీ



**న్యూఢిల్లీ-నవభూమి:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కోపంతో భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలతో పాటు ఇతర పెనాల్టీలు విధించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ వ్యవహారంపై పశ్చిమ దేశాల విమర్శలను ఇండియా ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తోంది. తాజాగా రష్యాకు భారత రాయబారి వినయ్ కుమార్ కూడా ఈ అంశంపై స్పందించారు. భారత దేశానికి ఎక్కడ ఉత్తమమైన ఒప్పందం లభిస్తే.. అక్కడి నుంచే చమురు కొనుగోళ్లను కొనసాగిస్తుందని గట్టిగా చెప్పారు.రష్యా వార్తా సంస్థ 'టాస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వినయ్ కుమార్ మాట్లాడుతూ.. భారతదేశ ఇంధన విధానం తన 140 కోట్ల ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడమే లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. భారతదేశానికి నమ్మకమైన ఇంధన సరఫరాను నిర్ధారించుకోవడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్నారు. అంతేకాకుండా రష్యా వంటి దేశాలతో భారతదేశ సహకారం ప్రపంచ చమురు మార్కెట్‌ను స్థిరంగా ఉంచడానికి గణనీయంగా సహాయ పడిందని ఆయన నొక్కి చెప్పారు. ఈ సహకారం వల్ల ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు అదుపులో ఉన్నాయని తెలిపారు.భారతీయ వస్తువులపై అదనపు సుంకాలు, ముఖ్యంగా రష్యా ముడి చమురు కొనుగోళ్లపై 50 శాతం సుంకం విధించాలనే అమెరికా నిర్ణయాన్ని వినయ్ కుమార్.. అన్యాయమైనది, అసంబద్ధమైనది, అసమంజసమైనదిగా అభివర్ణించారు. భారతదేశం తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. లావాదేవీల నిబంధనలు సక్రమంగా ఉంటే.. భారతీయ కంపెనీలు వాణిజ్యపరమైన ప్రాతిపదికన చమురు కొనుగోళ్లను కొనసాగిస్తాయని వివరించారు. ఇదే సమయంలో అమెరికా, ఐరోపా దేశాలతో సహా అనేక ఇతర దేశాలు కూడా రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయని ఆయన గుర్తు చేశారు.ఇటీవలే భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా ఈ అంశంపై స్పందించారు. అమెరికాకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. భారత్ నుంచి చమురు, శుద్ధి చేసిన ఏవైనా ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో ఏదైనా సమస్య ఉంటే.. కొనడం మానేయాలని సూటిగా చెప్పారు. దేశ ప్రయోజనాలను కాపాడటంలో భారత్ ఎప్పుడూ రాజీపడదని స్పష్టం చేశారు. రైతులు, చిరు వ్యాపారుల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని తేల్చి చెప్పారు. రష్యా నుంచి చమురు కొనాలన్నది ఆర్థిక భద్రత కోసమేనని, ఎవరి ఒత్తిడితో కాదని ఆయన కుండబద్దలు కొట్టారు.

## సీఎంపై కత్తితో దాడికి కుట్ర, సుప్రీం కోర్టు సహా 3 చోట్ల విఫలయత్నం: దర్యాప్తులో సంచలన విషయాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తాపై ఇటీవల జరిగిన దాడి దేశవ్యాప్తంగా కలకలం సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేష్ సకారియాగా గుర్తించి పోలీసులు ఇప్పటికే అతడిని అరెస్ట్ చేశారు. అయితే కేసును విచారిస్తూ పోతుండగా.. సంచలనాత్మక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడి కేవలం ఆవేశంలో జరిగిన సంఘటన కాదని.. పక్కా ప్రణాళికతో చేపట్టిన కుట్ర అని దర్యాప్తులో తేలింది. ముఖ్యమంత్రిపై కత్తితో దాడి చేయాలని నిందితుడు ప్లాన్ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిని అమలు చేయడానికి అతను ఏకంగా సుప్రీంకోర్టుతో సహా మూడు చోట్ల యత్నించడం గమనార్హం.ఢిల్లీలో వీధి కుక్కలను అదుపు చేసే విషయమై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు, ముఖ్యమంత్రి వైఖరిపై రాజేష్ సకారియా తీవ్ర ఆగ్రహంతో ఉన్నాడు. ఈ ఆగ్రహంతోనే అతను ముఖ్యమంత్రిపై దాడి చేయాలని నిర్ణయించుకున్నాడు. దాడికి ఉపయోగించేందుకు ఒక కత్తిని కొనుగోలు చేసి వెంట పెట్టుకున్నాడు. ముందుగా సుప్రీం కోర్టు ఆదేశాలను నిరసిస్తూ సుప్రీం కోర్టుకు వెళ్లాడు. అక్కడ భద్రతను చూసి భయపడి తన ప్లాన్ మార్చుకున్నాడు. అక్కడ ఉన్న కట్టుదిట్టమైన భద్రత కారణంగా.. తన కత్తి ప్లాన్ అక్కడ అమలు చేయడం సాధ్యం కాదని భావించి అక్కడి నుంచి వెనుదిరిగాడు.సుప్రీం కోర్టు నుంచి వెనక్కి వచ్చిన తర్వాత రాజేష్ సకారియా తన లక్ష్యాన్ని మార్చుకుని.. ముఖ్యమంత్రి రేఖ గుప్తా నివాసమైన షాలిమార్ బాగ్ నివాసానికి వెళ్లాడు. కానీ అక్కడ కూడా అధిక భద్రత ఉండటంతో తన ప్లాన్‌ను మళ్లీ మార్చుకున్నాడు. ఆ తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్న సివిల్ లైన్స్ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడి 'జన సునవాయి' (ప్రజా వినతి) సమావేశంలోకి ప్రవేశించి.. మళ్లీ కత్తితో దాడి చేయాలని భావించాడు. కానీ అక్కడ కూడా భద్రతా సిబ్బందిని చూసి, భయపడి తన వద్ద ఉన్న కత్తిని పడేసి పారిపోయాడు. ఈ మూడు ప్రయత్నాలు విఫలం అయినప్పటికీ.. ముఖ్యమంత్రిపై దాడి చేయాలనే ఉద్దేశాన్ని మాత్రం అతను వదులుకోలేదు.చివరికి జైళ్లో ఉన్న తన బంధువను విడిపించడానికి సాయం కావాలంటూ.. జన్ సునవాయి కార్యక్రమానికి వెళ్లాడు. అక్కేడ ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేసేందుకు.. ఆమెకు దగ్గరగా వెళ్లిన రాజేష్ దాడికి పాల్పడ్డాడు. ముందుగా ఆమెను తోసి ఆపై చెంపపై కొట్టాడు. అలాగే జుట్టు పట్టుకొని లాగాడు. కత్తితో దాడి చేయాలనే తన అసలు ప్లాన్ విఫలమైనప్పటికీ... చివరికి అతను ఈ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన జరిగిన వెంటనే పోలీసులు అతడిని అరెస్టు చేశారు. పోలీసుల విచారణలో అతడి స్నేహితుడు తాహసీన్ సయ్యద్ కూడా ఈ దాడిలో సహకరించినట్లు తేలింది.ఈక్రమంలోనే తాహసీన్ సయ్యద్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే దాడికి ముందు రాజేష్‌కు తాహసీన్ డబ్బు పంపాడని.. నిరంతరం వీరిద్దరూ ఫోన్లో మాట్లాడుకున్నాడని పోలీసులు తెలిపారు. ఇద్దరి మధ్య జరిగిన వాట్సాప్ చాట్, కాల్ డేటాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదేదో ఆవేశంలో జరిగిన దాడి కాదని.. పథకం ప్రకారం చేసిన కుట్ర అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాజేష్ సకారియాతో పాటు అతడి స్నేహితుడిని కూడా విచారిస్తున్నారు. ఈ ఘటనలో ఇంకా ఎవరెవరు భాగమయ్యారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

## ఆడపిల్ల పుడితే అణా పైసా తీసుకోకుండా కాన్పు..

### పేదల పాలిట దేవుడిగా మారిన ఈ డాక్టర్ కథ వింటారా?



**న్యూఢిల్లీ-నవభూమి:** రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం అది. అయితే భర్త కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా.. ప్రస్తుతం భార్య గర్భవతి. ఇటీవలే నెలలు కూడా నిండాయి. ఎలాగైనా ప్రభుత్వాసుపత్రిలోనే పురుడు పోసుకోవాలని అనుకున్నారు. కానీ దురదృష్టవశాత్తు ఆమెకు ఉన్నట్టుండి నొప్పులు ప్రారంభం అయ్యాయి. దీంతో భయపడ్డ భర్త వెంటనే భార్యను దగ్గర్లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. ఆమె నొప్పులు ఎక్కువయ్యాయని, వెంటనే శస్త్ర చికిత్స చేసి బిడ్డను బయటకు తీయాలని చెప్పారు. లేకపోతే ఇద్దరి ప్రాణాలకు ప్రమాదం అన్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోని కూలీ వెంటనే వైద్యం చేయమని చెప్పాడు. భార్యను వైద్యులు లోపలికి తీసుకెళ్లిన దగ్గర నుంచి అతడి మనసు మనసులో లేదు. భార్యా బిడ్డకు ఏమవుతుందోనన్న బాధ కంటే.. వైద్యులు వచ్చి ఫీజు అడిగితే ఏం చెల్లించాలా అనే భయపడుతున్నాడు. ఎందుకంటే అతడి చేతిలో ఒక్క రూపాయి కూడా లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఆ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించాల్సి వస్తోందని.. మదన పడుతూనే ఉన్నాడు. ఇంతలోనే డాక్టర్ బయటకు వచ్చాడు. శస్త్రచికిత్స పూర్తయిందని చెప్పాడు. దీంతో వెంటనే కూలీ ఎవరు పుట్టారు సార్, నా భార్య ఎలా ఉందంటూ అడిగాడు.

అందుకు ఆ వైద్యుడు నీకు ఏంజెల్ పుట్టిందని చెప్పాడు. భార్య కూడా చక్కగా ఉందని వివరించాడు. తెగ సంబర పడిపోయిన కూలీ.. వెంటనే ముఖం మార్చుకున్నాడు. సార్ నా దగ్గర ఇప్పుడు డబ్బులు లేవు, నాకు ఉన్న ఒక్కగానొక్క పూరీ పాకను అమ్మి అయినా డబ్బులు తెస్తానంటూ చెప్పాడు. మొత్తం ఎంత అవుతుందని అడిగాడు. కానీ అప్పుడాక్టర్ నవ్వుతూ.. ఇక్కడ ఏంజెల్స్ పుడితే డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నాడు. నీ దగ్గర మేము ఒక్క రూపాయి కూడా తీసుకోమని చెప్పాడు. దీంతో అప్పటి వరకు భయంతో వణికిపోయిన కూలీ.. ఆనందానికి ఒక్కసారిగా అవధులు లేకుండా పోయాయి.

ఇది నిజమేనా సార్ అంటూ వెంటనే ఆ వైద్యుడి కాళ్లపై పడిపోయాడు. మీరు దేవుడు సార్ అంటూ.. మీ రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేనని చెప్పాడు. వెంటనే వైద్యుడు కూలీని కాళ్లపైనుంచి లేపి భార్యా బిడ్డల్ని చక్కగా చూసుకో అని చెప్పి వెళ్లిపోయాడు. ఆ తర్వాతే ఆ కూలీకి అసలు కథ తెలిసింది. తన భార్యకు డెలివరీ చేసిన వైద్యుడి పేరు డాక్టర్ గణేష్ రాఖ్ అని.. ఆ ఆస్పత్రిలో గత 14 ఏళ్లుగా ఆడపిల్ల పుడితే వైద్యం ఉచితంగా అందిస్తున్నారని. ఈ దవాఖానా మరేదో కాదు మహారాష్ట్రలోని పుణే హడిదాప్సార్ ప్రాంతానికి చెందిన మెడికేర్. ఇప్పటి వరకు డాక్టర్ గణేష్ రాఖ్ 1000 మందికి పైగా ఆడపిల్లలకు డెలివరీలు చేయగా.. వారెవరికీ ఫీజు తీసుకోలేదు.

## 'సుప్రీం' తీర్పు వక్రీకరణ సబబు కాదు.. అమిత్ షా వ్యాఖ్యలను ఖండించిన రిటైర్డ్ జడ్జిలు



**న్యూఢిల్లీ-నవభూమి:** సల్వాజుడుం రద్దు కేసులో సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించి మాట్లాడటం సరికాదని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సుప్రీం తీర్పును తప్పుగా అర్థం చేసుకుంటున్నారని సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన ప్రముఖ విశ్రాంత న్యాయమూర్తులు అన్నారు. ఈ మేరకు అమిత్ షా వ్యాఖ్యలను ఒక ప్రకటనలో ఖండించారు.అమిత్ షా వ్యాఖ్యలను ఖండించిన వారిలో జస్టిస్ సంజీవ్ బెనర్జి, జస్టిస్ అంజనా ప్రకాష్, జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ కైలాష్ గంభీర్, జస్టిస్ మదన్, జస్టిస్ జేసీ, జస్టిస్ కురియన్, జస్టిస్ విక్రమ్, జస్టిస్ ఏకే పట్నాయక్, జస్టిస్ గోపాల్ గౌడ, జస్టిస్ మురళీధర్, జస్టిస్ గోవింద్ మథుర్, జస్టిస్ చంద్రు, జస్టిస్ గోపాల్ రెడ్డి, జస్టిస్ కన్నన్, జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ మోహన్ గోపాల్, జస్టిస్ సీహెచ్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ రఘురామ్ ఉన్నారు.సల్వాజుడుం కేసు తీర్పులో నక్సలిజాన్ని గానీ, దాని భావజాలాన్నిగానీ ఎక్కడా సమర్థించినట్లు పేర్కొనలేదని విశ్రాంత న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి తరపున ప్రచారం కోసం అమిత్ షా అటువంటి వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదని తప్పుబట్టారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు గౌరవప్రదంగా, భావజాల కేంద్రీకృతంగా జరగాల్సిన ఎన్నికలని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు వ్యక్తుల మధ్య జరగవని, అయినప్పటికీ అత్యున్నత పదవిలో ఉన్న హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు.ఇది సుప్రీంకోర్టు న్యాయమూర్తులపైనా ప్రభావం చూపనుందని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఇకనైనా ఉపరాష్ట్రపతి ఎన్నికను గౌరవప్రదంగా భావించాలని, వ్యక్తిగత దూషణలు, పేరుపెట్టి అవమానించడం వంటి అసభ్య రాజకీయాలకు చోటు ఉండకూడదనీ రిటైర్డ్ జడ్జెస్ అమిత్ షాకు హితవు పలికారు.

## 'ప్రజాస్వామ్యాన్ని బీజేపీ అపహాస్యం చేసింది'..

### ఎస్ఎస్సీ అభ్యర్థులపై లాఠీ-ఛార్జ్‌ను ఖండించిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రజాస్వామ్యాన్ని బీజేపీ అపహాస్యం చేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మండిపడ్డారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిరసన చేస్తున్న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) అభ్యర్థులపై లాఠీఛార్జ్ చేయడాన్ని సోమవారం ఆయన ఖండించారు. ఢిల్లీ సీఎం రేఖ గుప్తా నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఎస్ఎస్సీ పరీక్షలో అక్రమాలకు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు అణగదొక్కేందుకు వారి గొంతులు నొక్కేందుకు బీజేపీ ప్రభుత్వం బలప్రయోగం చేస్తున్నదని ఆరోపించారు. నెలల తరబడి న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులపై శనివారం రాత్రి వేళ చీకటిలో లాఠీఛార్జ్ చేశారని దుయ్యబట్టారు.

కాగా, ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కాకుండా మొత్తం వ్యవస్థను బీజేపీ అపహాస్యం చేసిందని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. 'బీజేపీ నియంతృత్వం, దుండగులు పాలన చూడండి. దేశంలో బహిరంగ దుండగులు రాజ్యమేలుతున్నారు. బీజేపీని ప్రశ్నించే వారిపై లాఠీఛార్జ్ ద్వారా నోరు మూయిస్తున్నారు. ఎవరినైనా అరెస్టు చేసి జైలులో పెట్టవచ్చు. ఏ చట్టాన్నైనా వారు కోరుకున్నప్పుడల్లా మార్చవచ్చు. ఎవరైనా బీజేపీకి ఓటు వేయకపోతే, వారి ఓటు తొలగించవచ్చు' అని ఎక్స్ పోస్ట్‌లో విమర్శించారు.

## ప్రధాని మోదీ డిగ్రీపై వివాదం.. సీఐసీ ఆదేశాలను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాని నరేంద్ర మోదీడిగ్రీ చదువు గురించి సమాచారం వెల్లడించాలని సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు అడ్డుకున్నది. ఆ ఆదేశాలను హైకోర్టు పక్కనపెట్టేసింది. జస్టిస్ సచిన్ దత్తా ఫిబ్రవరి 27వ తేదీన తీర్పును రిజర్వ్ చేశారు. అయితే సీఐసీ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఢిల్లీ యూనివర్సిటీ దాఖలు చేసిన పిటీషన్‌పై కోర్టు తీర్పునిచ్చింది. నీరజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఆర్టీఐ దరఖాస్తు ఆధారంగా.. 1978లో బీఏ పరీక్షలు పాసైన విద్యార్థుల రికార్డులను తనిఖీ చేయాలని 2016, డిసెంబర్ 21వ తేదీన సీఐసీ ఆదేశాలు జారీ చేసింది.ఆ ఆదేశాలను తాజాగా హైకోర్టు కొట్టిపారేసింది. వర్సిటీకి అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది. 1978లో ప్రధాని మోదీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఇదే కేసుపై గతంలో ఢిల్లీ వర్సిటీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. సీఐసీ ఆదేశాలను కొట్టిపారేయాలని ఆయన కోరారు. ప్రధాని డిగ్రీ వివరాలను వెల్లడించేందుకు ఢిల్లీ వర్సిటీకి ఎటువంటి అభ్యంతరాలు లేవని ఆయన తెలిపారు.

## ఆధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ



**భువనేశ్వర్-నవభూమి:** అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ తొలి విమాన పరీక్షలను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ విజయవంతంగా నిర్వహించింది. దేశీయంగా అభివృద్ధి చేసిన వాయు రక్షణ వ్యవస్థను శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఒడిశా తీరంలో పరీక్షించింది. వివిధ పొరలతో కూడిన వాయు రక్షణ వ్యవస్థ ఐసీడీడబ్ల్యూఎస్.. ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులు, వాయు రక్షణ వ్యవస్థ క్షిపణులు, అధిక శక్తిగల లేజర్ ఆధారిత డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ వ్యవస్థను కలిగి ఉంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌ఎస్‌డీఓ, సాయుధ దళాలను ఎక్స్ వేదికగా అభినందించారు. ఐఏడీడబ్ల్యూఎస్‌ను ఆగస్టు 23న 12.30 గంటల సమయంలో ఒడిశా తీరం నుంచి డీఆర్‌డీఓ విజయంతంగా పరీక్షించిందని చెప్పారు. ఇది బహుళ అంచెల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ అని, ఇందులో భారత్ అభివృద్ధి చేసిన క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌మిసైల్స్, హైపవర్ లేజర్ ఆధారిత డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ (%ణజుఔ%) ఉన్నాయన్నారు. ఐఏడీడబ్ల్యూఎస్‌ను విజయవంతంగా అభివృద్ధి చేసిన డీఆర్డీఓ, సైనిక దళాలను అభినందిస్తున్నానని చెప్పారు. ఈ ప్రత్యేకమైన పరీక్ష బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ సామర్థ్యాని తెలియజేసిందన్నారు. శత్రువులు ప్రయోగించే గగనతల ఆయుధాల నుంచి ఆయా ప్రాంతాల రక్షణను ఇది బలోపేతం చేయనుందని వెల్లడించారు.

## అంతరిక్షపరిశోధనలో నవ శకం

భారతదేశం అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలు కేవలం శాస్త్రీయ ఘట్టాలుగానే కాకుండా జాతీయ గర్వానికి ప్రతీకలుగా నిలిచాయి. ఒకప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశంగా బాహ్య సహాయంపై ఆధారపడి ఉన్న భారత్ నేడు తన స్వంత సాంకేతిక శక్తితో విశ్వ రహస్యాలను చేధించగల శక్తిని ప్రదర్శిస్తోంది. ఈ విజయాల వెనుక ఉన్న చరిత్ర, శ్రమ, శాస్త్రవేత్తల ప్రతిభ, ప్రభుత్వాల కట్టుబాటు అన్నీ కలిసే ఈ రోజున భారత్‌ను ప్రపంచ వేదికపై అంతరిక్ష రంగంలో అగ్రగామిగా నిలబెట్టాయి. 1960లలో డా. విక్రమ్ సారాభాయి స్వప్నం సాదాసీదా అయినప్పటికీ మహత్తరమైనదే. ఆయన దృష్టిలో అంతరిక్ష సాంకేతికత కేవలం శాస్త్రజ్ఞుల ప్రదర్శన కోసం కాదుబీ అది పేదల అభివృద్ధికి, విద్య, వైద్యం, కమ్యూనికేషన్ రంగాల్లో ఉపయోగపడాలన్నదే లక్ష్యం. ఆయన ఆరంభించిన పథకాలు, ఆవిష్కరణలు, విజన్ ఇవన్నీ భారత అంతరిక్ష పరిశోధన పునాది రాళ్లుగా నిలిచాయి. 1975లో ఆర్యభట్ట ఉపగ్రహాన్ని ప్రయోగించడం భారతదేశానికి మొదటి అంతరిక్ష విజయంగా నిలిచింది. 1980లో %ూాం%-3 రాకెట్ ద్వారా రోహిణి ఉపగ్రహాన్ని భూమి కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం మరో ముఖ్య ఘట్టం. ఈ చిన్న విజయాలు తర్వాతి పెద్ద మైలురాళ్లకు దారితీశాయి. 2008లో చంద్రయాన్%-%1 ప్రయోగం చంద్రుడిపై నీటి ఆవిరి ఉన్నట్లు నిర్ధారించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత 2013లో మార్స్ ఆర్బిటర్ మిషన్ లేదా మంగళయాన్ ద్వారా భారత్ ప్రపంచంలో తొలిసారి తక్కువ ఖర్చుతో, మొదటి ప్రయత్నంలోనే విజయవంతంగా మార్స్ కక్ష్యలోకి చేరిన దేశంగా చరిత్ర సృష్టించింది. ఈ పంథాను కొనసాగిస్తూ 2023లో చంద్రయాన్3 మిషన్ మరో చారిత్రాత్మక ఘట్టాన్ని నమోదు చేసింది. 2023 ఆగస్టు 23న చంద్రయాన్%-%3లోని విక్రమ్ ల్యాండర్ చంద్రుని దక్షిణ ధ్రువంపై ‘శివశక్తి’ అనే ప్రదేశంలో సురక్షితంగా దిగింది. ఈ సంఘటన కేవలం భారత్‌కే కాదు, మొత్తం మానవ జాతికి గొప్ప విజయంగా నిలిచింది. చంద్రుడిపై ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా భారత్ నిలవడమే కాకుండా, దక్షిణ ధ్రువంపై ల్యాండింగ్ చేసిన మొదటి దేశం కావడం ప్రత్యేకత. చంద్రుని దక్షిణ ధ్రువప్రాంతం శాస్త్రీయంగా చాలా విలువైనది. అక్కడ నీటి మంచు ఉన్నట్లు భావిస్తున్నారు. భవిష్యత్తులో మానవ నివాసాల కోసం, అంతరిక్ష ప్రయాణాలకు ఇంధన తయారీకి, జీవన వనరుల కోసం ఈ నీరు ఉపయోగపడే అవకాశం ఉంది. కాబట్టి చంద్రయాన్3 విజయం కేవలం గణాంకాల పరిమితి కాకుండా భవిష్యత్తులో మానవజాతి ప్రయాణానికి పునాది వేస్తుంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింది. ఈ దినోత్సవం కేవలం ఒక జ్ఞాపక దినంగా కాకుండా శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కల్పించడానికి, విద్యార్థుల్లో శాస్త్రం పట్ల ఆసక్తి పెంచడానికి, భవిష్యత్తు తరాలను అంతరిక్ష రంగంలో ముందుకు నడిపించడానికి ఒక వేదికగా నిలుస్తోంది. ఈ సంవత్సరానికి నిర్ణయించిన ఇతివృత్తం “ఆర్యభట్ట నుంచి గగన్‌యాన్ వరకు: ప్రాచీన జ్ఞానం నుంచి అనంతమైన అవకాశాలు” అన్నదే. ఇది భారత అంతరిక్ష చరిత్రను స్మరించుకుంటూనే భవిష్యత్తు కలల్ని ప్రతిబింబిస్తుంది. చంద్రయాన్-3 విజయంతో ప్రేరణ పొందిన భారత్ ఇప్పుడు మరింత ప్రతిష్ఠాత్మకమైన లక్ష్యాలను ముందుంచుకుంది. వాటిలో ప్రధానమైనది గగన్‌యాన్ మిషన్. ఈ మిషన్‌లో భాగంగా భారతదేశం 2027 నాటికి తన స్వంత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించాలనే సంకల్పం చేసింది. మొదటి దశలో 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. ఆ తర్వాత మానవ సహిత గగన్‌యాన్ మిషన్ చేపడతారు. దీని లక్ష్యం భూమికి 400 కిలోమీటర్ల దూరంలో కక్ష్యలోకి భారతీయ వ్యోమగాములను పంపి వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడం. ఇది విజయవంతమైతే భారత్ మానవ సహిత అంతరిక్ష యాత్ర చేసిన నాలుగో దేశంగా చరిత్రలో నిలుస్తుంది. దీని తర్వాతి పెద్ద లక్ష్యం 2040 నాటికి భారతీయ వ్యోమగామిని చంద్రుడిపైకి పంపడం. ఇది సాధ్యమైతే భారత్ అంతరిక్ష రంగంలో మహాశక్తిగా నిలుస్తుంది. అంతరిక్ష ప్రయాణాల కోసం భారత ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని ప్రకటించింది. అదే 2035 నాటికి భారత సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించడం. ఈ కేంద్రం ద్వారా మానవ సహిత దీర్ఘకాలిక పరిశోధనలు జరగగలవు. ఔషధాలు, పదార్థ శాస్త్రం, జీవశాస్త్రంలో కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. అంతరిక్ష కేంద్రం అనేది ఏ దేశానికైనా సాంకేతిక ప్రతిభకు, ఆర్థిక శక్తికి సూచిక. ఇప్పటివరకు రష్యా, అమెరికా, చైనా మాత్రమే తమ సొంత కేంద్రాలు కలిగి ఉన్నాయి. భారత్ కూడా ఆ జాబితాలో చేరడం ఇక భవిష్యత్ మిషన్లలో చంద్రయాన్-4 ప్రత్యేకమైనది. చంద్రుడి ఉపరితలం నుంచి నమూనాలు సేకరించి భూమికి తీసుకురావడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ ప్రయత్నం అంత సులభం కాదు. దీని కోసం డాకింగ్ టెక్నాలజీ అవసరం. అంతరిక్షంలో రెండు వేర్వేరు నౌకలు కలవడం, వనరులను పంచుకోవడం చాలా క్లిష్టమైన సాంకేతికత. దీన్ని భారత్ సాధిస్తే భవిష్యత్తులో మార్స్ మిషన్లు, అంతరిక్ష కేంద్రాలు నిర్మించడం వంటి పెద్ద ప్రయోగాలకు దోహదం అవుతుంది. భారత్ జపాన్‌తో కలిసి LUPEX మిషన్ చేపట్టాలని కూడా నిర్ణయించింది. ఇది చంద్రుడిపై నీటి వనరులపై సమగ్ర పరిశోధన చేయడానికి ఉద్దేశించబడింది. చంద్రయాన్-3 విజయంతో జపాన్ స్వయంగా భారత్ సహకారం కోరడం ఇస్రో ప్రతిష్ఠను మరోస్థాయికి తీసుకెళ్లింది. ఇది భారత అంతర్జాతీయ సహకారానికి కొత్త తలుపులు తెరిచింది. భారత అంతరిక్ష రంగంలో వాణిజ్య విస్తరణ కూడా వేగంగా జరుగుతోంది. ఇస్రో తక్కువ ఖర్చుతో అధిక ఖచ్చితత్వంతో ఉపగ్రహాలను ప్రయోగిస్తోంది. వీటివల్ల వాతావరణ సూచన, టీవీ, ఇంటర్నెట్, మొబైల్ కమ్యూనికేషన్, నావిగేషన్ సేవలు, పర్యావరణ మార్పుల పరిశీలన, విపత్తుల నిర్వహణ, రక్షణ రంగంలో అనేక లాభాలు చేకూరుతున్నాయి. అంతర్జాతీయంగా కూడా అనేక దేశాలు తమ ఉపగ్రహాలను ఇస్రో ద్వారా ప్రయోగించిస్తున్నాయి. దీని ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించి దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతోంది. ఇస్రో భవిష్యత్ దిశలో పునర్వినియోగ రాకెట్ల అభివృద్ధి, చిన్న ఉపగ్రహాల ప్రయోగ వేదికలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం వంటి అంశాలు ప్రధానంగా నిలుస్తున్నాయి. పుష్పక్ అనే పునర్వినియోగ రాకెట్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో విజయవంతమైతే ఉపగ్రహ ప్రయోగ ఖర్చులు విపరీతంగా తగ్గుతాయి. చిన్న ఉపగ్రహాల ప్రయోగ వేదికల ద్వారా చిన్న కంపెనీలు, స్టార్టప్‌లు కూడా అంతరిక్ష రంగంలో భాగస్వామ్యం కావచ్చు.

### భారతదేశంలో ఓబీసీ రిజర్వేషన్లకు మూల పురుషుడు

# సంఘసంస్కర్త బిందేశ్వర్ ప్రసాద్ మండల్



భారతదేశ స్వతంత్రం తర్వాత దేశంలో వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్ల సౌకర్యం కల్పించాలని 1952 లో ఆనాటి న్యాయశాఖ మంత్రి విశ్వ రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్లమెంట్లో ప్రతిపాదించారు . ఆ యొక్క ప్రతిపాదన నాటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ , హోం శాఖ మంత్రి వల్లభాయ్ పటేల్ అడ్డుకొని పెండింగ్ లో పెట్టారు . చాలా సంవత్సరాల తర్వాత 1978 జనతా పార్టీ ఆధ్వర్యంలోని ప్రధానమంత్రి మురార్జీ దేశాయ్ ఓబీసీల రిజర్వేషన్ల అధ్యయనం కోసం దేశంలోని వెనుకబడిన తరగతుల సామాజిక ఆర్థిక జీవన విధానం అధ్యయనం చేయటానికి కమిటీని వేశారు . కమిటీ చైర్మన్ గా బీహార్ మాజీ ముఖ్యమంత్రి అప్పటి పార్లమెంట్ సభ్యులు బిందెశ్వర్ ప్రసాద్ మండల్ ను నియమించారు . ఆయన దేశవ్యాప్తంగా కమిటీ సభ్యులతో కలిసి పర్యటించి రిపోర్టును ఆనాటి భారత రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ కు సమర్పించారు . 1985 లో బీపీ మండల్ కమిషన్ రిపోర్ట్ పార్లమెంటు ముందుకు వచ్చిన దాని పెండింగ్ లో పెట్టారు . ఆ తర్వాత కాలంలో 1990 లో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రధానమంత్రి అయిన తర్వాత దేశవ్యాప్తంగా ఓబీసీలకు 27% రిజర్వేషన్లు కల్పిస్తూ కొత్త చట్టం తీసుకువచ్చారు. దాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వంలో భాగస్వామ్యం బిజెపి తమ మద్దతు ఉపసంహరించడంతో వి పి సింగ్ కేంద్ర ప్రభుత్వం పడిపోయింది.

దేశంలో అంతకుముందు స్వాతంత్రం రాకముందే అమల్లో ఉన్న రిజర్వేషన్లు ఎస్సీలకు 15 శాతం ఎస్టీలకు 7 శాతం మొత్తంగా 50 శాతం రిజర్వేషన్లు మించరాదని నాడు సుప్రీంకోర్టు తీర్పు జారీ చేసింది . నాటి నుండి నేటి వరకు ఇదే ముసాయిదా రిజర్వేషన్ల పద్ధతి నడుస్తోంది. అయితే దేశంలో రాష్ట్రాల వారిగా ఉన్న జనాభా నిష్పత్తి ప్రకారం స్థానికంగా రిజర్వేషన్లు పెంచుకోవచ్చని అంశాన్ని కూడా రాజ్యాంగంలో పొందుపరిచారు కానీ ఇందుకు రాష్ట్రపతి ఆమోదం తెలుపవలసింది . ప్రస్తుతం కూడా తెలంగాణ ప్రభుత్వం బీసీలకు కులగనున చేసి 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం అన్ని రకాల చట్టపరమైన చర్యలు తీసుకొని రాష్ట్రపతి ఆమోదానికి పంపించిన సంగతి అందరికీ తెలుసు . భారతదేశంలో రిజర్వేషన్ల పితామహుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అయితే బడుగు బలహీన వర్గాలు బహుజనుల కోసం రిజర్వేషన్ల ప్రతిపాదన తీసుకొచ్చిన వ్యక్తి బీపీ మండల్ గా చెప్పుకోవచ్చు . ఆయన రాజకీయ జీవితంలో అనేక





మలుపులు తిరిగిన ప్రజల సామాజిక హక్కుల కోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి బీపీ మండల్ సేవలను కొనియాడుతున్నారు .

**మండల్ కమిషన్ చైర్మన్‌గా**

1978 డిసెంబరులో మొరార్జీ దేశాయ్ ఐదుగురు సభ్యులు గల పౌర హక్కుల కమీషన్ వేసాడు దీనిని బి పి మండల్ చర్మన్ గా వ్యవహరించాడు. అతని కమిషన్ నివేదిక 1980 డిసెంబరు 31 లో పూర్తయింది. ప్రభుత్వ, విద్యా, ఉద్యోగ సంస్థలలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒ.బి.సి) అభ్యర్థులకు రిజర్వు సీట్లను ఒక నిష్పత్తి ప్రకారం కేటాయించాలని సిపారసు చేసాడు. కమిషన్ నివేదిక ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పరిశీలనలోకి వచ్చింది. కానీ అమలు జరగలేదు. ఒక దశాబ్దం తరువాత 1990 లో ప్రధానమంత్రి విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ఈ సిఫార్సులను ఆమోదించాడు.

**బిందేశ్వరి ప్రసాద్ మండల్ విద్య - రాజకీయం**

ఉత్తర బీహార్ లోని సహార్సాలో అత్యంత ధని కులైన యాదవ జమీందారీ భూస్వాముల కుటుంబంలో నమ్మించాడు. 25 ఆగస్టు 1918 న జన్మించాడు. మాధేపురా జిల్లాలోని మోరో గ్రామంలో పెరిగాడు. మండేపురంలో మండల్ తన ప్రాథమిక విద్యని, దర్భాంగాలో ఉన్నత పాఠశాల విద్యని పూర్తి చేసాడు. 1930 లో పాట్నా కాలేజీలో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిందు. ఆ తరువాత పై చదువులకై అతను ప్రెసిడెన్సీ కళాశాల కలకత్తాలో చేరారు. దురదృష్టవశాత్తు, ఇంట్లో కొన్ని అనివార్యమైన పరిస్థితుల కారణంగా, అతను తన చదువుని విడిచిపెట్టవలసి వచ్చింది.

బి. పి.మండల్ తన 23 వయేటా జిల్లా కౌన్సిల్ కి ఎన్నికయ్యాడు. 1945-51 మధ్య కాలములో మాధేపుర డివిజన్ లో జీతం తీసుకోకుండానే జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ గా పనిచేసాడు. అతని రాజకీయ జీవితం భారత జాతీయ కాంగ్రెస్ తో మొదలైంది. 1952 లో మొదటిసారి బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాడు. అధికార పక్షములో ఉండి బీహార్ లోని బలహీనవర్గ కుర్మీలపై అగ్రవర్ణ రాజుపుత్రులు దాడి చేయడాన్ని నిరసించాడు. 1965 లో తన నియోజకవర్గంలో భాగంగా ఉన్న గ్రామమైన పామాలో మైనారిటీలు, దళితుల పై పోలీసులు చేస్తున్న అత్యాచారాలపై మాట్లాడాలని కోరుకున్నప్పుడు అధికార పక్షములో ఉండి ఈ అంశంపై మాట్లాడకూడదని ముఖ్యమంత్రి ఆదేశిస్తే తన మనస్సాక్షిని చంపుకోలేక తను నమ్మిన విలువల కోసం ప్రతిపక్ష పాత్ర నిర్వహించి దళితులకు అండగా నిలిచారు . తరువాత

సంయుక్త సోషలిస్ట్ పార్టీ ఎస్.ఎస్.పి లో చేరాడు. ఎస్.ఎస్.పి రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్ గా నియమించబడ్డాడు. 1967 లో జరిగిన ఎన్నికలలో ఎస్.ఎస్.పి అభ్యర్థుల ఎంపిక పై ఆయన చేసిన కృషి, ఆయన ప్రచారం వల్ల 1962 లో కేవలం 7 సీట్లు కల ఆ పార్టీకి 1967 లో 69 సీట్లు వచ్చాయి. బీహార్ లో మొట్టమొదటి కాంగ్రెస్ యేతర ప్రభుత్వం ఏర్పడింది. అతను పార్లమెంటు సభ్యుడు అయినప్పటికీ మంత్రివర్గంలో చేర్చారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసాడు. కానీ పార్టీలో, ప్రభుత్వములో కొన్ని విభేదాలు రావడముతో కాంగ్రెస్ పార్టీ బయటి నుండి మద్దతు ఇవ్వడంతో 1968 ఫిబ్రవరి 1 న అతను బీహార్ రాష్ట్ర రెండవ బీసీ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించాడు.

కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటూనే రాజీ పడకుండా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల అవినీతిపై అయ్యర్ కమీషన్ వేసి విచారణ చేయించాడు. ఆ కమీషన్ నివేదికను బయలుపరచకుండా అప్పటి ప్రధాని ఇందిరాగాంధి స్వయంగా ఒత్తిడి తీసుకవచ్చింది. ప్రధానితో అతను మాట్లాడడానికి నిరాకరించడముతో ప్రభుత్వముపై అవిశ్వాస తీర్మానం పెట్టి కాంగ్రెస్ నెగ్గడంతో

30 రోజులకే బి పి మండల్ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అతను తరచూ తన మంత్రులకు, “ఓట్లను సంపాదించడానికి కులపరమైన విజ్ఞప్తి సహించవచ్చు కానీ ప్రభుత్వాల నిర్ణయాలల్లో ఏ కులతత్వాన్ని సహించవద్దు” అని చెప్పే మండల్ తన ప్రభుత్వములో పరిపాలనలో ఎక్కడ కులతత్వాన్ని ప్రదర్శించకుండా పాలించాడు.

5 మార్చ్ 1967 న అతను సోషిత్ దళ్ (అణగారిన ప్రజల పార్టీ ) ని స్థాపించాడు. 1967 నుండి 1970 వరకు లోక్‌సభ సభ్యునిగా ఉన్నాడు. 1972 లో శాసనసభకు తిరిగి ఎన్నికయ్యాడు. 1972 లో అప్పటి బీహార్ ముఖ్య మంత్రి పాండే మిథిలా యూనివర్సిటీ పేరుతో అందులో కింది ఉద్యోగి నుండి వైస్ ఛాన్సలర్ వరకు ఒకే కులం వారితో నింపాలనే ప్రయత్నాలని వ్యతిరేకించాడు. ఆ తర్వాత 1974 లో శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసి జయప్రకాష్ నారాయణ నేతృత్వములో నడుస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమములో పాల్గొన్నాడు. 1977 లో జనతా పార్టీ తరపున లోక్ సభకి ఎన్నికై 1979 వరకు కొనసాగాడు. ఎమర్జెన్సీ తర్వాత ఏర్పాటైన జనతా ప్రభుత్వం ఇందిరాగాంధీని డిబార్ చేయాలని అధికార పార్టీ సభ్యులు తెచ్చిన తీర్మానాన్ని మండల్ వ్యతిరేకించాడు. మండల్ తన రాజకీయ జీవితంలో సోషలిస్ట్ రాజకీయాల ఆలోచనపరుడిగా పనిచేసాడు.

**మండల్ కమీషన్ చైర్మన్‌గా**

1978 డిసెంబరులో మొరార్జీ దేశాయ్ ఐదుగురు సభ్యులు గల పౌర హక్కుల కమీషన్ వేసాడు దీనిని మండల్ చర్మన్ గా వ్యవహరించాడు. అతని కమిషన్ నివేదిక 1980 డిసెంబరు 31 లో పూర్తయింది. అన్ని ప్రభుత్వ, విద్యా సంస్థలలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒ.బి.సి) అభ్యర్థులకు రిజర్వు సీట్లను ఒక నిష్పత్తి ప్రకారం కేటాయించాలని సిపారసు చేసాడు. ఆనాటి నుండి దేశవ్యాప్తంగా ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి .

**వ్యక్తిగత జీవితం - కుటుంబం**

అతను 1982 ఏప్రిల్ 13 న మరణించాడు. అతని భార్య సీతా మండల్. వారికి ఐదుగురు కుమారులు ఉన్నారు. వారు రవీంద్రనాథ్ యాదవ్, సచీంద్రనాథ్ యాదవ్, మణీందర్ కుమార్ మండల్, గిరీంద్రనాథ్ మండల్, జ్యోతీంద్రనాథ్ యాదవ్. అతనికి రేనూ సింగ్, వీణా మండల్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం పోస్టల్ స్టాంపు విడుదల

భారత ప్రభుత్వం 2001లో అతని గౌరవార్థం ఒక పోస్టల్ స్టాంపును విడుదలచేసింది. 2007లో స్థాపించబడిన ఒక కళాశాలలు “బి.పి.మండల్ ఇంజనీరింగ్ కళాశాల” అని నామకరణం చేసారు.

**( జయంతిని సందర్భంగా వ్యాసం )**

**అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**9440037196**

# మదర్ థెరీసా - ఒక ప్రేరణాత్మక జీవితం

ప్రాంతాలు, మతాలు, కులాలకు అతీతంగా, ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా మానవసేవ చేసే గొప్ప మానవమూర్తులు ఈ ప్రపంచంలో చాలా అరుదుగా ఉంటారు. ఆ అరుదైన వ్యక్తులలో తమ వ్యక్తిగత జీవితాన్ని కూడా సేవకే అంకితం చేసినవారు చాలా తక్కువగా ఉంటారు. అటువంటి వారిలో మహిళలు అయితే వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. ఆ కొద్దిమందిలో మొదటి స్థానాన్ని పొందే అర్హత కేవలం ఒకే ఒక్క వ్యక్తికి సొంతం. ఆ మహిళా మూర్తి మేరీ తెరెసా బోజాక్సియు. ఇంతకీ ఆమె ఎవరు? ఆమెనే మదర్ థెరీసా.

ఆమె అల్బేనియన్ కాథలిక్ తల్లిదండ్రులైన నికోలా, డ్రానాఫైల్ బోజాక్షియులకు ఆగస్టు 26, 1910న మూడవ సంతానంగా మాసిడోనియాలోని స్కోప్జేలో జన్మించారు. ఆమె తండ్రి ఒక వ్యాపారవేత్త, తల్లి గృహిణి. ఆమెకు ఎనిమిది సంవత్సరాల వయస్సులో ఆమె తండ్రి మరణించారు. దాంతో బోజాక్షియు కుటుంబం ఆర్థికంగా కష్టాల్లో కూరుకుపోయింది. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తోచక, ఒంటరి తల్లి అయిన డ్రానాఫైల్ కుటుంబ పోషణ కోసం వస్త్రాలు ఎంబ్రాయిడరీలను విక్రయించే చిన్న వ్యాపారాన్ని ప్రారంభించారు.

పన్నెండేళ్ల వయస్సులో ఆమె సన్యాసినిగా మారి దేవుడిని సేవించాలని భావించారు. సన్యాసిని కావాలనేది ఒక కష్టమైన నిర్ణయం. పెళ్లి, పిల్లలు కనే అవకాశాన్ని వదులుకోవడమే కాకుండా కుటుంబాన్ని శాశ్వతంగా వదులుకోవాలని ఆమెకు తెలుసు. ఐదేళ్లపాటు మదర్ థెరీసా సన్యాసినిగా మారాలా వద్దా అని గట్టిగా ఆలోచించారు. ఈ సమయంలో, ఆమె చర్చి గాయక బృందంలో పాటలు పాడేవారు, చర్చి కార్యక్రమాలను నిర్వహించడంలో తన తల్లికి సహాయం చేసేవారు. పేదలకు ఆహారం, ఇతర సామాగ్రిని అందించడంలో తన తల్లికి చేదోడువాదోడుగా ఉండేవారు. చివరికి, ఒక బలమైన లక్ష్యంతో సన్యాసిని కావాలని నిర్ణయించుకున్నారు. అప్పటికి ఆమె వయస్సు 17 సంవత్సరాలు. ఐర్లాండ్‌లోని లోరెటో సన్యాసినులకు



దరఖాస్తు చేసుకున్నారు.

భారతదేశంలో క్యాథలిక్ మిషనరీలు చేస్తున్న పని గురించి అనేక కథనాలను చదివిన ఆమె జనవరి 6, 1929న మన దేశానికి చేరుకున్నారు. రెండేళ్ల తర్వాత, మే 24, 1931న లోరెటో సన్యాసినిగా తన మొదటి ప్రమాణం చేశారు. సన్యాసినిగా, మదర్ థెరీసా (అప్పట్లో సిస్టర్ థెరీసా అని మాత్రమే పిలిచేవారు, తరువాత సెయింట్ థెరీసా ఆఫ్ లిసియక్స్ ఆమె ఎంచుకున్న పేరు) కోల్‌కతాలోని లోరెటో ఎంటల్లీ పాఠశాలలో స్థిరపడ్డారు. అక్కడ పాఠశాలలో చరిత్ర, భూగోళశాస్త్రం బోధించేవారు. సాధారణంగా, లోరెటో సన్యాసినులు పాఠశాల నుండి బయటకు వెళ్లడానికి అనుమతించబడరు. అయితే, 1935లో, 25 ఏళ్ల థెరీసా పాఠశాల వెలుపల ఉన్న సెయింట్ థెరీసా పాఠశాలలో బోధించడానికి ప్రత్యేక మినహాయింపు ఇవ్వబడింది. సెయింట్ థెరీసాలో రెండు సంవత్సరాల తరువాత, థెరీసా మే 24, 1937న తన ఆఖరి ప్రమాణం చేసి అధికారికంగా “మదర్ థెరీసా” అయ్యారు. ఆమె తన చుట్టూ ఉన్నవారి బాధలు, కష్టాలను చూసి తట్టుకోలేకపోయారు, అందుకే ఆమె తన శేష జీవితాన్ని పేదలు, అణగారిన వర్గాల వారికి సేవ చేయాలని, జీవితాంతం సేవకే అంకితం కావాలని దృఢంగా నిర్ణయించుకున్నారు.

దీనికోసం మదర్ థెరీసా ఆగస్టు 16, 1948న పాఠశాలను విడిచిపెట్టి కలకత్తాలోని మురికివాడల్లో ఒక చిన్న గుడిసెలో చిన్నపిల్లలకు పాఠాలు చెప్పడం ప్రారంభించారు. అక్టోబర్ 7, 1950న ఆకలితో ఉన్నవారు, నిరాశ్రయులు, వికలాంగులు, అంధులు, కుష్టురోగులు, సమాజం అంతటా ప్రేమించబడని, పట్టించుకోబడని, అవాంఛనీయమైనవారందరికీ సేవ చేయాలనే లక్ష్యంతో కోల్‌కతాలో పన్నెండు మంది సభ్యులతో ఒక చిన్న సంఘంగా మిషనరీస్ ఆఫ్ ఛారిటీని స్థాపించారు. మిషనరీస్ ఆఫ్ ఛారిటీ కోల్‌కతా అంతటా లెప్రసీ-ఔట్రీచ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, మందులు, డ్రెస్సింగ్‌లు మరియు ఆహారాన్ని అందజేసేది. ఆసుపత్రులు బతికే అవకాశం ఉన్న రోగులతో నిండిపోతుండగా, మదర్ థెరీసా మరణిస్తున్న వారి కోసం ఆగస్టు 22, 1952న నిర్మల్ హృదయ్ (“ప్లేస్ ఆఫ్ ది ఇమ్మాక్యులేట్ హార్ట్”) అనే ఇంటిని తెరిచారు.

నిరాశ్రయులైన పిల్లలు, అనాథ పిల్లల కోసం 1955లో, మదర్ థెరీసా నిర్మల శిశు భవన్‌ను ప్రారంభించారు. భారతదేశంలోని మురికివాడలలో, పెద్ద సంఖ్యలో ప్రజలు కుష్టు వ్యాధి బారిన పడ్డారు. ఆ సమయంలో, కుష్టు రోగులు వారి కుటుంబాల నుండి బహిష్కరించబడ్డారు. కుష్టు రోగుల పట్ల విస్తృతమైన భయం కారణంగా, నిర్లక్ష్యం చేయబడిన ఈ ప్రజలకు సహాయం చేయడానికి మదర్ థెరీసా ఒక మార్గాన్ని కనుగొనడానికి చాలా కష్టపడ్డారు. చివరికి, లెప్రసీ ఫండ్, లెప్రసీ డేలను ఏర్పాటు చేసి వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్టు రోగులకు వారి ఇళ్ల దగ్గర మందులు, బ్యాండేజీలను అందించడానికి అనేక మొబైల్ లెప్రసీ క్లినిక్‌లను (మొదటిది సెప్టెంబర్ 1957లో ప్రారంభించబడింది) స్థాపించారు. 1960ల మధ్య నాటికి, మదర్ థెరీసా కుష్టు రోగులు నివసించడానికి, పని చేయడానికి శాంతి నగర్ (“ది ప్లేస్ ఆఫ్ పీస్”) అనే కుష్టు రోగి కాలనీని స్థాపించారు. తరువాత మిషనరీస్ ఆఫ్ ఛారిటీకి భారతదేశం వెలుపల సంస్థలను ఏర్పాటు చేయడానికి అనుమతి లభించింది. మొదటిది 1965లో వెనిజులాలో స్థాపించబడింది. కొద్ది కాలానికే ప్రపంచవ్యాప్తంగా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ హౌస్‌లు ఏర్పడ్డాయి. మదర్ థెరీసా మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్థాయిలో సేవలందించింది. 1980లలో మదర్ థెరీసా అప్పటికే తన 70వ ఏట న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో, డెన్వర్ మరియు ఇథియోపియాలోని అడిస్ అబాబాలో ఎయిడ్స్ బాధితుల కోసం గిఫ్ట్ ఆఫ్ లవ్ హోమ్‌లను ప్రారంభించారు. 1996 నాటికి మిషనరీస్ ఆఫ్ ఛారిటీ 100 దేశాలలో 517 మిషన్లను కలిగి ఉంది. సిస్టర్ల సంఖ్య పన్నెండు నుండి వేలకు పెరిగింది.

**అవార్డులు- గుర్తింపు:**

ఆమె 1962లో పద్మశ్రీ, 1969లో అంతర్జాతీయ అవగాహన కోసం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డునూ అందుకున్నారు. అదే సంవత్సరంలో శాంతి అంతర్జాతీయ అవగాహన కోసం రామన్ మెగసెసే అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయంగా 1979లో శాంతి విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ అవార్డు అందుకున్నారు. 1980లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం అయిన భారత రత్న బహుకరించబడింది. ఆమె పుట్టిన 100వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, భారత ప్రభుత్వం ఆగస్టు 28, 2010న ఒక ప్రత్యేక ? 5 నాణేన్ని విడుదల చేసింది.


**స్ఫూర్తిదాయకం:**

87 సంవత్సరాల వయస్సులో ఆమె సెప్టెంబర్ 5, 1997న కోల్‌కతాలో మరణించారు. 2016వ సంవత్సరంలో ఆమెను సెయింట్ థెరీసాగా ప్రకటించారు. వినయం, దయ, దాతృత్వం కలగలిసిన ఒక పరిపూర్ణ మనిషి. పేద, నిస్సహాయ ప్రజలకు ఆమె చేసిన నిస్వార్థ సేవకు ఆమె పేరుగాంచారు. ఆమె తన జీవితమంతా భారతదేశ ప్రజలకు సేవ చేయడంలో గడిపారు. ఆమె చూపిన మార్గం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.

**డివిబి శ్రీ హరిన్**
**9వ తరగతి విద్యార్థి**
mr.dunga@rediffmail.com

## మంచిని పంచు

**భక్తి**



ఊరే ప్రపంచంగా భావించే ఒక గ్రామీణ యువతికి పెళ్లి జరిగింది. రెండు గంటల ప్రయాణ దూరం ఉండే అత్తగారింటికి కాపురానికి వెళ్లే రోజు రానే వచ్చింది. అయినవాళ్లతో కలిసి బయలుదేరబోతూ ఉంటే అదే ఊర్లో ఉన్న తన అమ్మమ్మ గుర్తుకొచ్చింది. ఊరి చెరువు పక్కన ఉండే పొలం దగ్గర అమ్మమ్మ ఉందని తెలుసుకుంది. పరుగులు తీస్తూ అమ్మమ్మ ఉన్న పొలం దగ్గరికి చేరింది. అమ్మమ్మ కనకాంబరాల తోటలో పూలు కోస్తూ ఉంది. అమ్మమ్మ కాళ్లకి దండం పెట్టి ఏడుస్తూ ‘వెళ్లి వస్తానని’ చెప్పింది. ‘శుభమా అని అత్తగారింటికి వెళ్తున్నావు. ఎందుకు కన్నీళ్లు పెట్టుకుంటావ’ని అడిగింది అమ్మమ్మ. ‘నేను మన ఊరు దాటి ఎక్కడికీ వెళ్లలేదు. బావిలోని కప్పలాగా బతికాను. అత్తగారి బంధువులు, ఆ ఊరి వాళ్లు ఎలా ఉంటారో తెలియదు.

వారి మాటతీరు, అలవాట్లు, సంప్రదాయాలు అన్నీ నాకు కొత్త కదా! అందుకని ఆందోళనగా ఉంది’ అని భయంగా చెప్పింది. అమ్మమ్మ నవ్వి మనవరాలి చేతిలో కనకాంబరాలు పోసి ఆకాశంలోకి విసరమంది. అమ్మమ్మ ఎందుకు అలా చేయమన్నదో అర్థం కాలేదు ఆ యువతికి. ఏది చెప్పినా, ఏమి చేసినా అమ్మమ్మ మన మంచికోసమే కదా చెబుతుందని అలాగే చేసింది. పైకి విసిరిన పూలు క్షణాల్లో వారిపైన పలపలా కిందరాలాయి. అమ్మమ్మ అక్కడే ఉన్న రేగు చెట్ల నుంచి రేగు పండ్లు కోసి మనవరాలి చేతికి ఇచ్చి పైకి విసరమంది. అమ్మమ్మ చెప్పినట్లే రేగు పండ్లను కూడా ఆ యువతి విసిరింది. కొద్ది క్షణాల్లోనే రేగు పండ్లు వారి నెత్తినపడ్డాయి. నేల మీద పడిన రేగు పండ్లను ఏరి మనవరాలి చేతికి ఇస్తూ ‘మనం ... అదే మన మీద పడుతుంది. పూలు విసిరితే పూలు, పండ్లు విసిరితే పండ్లు మన మీద పడ్డాయి. అలాగే నువ్వు మీ అత్తగారి ఊరి మనుషులతో సఖ్యతగా ఉండు. మంచిగా మాట్లాడు. మంచిని పంచు. అప్పుడు నీకు, నీ కుటుంబానికి సుఖ సంతోషాలు కలుగుతాయి’ అని చెప్పింది అమ్మమ్మ. ఆమెకు ప్రణమిల్లి ‘నోరు మంచిదైతే ఊరు మంచిదని పెద్దవాళ్లు చెప్పింది’ గుర్తుకు తెచ్చుకుని అక్కడినుంచి బయలుదేరింది కొత్త పెళ్లి కూతురు.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్ మంగళవారం 26। ఆగస్టు। 2025

# అక్కతో వీడియో కాల్ మాట్లాడుతూ నదిలో దూకి తమ్ముడు ఆత్మహత్య..!



న్యూఢిల్లీ-నవభూమి:అక్కతో వీడియో కాల్ మాట్లాడుతూ తమ్ముడు నది లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే అతని అక్క పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. విపత్తు నిర్వహణ దళం అగ్నిమాపక దళం సాయంతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. మృతదేహం లభ్యం కాకపోవడంతో ఇంకా గాలింపు కొనసాగుతోంది.వివరాల్లోకి వెళ్తే.. బీహార్‌కు చెందిన బాల్ కిషన్ అనే వ్యక్తికి సుమన్ అనే కుమార్తె, రితిక్ అనే కుమారుడు ఉన్నారు. సుమన్ సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ ఢిల్లీలోని కరోల్‌బాగ్‌లో ఉంటోంది. ఆమె తమ్ముడు రితిక్ కూడా అక్క దగ్గరే ఉంటూ ఉద్యోగ వేటలో ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి యమునా నది బ్రిడ్జిపైకి వెళ్లిన రితిక్.. అక్క సుమన్‌కు వీడియో కాల్ చేశాడు. తాను ప్రేమించిన అమ్మాయి తనను దూరం పెట్టిందని, తనకు జీవితంపై విరక్తి కలిగిందని, ఇక బతుకాలని లేదని చెప్పాడు. తాను నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని అన్నాడు. అక్క వద్దని వారిస్తుండగానే మొబైల్ ఫోన్‌ను రెయిలింగ్‌పై పెట్టి నదిలో దూకేశాడు. దాంతో అక్క సుమన్ వెంటనే సన్‌లైట్ కాలనీ పోలీసులకు సమాచారం ఇచ్చింది.దాంతో పోలీసులు ఇతర రెస్క్యూ టీమ్స్‌తో కలిసి హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, అగ్నిమాపక సిబ్బంది రాత్రంతా గాలించారు. అయినా మృతదేహం లభ్యం కాకపోవడంతో ఇంకా సెర్చింగ్ కొనసాగుతోంది. ఘటన జరిగిన ప్రాంతంలో వంతెనపై రితిక్ బైకు, మొబైల్ ఫోన్ లభించాయని పోలీసులు తెలిపారు. ప్రేమ విఫలం కావడమే ఆత్మహత్యకు కారణంగా ప్రాథమిక దర్యాప్తులో తేలిందని చెప్పారు.

## డల్లాస్‌కు వెళ్లాల్సినోళ్లను వదిలేసి వెళ్లిపోయిన ఇండిగో?



న్యూఢిల్లీ-నవభూమి:ఇటీవల కాలంలో విమానయాన సంస్థల తీరుతో విమాన ప్రయాణికు లకు చుక్కలు కనిపిస్తున్నాయి. అయితే.. సాంకేతిక అంశాలు.. లేదంటే నిర్వహణ లోపాలతో తరచూ ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటున్నారు విమాన ప్రయాణికులు. తాజాగా అలాంటి ఉదంతమే హైదరాబాద్ నుంచి డల్లాస్ కు వెళ్లాల్సిన ప్రయాణికులకు ఎదురైంది. దీనికి సంబంధించి అధికారికంగా ఇండిగో స్పందించింది లేదు. అంతేకాదు.. పద్నాలుగు మంది ప్రయాణికులకు చుక్కలు చూపించిన ఇండిగో వ్యవహారంపై తమకు ఎలాంటి సమాచారం లేదని శంషాబాద్ ఎయిర్ పోర్టు నిర్వాహకులు చెప్పటం గమనార్హం. పలు మీడియా సంస్థల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. అసలేమైందంటే.. హైదరాబాద్ నుంచి డల్లాస్ కు వెళ్లాల్సిన 38 మంది మంది టర్కిష్ ఎయిర్ లైన్స్ ప్రయాణికుల్ని ముంబయి వరకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఇండిగో మీద ఉంది. టర్కిస్ ఎయిర్ లైన్స్ - ఇండిగో టైఅప్ టికెట్లను ఆన్ లైన్ లో రూ.2 లక్షల చొప్పున కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. షెడ్యూల్ లో భాగంగా వీరు శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి శనివారం రాత్రి 11.40 గంటలకు ముంబయి వరకు వెళ్లి.. అక్కడి నుంచి డల్లాస్ కు వేరే విమానంలో వెళ్లాల్సి ఉంది. %శనివారం రాత్రి 38 మంది ప్రయాణికులు సకాలంలో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకొని.. ఎయిర్ లైన్స్ సిబ్బందిని సంప్రదించారు. ఓవర్ బుకింగ్ కారణంగా ఇండిగో ఎయిర్ లైన్స్ సిబ్బంది కొందరు ప్రయాణికులకు వేరే సర్వీసు నెంబరును కేటాయిస్తూ వివరాలు అందించారు. సదరు విమానంలో 38 మందిలో 24 మందిని మాత్రమే ఎక్కించుకొని.. మిగిలిన ప్రయాణికుల్ని విమానంలోకి అనుమతించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇండిగో ప్రతినిధుల్ని ప్రశ్నిస్తే.. పొంతన లేని సమాధానాలు ఇచ్చినట్లుచెబుతున్నారు. దాదాపు ఏడు గంటల పాటు ఎయిర్ పోర్టులో ఉన్న వారు చివరకు తిరిగి వెళ్లినట్లుగా చెబుతున్నారు. వీరికి సంబంధించిన వ్యవహారం తమ వరకు రాలేదని శంషాబాద్ జీఎంఆర్ ఎయిర్ పోర్టు ప్రతినిధులు చెబుతున్నారు. ఇలా ఎందుకు జరిగిందన్న అంశంపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఇండిగో మీద ఉందన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

## డల్లాస్‌లో పార్లేజీ బిస్కెట్ రూ.370.. భారతీయులపై ట్రంప్ టారిఫ్



న్యూఢిల్లీ-నవభూమి:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌ల ప్రభావం ఇప్పుడు అమెరికా ప్రజలపై బలంగా పడుతోంది. ముఖ్యంగా అక్కడ నివసిస్తున్న భారతీయులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందుగా 25 శాతం టారిఫ్‌లు అమల్లోకి వచ్చినా, అప్పటి వరకు స్టోర్లలో పాత స్టాక్ ఉండటంతో ప్రభావం పెద్దగా కనిపించలేదు. అయితే తాజాగా కొత్త సరుకులు మార్కెట్లోకి రావడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రోజువారీ సరుకుల నుండి కిరాణా వస్తువుల వరకు అన్నీ కష్టతరంగా మారాయి. ఒక్కోసారి సులభంగా అందుబాటులో ఉండే వస్తువులు ఇప్పుడు కుటుంబ బడ్జెట్‌ను దెబ్బతీస్తున్నాయి. ప్రత్యేకంగా సింగిల్ ఇన్‌కమ్ ఫ్యామిలీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నెలవారీ ఖర్చులు భరించలేని స్థాయికి చేరుకుంటుండటంతో జీవన విధానం కఠినతరమవుతోంది. “ఇప్పుడెంత ఆదా చేస్తే అంత బాగుంటుందనే ఆలోచన” ప్రతి కుటుంబంలోనూ అలవాటైపోతోంది.డల్లాస్‌లో పార్లే-జీ ధరలపై నెటిజన్ల షాక్ ఇటీవల అమెరికాలోని డల్లాస్‌లో ఓ భారతీయ ప్రవాసి వాల్మార్ట్ స్టోర్‌లో ఇండియన్ ఫుడ్ ప్రొడక్ట్స్ ధరలను వీడియోలో చూపించగా అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ వీడియోలో రాజత్ అనే ప్రవాసి, షెల్ఫ్‌లలో ఉన్న రాయల్ దాల్, హల్దీరామ్ స్నాక్స్, పార్లే బిస్కెట్లు, మసాలాలు, సాస్‌లను చూపిస్తూ వాటి ధరలను వెల్లడించారు. ఒక కిలో పప్పు (దాల్) హల్దీరామ్ ఖట్టా మీఠా, ఆలూ భుజియా 4, పార్లే ‘హైడ్ సీక్’ బిస్కెట్లు 4.5 (సుమారు370) గా పేర్కొన్నాడు. ఈ ధరలు చూసి భారతీయ నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. “భారతదేశంలో ?20కి దొరికే బిస్కెట్ అక్కడ ?320? అర్థ కిలో పప్పు దాదాపు ?400?” అంటూ కామెంట్లు చేస్తున్నారు. కొంతమంది నెటిజన్లు భారతదేశంలో ఉండే అవే ఉత్పత్తులను డల్లాస్‌లో చూసి ఆశ్చర్యపోగా.. మరికొంతమంది భారతదేశంతో పోలిస్తే విదేశాల్లో ఆ వస్తువులు ఎంత ఖరీదైనవో చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. “ఓ నో, భారతదేశంతో పోలిస్తే ఇది చాలా ఖరీదు” అని ఒక యూజర్ రాశారు. మరొకరు ఇలా అన్నారు: “4 డాలర్ల హైడ్ అండ్ సీక్ బిస్కెటా? అంటే అది ?320. ఇండియాలో ?20కి దొరుకుతుంది. అర కేజీ పప్పు దాదాపు ?400? వామ్మో, చాలా ఖరీదు.” అంటూ ఆశ్చర్యపోయారు. ఎక్కువ సంపాదించాలనే ఉద్దేశంతో విదేశాల్లో స్థిరపడాలనుకునే భారతీయులకు ఈ వీడియో ఒక కనువిప్పు కావాలి. అక్కడ ఆదాయం ఎక్కువ ఉన్నట్లే, ఖర్చులు కూడా అందుకు తగ్గట్టుగానే ఉంటాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో జీవితం బయటికి నాగరికంగా, విలాసవంతంగా అనిపించినప్పటికీ, ప్రతిదానికీ ఒక ధర ఉంటుందని మనం అర్థం చేసుకోవాలి. ట్రంప్ ప్రభుత్వం సమయంలో పన్నులు పెరగడం, రవాణా ఖర్చుల వల్ల భారతదేశంతో పోలిస్తే అమెరికాలో భారతీయ ఉత్పత్తులు చాలా ఖరీదైనవి. విదేశాలకు వెళ్లలేక బాధపడేవారు కొంచెం ఆలోచిస్తే ఈ వాస్తవం అర్థమవుతుంది. వీడియోలో కనిపించే ఈ ధరలు ప్రవాస జీవన వాస్తవాన్ని గుర్తుచేస్తున్నాయి. అమెరికా, యూరప్ వంటి దేశాల్లో జీతాలు ఎక్కువైనా ఖర్చులు కూడా అంతే ఎక్కువ. పైగా టారిఫ్‌లు, రవాణా ఖర్చులు, దిగుమతి పన్నులు ఇవన్నీ కలసి వస్తువులను మరింత ఖరీదైనవిగా మారుస్తాయి. మన దేశంలోనూ సులభంగా దొరికే వస్తువులు, అక్కడ లగ్జరీగా మారిపోతాయి.

## దివ్యాంగులపై జోకులు.. క్షమాపణలు చెప్పాలని యూట్యూబర్ రైనాకు సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ-నవభూమి:** మానసిక, శారీరక దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ సమే రైనాతో పాటు ఇతర యూట్యూబర్లకు సుప్రీంకోర్టు వార్నింగ్ ఇచ్చింది. దివ్యాంగుల మనోభావాలను కించపరిచిన ఘటనలో క్షమాపణలు చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వాణిజ్యపరమైన భావస్వేచ్ఛా ప్రకటనలతో ఓ కమ్యూనిటీ మనోభావాలను దెబ్బతీయడం సరికాదు అని కోర్టు చెప్పింది. సోషల్ మీడియా ఛానళ్లలో దివ్యాంగులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని సమే రైనాతో పాటు ఇతర యూట్యూబర్లకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించే రీతిలో కార్యక్రమాలు నిర్వహించాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది.

# భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకాలు.. జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు



**అమెరికా- నవభూమి:**భారత వస్తువులపై డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలపై అమెరికా ఉపాధ్యక్షుడు, తెలుగింటి అల్లుడు జేడీ వాన్స్ స్పందించారు. రష్యా ఆర్థిక మూలాలను అడ్డుకుని, ఉక్రెయిన్‌పై దాడులను ఆపేందుకే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అంతేకాదు, అలాస్కాలో అమెరికా, రష్యా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఈ నెల జరిగిన భేటీపై ప్రతిష్టంభన కొనసాగుతున్నా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడంలో అమెరికా మధ్యవర్తిత్వం కీలక పోత్ర పోషించగలదని వాన్స్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఎన్బీసీ ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వాన్స్ మాట్లాడుతూ.. “రష్యన్లకు చమురు ఆర్థిక వ్యవస్థ నుంచి వచ్చే ఆదాయాన్ని అడ్డుకోడానికి ట్రంప్ భారతదేశంపై సుంకాలు వంటి అస్త్రాన్ని ప్రయోగించారు.. తద్వారా నిధులు ప్రవాహం ఆగి ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగించకుండా ఆపడమే ప్రధాన లక్ష్యం. ట్రంప్, పుతిన్ మధ్య అలాస్కా భేటీ తర్వాత ఆటంకాలు ఏర్పడినప్పటికీ యుద్ధాన్ని ముగించడంలో అమెరికా మధ్యవర్తిత్వం కీలకం కానుంది... భారత్‌పై అదనపు టారిఫ్‌ల ద్వారా చమురు ద్వారా వచ్చే ఆదాయానికి గండికొట్టి రష్యాపై ట్రంప్ బలమైన ఆర్థిక ఒత్తిడిని తీసుకొచ్చారు.ఉక్రెయిన్‌లో మారణహోమాన్ని ఆపేస్తే రష్యా మళ్లీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చేర్చవచ్చు.. కానీ యుద్ధాన్ని కొనసాగిస్తే ఒంటరిగా ఉండాల్సిదేననే బలమైన సందేశం ఇవ్వడానికి మా అధ్యక్షుడు ప్రయత్నించారు.. కీవ్‌పై బాంబు దాడులను నిలిపివేసేలా రష్యా ఒప్పుకునేలా ట్రంప్ ఆర్థిక ఒత్తిడి విధానాన్ని అవలంభించారు. భారత్‌పై అధిక సుంకాలను విధించడం ఇందులో భాగమే” అని వాన్స్ తెలిపారు.రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తుందనే కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లు విధించిన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆశ్చర్యకరంగా రష్యా ముడి చమురు, గ్యాస్‌ను అత్యధికంగా దిగుమతి చేసుకునే చైనా, ఐరోపా దేశాలపై వాషింగ్టన్ ఇలాంటి విమర్శలు చేయకపోవడం గమనార్హం. భారత్‌పై ఆగస్టు 1 విధించిన 25 శాతాలు ఇప్పటికే అమల్లోకి రాగా.. ఆ తర్వాత విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి.

## రీల్స్, బ్యూటీ పార్లర్, వరకట్నం.. నొయిడా మహిళ హత్య కేసులో సంచలన విషయాలు



**నొయిడా -నవభూమి:**ఉత్తర్ ప్రదేశ్‌లోని నొయిడా మహిళ నిక్కీ (28) వరకట్న హత్య కేసు యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. అదనపు కట్నం కోసం నిక్కీని వేధించి, చిత్రహింసలు పెట్టిన అత్తింటివాళ్లు.. తన ఏడేళ్ల కుమారుడు ముందే ఆమె ఒంటిపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఆమె భర్త విపిన్ భాటీ తప్పించుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు అతడిపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టగా.. విస్తుగొలిపే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. నిక్కీ, ఆమె చెల్లెలు కంచన్‌లు ఒకే ఇంటికి కోడళ్లుగా వెళ్లారు. 2016లో నిక్కీకి విపిన్‌తోనూ, అతడి తమ్ముడు రోహిత్‌తో కంచన్‌కు వివాహం జరిగింది. పెళ్లైన దగ్గర నుంచి వేధింపులు మొదలయ్యాయి.ఈ ఏడాది ఫిబ్రవరిలో భర్త వేధింపులను భరించలేక నిక్కీ దాద్రిలోని తన పుట్టింటికి వచ్చేసింది. కొద్ది రోజుల తర్వాత పెద్దల ముందు పంచాయతీ జరగడంతో భార్యకు విపిన్ క్షమాపణ చెప్పి, మళ్లీ ఇలాంటి తప్పు ఎప్పుడూ జరగదని ప్రమాణం చేశాడు. దీంతో అతడి వెంట వెళ్లేందుకు అంగీకరించిన నిక్కీ.. తన కష్టాలు తీరిపోయాయని అనుకుంది. కానీ, అది మూన్నాళ్ల ముచ్చటే అయ్యింది.నిక్కీ, కంచన్‌లు ఓ బ్యూటీ పార్లర్ నిర్వహిస్తుండటం విపిన్ కుటుంబానికి నచ్చలేదు. అంతేకాదు, సోషల్ మీడియాలో నిక్కీ రీల్స్ పోస్ట్ చేయడంపై కూడా భర్త విపిన్ అభ్యంతరం వ్యక్తం చేస్తుండేవాడు. దీనిపై ఇరువురి మధ్య తరుచూ వాగ్వాదం జరిగేది. ఇదే సమయంలో విపిన్, అతడి కుటుంబం అదనపు కట్నం కావాలని డిమాండ్ చేసేవారు. పెళ్లి సమయంలో నిక్కీ తండ్రి కట్నంగా స్కార్పియో, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, బంగారం, డబ్బు భారీగానే ఇచ్చారు. అయినా, అది సరిపోదని, ఇంకా తీసుకురావాలని వేధించేవారు. దీనిపై గత గురువారం మరోసారి వాగ్వాదం జరగడంతో నిక్కీపై విపిన్, అతడి తల్లి దాయ పెట్రోల్ పోసి నిప్పంటించారు.తాజాగా, కంచన్ ఇన్‌స్టాలో స్పందిస్తూ.. సమాజానికి భయపడి తన సోదరి చాలా భరించిందని ఆవేదన వ్యక్తం చేసింది. ‘ఆమెకు ఏడేళ్ల కొడుకు ఉన్నాడు.. ఈ రోజు కాకుంటే రేపైనా మార్పు వస్తుందని, అంతా బాగుంటుందని అనుకుని అనేక విషయాల్లో రాజీ పడింది.. కానీ, ఇలా జరుగుతుందని మేము ఊహించలేదు’ అని వాపోయింది. విషాద సమయంలో తమకు మద్దతు నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.‘ఇప్పుడు తీసుకునే చర్యలు ఫిబ్రవరి 11 లేదా 12న తీసుకుని ఉంటే ఇవాల ఇంతటి ఘోరం జరిగేది కాదు.. మన సమాజం సంప్రదాయాలు, కట్టుబాట్ల కోసం అనేక నిర్ణయాలు తీసుకున్నాం.. ’ అని కంచన్ కన్నీళు పెట్టుకుంది. ఫిబ్రవరిలో కంచన్ తన సోదరి నిక్కీ, పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దల ముందు పంచాయతీలో రాజీ కుదరడంతో ఇద్దరూ తిరిగొచ్చారు. తన కళ్లెదుటే అక్కను అత్యంత దారుణంగా హత్యచేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసులో విపిన్, అతడి తల్లిదండ్రులు దాయ, సత్యవీర్, సోదరుడు రోహిత్‌లను అరెస్ట్ చేశారు.

## ఎల్విష్ యాదవ్ ఇంటిపై కాల్పులు జరిపిన ఇద్దరు షూటర్ల అరెస్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** యూట్యూబర్, బిగ్‌బాస్ మాజీ విన్నర్ ఎల్విష్ యాదవ్ ఇంటిపై కాల్పుల కలకలం సృష్టించిన ఇద్దరు షూటర్లను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఇద్దరికి హిమాన్షు భావు-నీరజ్ ఫరీద్‌పురియా గ్యాంగులతో సంబంధాలున్నట్టు అనుమానిస్తున్నారు. నిందితులను గౌరవ్ సింగ్ అలియాస్ నిక్కా (22), ఆదిత్య తివారీ (19)గా గుర్తించారు.గౌరవ్‌సింగ్ ఫరిదాపూర్‌లో స్కూల్ డ్రాపౌట్ కాగా, ఆదిత్య తివారీ బీహార్‌లోని తైమూర్ జిల్లాకు చెది బీసీఏ స్టూడెంట్ అని పోలీసులు తెలిపారు. గౌరవ్‌కు గత ఏడాది ఒక విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో ప్రమేయం ఉండగా, ఆదిత్యకు గతంలో ఎలాంటి నేరచరిత్ర లేదు.రోహిణిలోని సాహ్‌బాద్ డెయిరీ ఏరియాలో ఆదివారంనాడు గాలింపు చర్యలు జరుపుతుండగా నిందితులిద్దరూ పట్టుబట్టారు. పోలీసు టీమ్‌ను చూసి నిందితుల్లో ఒకరు పిస్తోల్ తీసేందుకు ప్రయత్నించడంతో అప్రమత్తమైన పోలీసులు అతన్ని పట్టుకున్నారని ప్రత్యేక సెల్ డీసీపీ అమిత్ కౌశిక్ తెలిపారు. నిందితుల దగ్గర నుంచి ఒక పిస్తోలు, ఐదు తూటాలు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

కాగా, తొలుత ఇండో-నేపాల్ సరిహద్దు వైపు పారిపోయేందుకు ప్రయత్నించామని, అయితే గ్యాంగు లీడర్ల ఆదేశాలతో ఢిల్లీలో మరో అసైన్‌మెంట్ కోసం తిరిగి వచ్చామని పోలీసు ఇంటరాగేషన్‌లో నిందితులు చెప్పినట్టు అధికారులు తెలిపారు.

ఈనెల 17న మోటార్ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు గురుగ్రామ్ సెక్టార్ 56లోని ఎల్వేష్ నివాసం వద్దకు వచ్చారు. ఇద్దరు వ్యక్తులు వెంటనే విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అనంతరం తప్పించుకుని పారిపోయారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. ఆ సమయంలో ఎల్విష్ ఇంట్లో లేరు. ఈ దాడికి తామే బాధ్యులమని భావూ గ్యాంగ్ సోషల్ మీడియోలో ప్రకటించుకుంది.

## అనాథాశ్రమంలో పెరిగి డెలివరీ బాయ్‌గా పనిచేసి, ఎట్టకేలకు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**మన దేశంలో చాలా మందికి ఐఏఎస్, ఐపీఎస్ కావాలనే కల ఉంటుంది. అందుకోసం ఏళ్ల తరబడి కోచింగ్‌లు, ఎగ్జామ్స్ అంటూ.. పుస్తకాల పురుగులాగా మారిపోతూ ఉంటారు. ఇక ఈ సివిల్స్‌లో సత్తా చాటాలంటే.. చదువు, కఠోర శ్రమ, ఖరీదైన కోచింగ్ సెంటర్లు మాత్రమే కాకుండా.. ఆత్మ విశ్వాసం, పోరాట పటిమ, పట్టుదల ముఖ్యం. ఇక అత్యంత సామాన్యులు, బాల్యంలో చదువుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడినవారు కూడా.. సివిల్ సర్వెంట్లు అయిన సంఘటనలను మనం ఇప్పటికే ఎన్నో చూశాం. నిజ జీవిత కథ ఆధారంగా తెరకెక్కించిన ‘12%ప్త ఖీఋఅశ్రీ%’ సినిమాలో చూపించినట్లు.. సివిల్స్ పరీక్షలు నెగ్గేందుకు ఆపసోపాలు పడాల్సిందే. అయితే ఇప్పుడు కలెక్టర్ కుర్చీలో కూర్చున్న ఓ వ్యక్తి.. అలాంటి అడ్డంకులన్నీ దాటుకుని.. ఆ ఉద్యోగంలో చేరారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్స్ పరీక్షలు రాయకుండానే ఆయన.. కలెక్టర్ అయ్యారు. ఆయనే ప్రస్తుతం కేరళలోని పథనంథిట్ట జిల్లా కలెక్టర్ బి.అబ్దుల్ నాజర్.కేరళ కన్నూర్ జిల్లాలోని తాలస్సేరీ గ్రామానికి చెందిన అబ్దుల్ నాజర్ వయసు 5 ఏళ్లు ఉన్నపుడు ఆయన తండ్రి.. ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆ కుటుంబాన్ని పోషించే బాధ్యత.. ఆయన తల్లి తీసుకున్నారు. అబ్దుల్ నాజర్‌తోపాటు అతని సోదరులను పోషించేందుకు.. వారి తల్లి ఇళ్లలో పనిమనిషిగా పనిచేసేవారు. అయినప్పటికీ ఆమె సంపాదన.. వారిని పోషించేందుకు సరిపోయేది కాదు. దీంతో అబ్దుల్ నాజర్, ఆయన సోదరులను.. అనాథాశ్రమంలో చేర్పించారు. వారు అక్కడే 13 ఏళ్ల పాటు ఉంటూ.. చదువుకున్నారు.అయితే తల్లికి చేదోడు వాదోడుగా ఉండేందుకు.. చిన్నతనం నుంచి అబ్దుల్ నాజర్ కుటుంబం కోసం పనిచేయడం ప్రారంభించారు. బాల్యంలో తనతోటి వారంతా ఆడుకుంటుండగా.. అబ్దుల్ నాజర్ మాత్రం కుటుంబం కోసం పని చేసేవారు. 10 ఏళ్ల వయసులోనే ఇళ్లు శుభ్రం చేయడం, డెలివరీ బాయ్‌గా పనిచేయడం వంటి పనులను చేశారు. పేదరికం కారణంగా ఆయన అనాథాశ్రమంలో ఉంటూ చదువుతోపాటు పని చేస్తున్నప్పటికీ.. అబ్దుల్ నాజర్ మాత్రం తన ఆత్మస్థైర్యాన్ని మాత్రం వీడలేదు. ఒక పక్క స్కూల్‌కు వెళ్లి చదువుకుంటూనే.. ఉదయాన్నే న్యూస్ పేపర్లు వేయడం, తన కంటే తక్కువ తరగతుల వారికి ట్యూషన్లు చెప్పడం, ఫోన్ ఆపరేటర్‌గా పనిచేయడం వంటివి చేసేవారు. వీటితో వచ్చిన డబ్బులను చదువుతోపాటు ఇంటి ఖర్చుల కోసం ఉపయోగించుకునేవారు.ఈ క్రమంలోనే కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్స్ పరీక్ష రాసిన అబ్దుల్ నాజర్ అందులో ఉద్యోగం సాధించారు. మొట్టమొదట ఆరోగ్య శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా తన కెరీర్‌ను మొదలుపెట్టారు. తన ఆర్థిక పరిస్థితి, సమయాన్ని దృష్టిలో ఉంచుకుని.. యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి.. ఆయనకు తగిన వనరులు లేవు. అయినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. వచ్చిన అవకాశాన్నే రెండు చేతులా ఒడిసిపట్టుకున్నారు. తన వద్ద ఉన్న అవకాశాలను ఉపయోగించుకుంటూనే.. తన లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇక తనకు వచ్చిన ఉద్యోగంలోనే అత్యుత్తమంగా రాణించారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డిపార్ట్‌మెంటర్ ఎగ్జామ్స్‌లో సత్తా చాటాలని టార్గెట్ పెట్టుకున్నారు.

ఆరోగ్య శాఖలో ఉద్యోగాన్ని మొదలుపెట్టిన అబ్దుల్ నాజర్.. కష్టపడే తత్వం, అంకితభావంతో ఒక్కో మెట్టు ఎదిగారు. విధి నిర్వహణలో అబ్దుల్ నాజర్ చూపించే నిజాయితీ, కష్టపడేతత్వం.. చివరికి ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారిక హోదాను కల్పించేలా చేసింది. ఎట్టకేలకు పతనంతిట్ట జిల్లా కలెక్టర్‌గా అబ్దుల్ నాజర్‌ను నియమించారు. ఇక తన కుమారుడు జిల్లా కలెక్టర్ అయిన వార్త విని.. అబ్దుల్ నాజర్ తల్లి ఆనందంతో ఉప్పొంగిపోయారు. నిరుపేద కుటుంబంలో పుట్టి.. చిన్నతనంలోనే అనేక కష్టాలను ఎదుర్కొని.. చివరికి కలెక్టర్ అయిన అబ్దుల్ నాజర్ కథ కేవలం ఒక విజయ గాథ మాత్రమే కాదు.. నిస్సహాయ స్థితిలో కూడా పట్టుదలతో కృషి చేస్తే అసాధ్యం కూడా సుసాధ్యం చేయొచ్చనే గొప్ప పాఠాన్ని చెబుతుంది.

## రోగిలా ఆస్పత్రిలోకి వచ్చి ఐఫోన్ ఎత్తుకెళ్లాడు.. 60 నిమిషాల్లోనే..



**కాన్పూర్-నవభూమి:** ఓ యువకుడు రోగిలా నాటకమాడి ఆస్పత్రిలోకి ప్రవేశించాడు. ఎవ్వరికీ అనుమానం రాకుండా డాక్టర్ కోటులోంచి ఐఫోన్ కొట్టేశాడు. మెల్లగా ఆస్పత్రినుంచి జారుకున్నాడు. అయితే, దొంగతనం జరిగిన 60 నిమిషాల్లోనే అతడు పోలీసులకు దొరికిపోయాడు. అతడు పోలీసులకు ఎలా దొరికిపోయాడో తెలుసుకోవాలంటే ఈ దొంగతనం స్టోరీ చదవాల్సిందే. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన మహ్మద్ ఫయాజ్ ఫోన్ దొంగతనాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఆగస్టు 20వ తేదీన రోగిలా నాటకమాడి హాల్లెట్ ఆస్పత్రిలోకి ప్రవేశించాడు. కర్ర పట్టుకుని కుంటుకుంటూ నడుస్తూ అక్కడి సిబ్బందిని తన అద్భుతమైన నటనతో నమ్మించాడు. రెప్పపాటులో ఓ జూనియర్ డాక్టర్ కోటులోంచి ఐఫోన్ కొట్టేశాడు. మెల్లగా అక్కడినుంచి జారుకున్నాడు. ఫోన్ కనిపించకపోవటంతో బాధిత జూనియర్ డాక్టర్ పోలీసులకు కంప్లైంట్ చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ కెమెరాల ఆధారంగా విచారణ మొదలెట్టారు.ఆస్పత్రిలోని సీసీటీవీ కెమెరాల్లో మహ్మద్ ఫయాజ్ దొంగతనం చేస్తున్న దృశ్యాలు ఉన్నాయి. పోలీసులు వెంటనే మహ్మద్ ఫయాజ్‌ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి ఐఫోన్ స్వాధీనం చేసుకుని, జూనియర్ డాక్టర్‌కు అప్పగించారు. దొంగతనం జరిగిన 60 నిమిషాల్లోనే కేసు సాల్వ్ అయింది. దీనిపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. ‘దొంగకంటే ఎంతో తెలివిగా ఆలోచించి దొంగను పట్టుకున్న పోలీస్ టీమ్‌కు శుభాకాంక్షలు. సీసీటీవీ ఫుటేజీల వల్లే కేసు సాల్వ్ చేయటం జరిగింది’ అని అన్నారు.


### సింధూ జలాల ఒప్పందం రద్దు తర్వాత తొలిసారి

# పాకిస్థాన్‌ను అలర్ట్ చేసిన భారత్!



**జమ్మూ కశ్మీర్-నవభూమి:**జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దాయాదికి తావి వరదల గురించి భారత్ హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ ద్వారా ఈ సమాచారాన్ని పంపినట్లు అధికారిక వర్గాలను ఉటంకిస్తూ పాక్ మీడియా నివేదించింది. పహల్గామ్ దాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని (%×ఔ%) భారత్ తాత్కాలికంగా రద్దుచేసిన విషయం తెలిసిందే. . అయితే, దీనిని న్యూఢిల్లీగానీ, పాకిస్థాన్‌గానీ అధికారికంగా ధ్రువీకరించలేదు. కానీ, ఒకవేళ ఇదే నిజమైతే ఒప్పందం రద్దు తర్వాత పాకిస్థాన్‌కు తొలిసారి భారత్ సింధూ నది జలాల గురించి దౌత్యమార్గాల్లో తొలిసారి సమాచారం ఇచ్చినట్టయ్యిందివాస్తవానికి సింధూ, దాని ఉప-నదుల్లో నీటి మట్టాలు, వరదల గురించి ఒప్పందంలో భాగంగా కమిషనర్ల ద్వారా సమాచారం అందజేస్తారు. కానీ, ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో హైకమిషన్ ద్వారా అప్రమత్తం చేసినట్టు తెలుస్తోంది. జమ్మూ కశ్మీర్‌లో కురిసిన భారీ వర్షాలకు తావి నదికి భారీ వరదలు వచ్చే అవకాశం ఉందని పాకిస్థాన్‌ను భారత్ అప్రమత్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాలు, నివేదికలు పేర్కొన్నాయి. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ ఆదివారం ఈ సమాచారం చేరవేసినట్టు తెలిపాయి. భారత్ ఇచ్చిన సమాచారం ఆధారంగానే పాకిస్థాన్ అధికారులు తావీ నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను వరదలపై అప్రమత్తం చేసినట్టు చెప్పాయి.హిమాలయాల్లోని టిబెట్‌లో ప్రారంభమయ్యే సింధు నది కశ్మీర్ గుండా ప్రవహించి, పాకిస్థాన్ అంతటా ప్రవహిస్తుంది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ మధ్య 1960లో సింధు జలాల ఒప్పందం జరిగింది. సింధు, దాని ఉపనదుల జలాలను ఎలా వినియోగించాలనేది ఈ ఒప్పందం నిర్ణయిస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం.. సింధు నదీ వ్యవస్థ నుంచి భారతదేశానికి 20 శాతం.. మిగిలిన 80 శాతం నీటిని పాకిస్థాన్ వినియోగించుకుంటోంది. పశ్చిమ నదులు (సింధు, జీలం, చీనాబ్) పాక్‌కు.. తూర్పు నదులు (రావి, బియాస్, సట్లెజ్) భారతదేశానికి కేటాయించారు. అదే సమయంలో ఇది ప్రతి దేశం మరొక దేశానికి కేటాయించిన నదుల నిర్దిష్ట ఉపయోగాలను అనుమతిస్తుంది.ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడిన పాక్ ఉగ్రవాదులు.. 26 మంది అమాయకుల ప్రాణాలు బలిగొన్నారు. ఈ ఘటన తర్వాత దాయాదిపై భారత్ దౌత్యపరమైన చర్యలను తీసుకుంది. ఇందులో ఒకటి సింధు జలాల

## ఢిల్లీలో కుండపోత వర్షం.. ట్రాఫిక్ ఇబ్బందులు, విమానాల ఆలస్యం



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో ఈరోజు మళ్లీ వానలు దంచి కొడుతున్నాయి. దీంతో ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై నీరు భారీగా చేరడంతో ట్రాఫిక్ జామ్, విమానాల ఆలస్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. వీకెండ్ నుంచి షురూ అయిన వర్షం సోమవారం ఉదయం కూడా కొనసాగింది. దీంతో ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్‌జెట్ లాంటి ఎయిర్‌లైన్స్ తమ ప్రయాణీకులకు ట్రావెల్ అడ్వైజరీ జారీ చేశాయి.ఈ క్రమంలో స్పైస్‌జెట్ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ ఢిల్లీలో భారీ వర్షం కారణంగా విమానాలు ఆలస్యం కావచ్చని తెలిపింది. మీరు ప్రయాణించే ముందు ఫ్లైట్ స్టేటస్‌ను చెక్ చేసుకోవాలని తెలిపింది. ఇండిగో కూడా ఇదే బాటలో పయనిస్తూ ఈ రోజు వర్షం వల్ల ఢిల్లీలో రోడ్లు బ్లాక్ అయ్యాయి, ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరే ముందు మీ ఫ్లైట్ స్టేటస్ చూసుకోండి. వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సలహా ఇచ్చింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
10
మంగళవారం
26 । ఆగస్టు । 2025





## ఆరోగ్యానిచ్చే అటిక మామిడి



ఈ మొక్కను పునర్నవ మొక్క అని కూడా అంటారు. ఇది రోడ్ల పక్కన, పొలాల్లో, ఖాళీ స్థలాల్లో విరివిగా పెరుగుతుంది. ఇది భారతదేశంతో పాటు ఆసియా, ఆఫ్రికా, అమెరికా దేశాలలోనూ పెరుగుతుంది. ఈ మొక్కకు చిన్నని గులాబీ రంగు పువ్వులు పూస్తాయి. ఈ మొక్కను ఆయుర్వేద వైద్యంలో వినియోగిస్తారు. దీనిని మూత్రపిండాల సమస్యలను తగ్గించేందుకు వాడతారు. కాలేయ సమస్యలు, రక్తహీనత, ఉబ్బసం, వాపులు తగ్గించేందుకు కూడా వినియోగిస్తారు. ఇంకా ఈ మొక్క వేరులను అధిక మూత్ర విసర్జన సమస్యకు పరిష్కారంగా వాడతారు. ఈ మొక్క మధుమేహం, రక్తపోటును నియంత్రణలో ఉంచేందుకు ఉపయోగపడుతుంది. అలాగే నేలంతా పరుచుకుని నేల కోతకు గురి కాకుండా కాపాడుతుంది మొక్క.

# పకోడీలు వేసిన తర్వాత మిగిలిపోయిన నూనెతో ఇంట్లో

## ఒక్క బొద్దింక, ఎలుక కూడా ఉండదు, ఎలా వాడాలంటే





మనం ఇంట్లో పిండివంటలు, పూరీలు, పకోడీలు, బజ్జీలు చేసినప్పుడు కొంచెం నూనె మిగలడం కామన్. మిగిలిన నూనెను కొంతమంది కూరల తాలింపులకు వాడుతూ ఉంటారు. మరికొందరు వాడిన నూనె తిరిగి మళ్లీ వాడుతూ ఉంటారు. డీప్ ఫ్రైకు వాడిన నూనెను తిరిగి వాడితే.. ఆరోగ్యానికి హానిజరిగే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఈ నూనెను వాడకపోతేనే మంచిది. అలా అని చూస్తూ చూస్తూ పారేయడం ఎలా అనుకుంటున్నారా..? అయితే, నో టెన్షన్ ఈ నూనెను ఉపయోగించి కీటకాలు, ఎలుకలు, బొద్దింకల్ని తరిమికొట్టవచ్చు. ఈ చిట్కా చాలా ప్రభావవంతంగా ఉంటుంది. అంతేకాకుండా ఈ నూనెను ఎన్ని విధాలుగా వాడవచ్చో ఇక్కడ తెలుసుకుందాం.

**బొద్దింకలు, కీటకాలతో డేంజర్**

ఇంట్లో బొద్దింకలు, కీటకాలు, ఎలుకలు కనిపిస్తే కంపరం పుడుతుంది. అంతేకాకుండా.. తినే తిండి, ప్లేట్లు, వంటగదిలో ఎక్కడాపడితే అక్కడ కనిపిస్తూ.. చికాకు పుట్టిస్తాయి. చాలా మంది బొద్దింకలు కనిపించినా పట్టించుకోరు. అయితే, బొద్దింకలు చాలా డేంజర్. ఇవి బ్యాక్టీరియా వ్యాప్తికి పనిచేస్తాయి. బొద్దింకలు బ్యాక్టీరియాను వంటపాత్రలు, కూరగాయలు, పండ్లపై వదిలిపెడతాయి. దీంతో.. వ్యాధులు వచ్చే ప్రమాదముంది. బొద్దింకలు చాలా కలుషితంగా ఉండే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. పురుగులు కూడా తినే ప్లేటు మీద కనిపిస్తాయి. ఇక, ఎలుకలు ఇంట్లోని వస్తువుల్ని పాడు చేస్తాయి. అందుకే వీటిని వదిలించుకోవాలి. వంటలు చేసిన తర్వాత మిగిలిన నూనెతో బొద్దింకల్ని తరిమికొట్టవచ్చు. ఎలాగంటే

**బొద్దింకల్ని ఎలా వదిలించుకోవాలి?**

మిగిలిన నూనెను ఉపయోగించి కీటకాలు, బొద్దింకల్ని వదిలించుకోవడానికి కిరోసిన్ కూడా అవసరం. ముందుగా, మిగిలిన నూనె తీసుకొని దానికి కొద్దిగా కిరోసిన్ కలపండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని ఒక స్ప్రే బాటిల్‌లోకి తీసుకోండి. దీనిని ఇంటి మూలల్లో, తలుపుల దగ్గర, కీటకాలు, బొద్దింకలు వచ్చే ప్రదేశాలలో పిచికారీ చేయండి. ఈ మిశ్రమం కీటకాలు, బొద్దింకలు, ఎలుకలు, చీమలు ఇంట్లోకి రాకుండా చేస్తుంది. కిరోసిన్ కలవడం వల్ల నూనె ఘాటైన వాసనను కలిగి ఉంటుంది. ఈ వాసన దెబ్బకి అవి ఇంట్లో నుంచి



పారిపోతాయి.

**పనిముట్లకు పాలిషింగ్ చేయవచ్చు**

వంటల్లో మిగిలిన నూనెను తోట పనిముట్లు, తలుపు హ్యాండిళ్లు లేదా చెక్క వస్తువులను పాలిష్ చేయడానికి కూడా ఉపయోగించవచ్చు. ఇందుకోసం ముందుగా తేలికపాటి శుభ్రమైన గుడ్డను తీసుకోండి. నూనె గుడ్డకు అప్లై చేయండి. ఆ తర్వాత దుమ్ము, తుప్పు ఉన్న ప్రాంతాల్లో పాలిష్ చేయండి. ఇలా చేయడం వల్ల తుప్పు, దుమ్ము దూరమవుతాయి. చెక్క ఫర్నిచర్‌పై దీన్ని పూయడం వల్ల వాటి మెరుపు పెరుగుతుంది. మిగిలిన నూనె వృధాగా పారేసే బదులు ఇలా పాలిషింగ్ కోసం ఉపయోగించవచ్చు.

**గ్రీజు లేదా లూబ్రికెంట్‌లా వాడుకోవచ్చు**

పకోడీలు వేయించిన తర్వాత, పాన్‌లో మిగిలి ఉన్న నూనె తలుపుల క్రీక్ శబ్దాన్ని తొలగించడానికి సాయపడుతుంది. నిజానికి ఈ నూనె ఒక కందెన అంటే గ్రీజులాగా పనిచేస్తుంది. తలుపులు, కిటికీలు లేదా ఇతర యాంత్రిక పరికరాల జాయింట్స్‌కి దీన్ని పూయడం వల్ల ఘర్షణ తగ్గుతుంది. దీంతో, ఇలా చేయడం వల్ల పరికరాలు సున్నితంగా పనిచేస్తాయి.

**దీపం పెట్టుకోవచ్చు**

కాలం మారినప్పటికీ, నేటికీ చాలా ఇళ్లలో దీపాలు వెలిగిస్తూనే ఉన్నారు. ఈ దీపాలను ముఖ్యంగా ఇంటి అలంకరణలో ఉపయోగిస్తారు. ఇందుకోసం దీపాలను వెలిగించడానికి మిగిలిపోయిన నూనెను ఉపయోగించవచ్చు. దీనితో పాటు, అలంకార దీపాలలో కూడా నూనెను ఉపయోగించవచ్చు. మీరు మిగిలిన నూనెతో దీపాల్ని వెలిగించాలనుకుంటే దానిని ముందు ఫిల్టర్ చేయండి. ఆ

# ఇది త్యాగం కాదు... బాధ్యత

కల్నల్‌తో కాపురమంటే ఎడబాట్లు, త్యాగాలూ తప్పవు. నిరంతరం ప్రమాదాలతో చెలగాటాలూ తప్పవు. అయినా, ఆ వృత్తిని భర్తతో సమానంగా ప్రేమించడంతో పాటు, అటు కుటుంబానికీ, ఇటు నటనా జీవితానికీ సమ న్యాయం చేస్తున్నారు 'లక్కీ భాస్కర్' చిత్రంలో నటించిన గాయత్రి భార్గవి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమె 'నవ్య'తో పంచుకున్న జీవితానుభావాలివి...

మాది హైదరాబాదే! ప్రస్తుతం కుటుంబమంతా ఇక్కడే ఉంది. మాకు ఇద్దరు మగ పిల్లలు. పెద్ద బాబు అక్షజ్ భావిక్‌కు 18 ఏళ్లు. చిన్న బాబు కృతిక్ భావిక్‌కు ఎనిమిదేళ్లు. పెళ్లయ్యే నాటికి డిగ్రీ వరకే చదివినా, పెళ్లి తర్వాత చదువును కొనసాగించి ఎమ్ఎ, ఎమ్‌ఫిల్ చేయగలిగాను. అదే సమయంలో టివిలో కూడా పని చేశాను. భోపాల్, అసోం, బెంగుళూరు... ఇలా విక్రమ్‌తో ఎక్కడకు వెళ్లినా ఆ ప్రాంతాల్లోని అనాథాశ్రమాలకు వెళ్లి పిల్లలకు ఉచితంగా చదువు చెప్పేదాన్ని. ఆయన కూడా తన తీరిక సమయాల్లో పిల్లలకు గణితం బోధించేవారు.

'లక్కీ భాస్కర్'తో నాకు మంచి గుర్తింపు వచ్చింది. హీరోయిన్ మీనాక్షిది కూడా సైనిక కుటుంబమే! దాంతో మేమిద్దరం వెంటనే కలిసిపోయాం. సినిమా చివరివరకూ నేనెంతో ఎంజాయ్ చేశాను. మా అబ్బాయి దుల్కర్ సల్మాన్ అభిమాని. దాంతో షూటింగ్ సమయంలో మా వారు బాబును వెంటబెట్టుకుని సెట్‌కు వచ్చారు. ఆయనకు మా ప్రొడక్షన్ భోజనం తినిపించాం. ఆ వాతావరణాన్ని ఆయన చాలా బాగా ఎంజాయ్ చేశారు.

విక్రమ్ సుబ్రహ్మణ్యం... మావారు. ఆర్మీలో రెండో తరానికి చెందినవారు. మా మామయ్యగారు,





ఆడపడుచు కూడా సైన్యంలో పని చేశారు. హిమనీనదాల దగ్గరకు వెళ్లిన తొలి బృందాల్లో మావారు కూడా ఉన్నారు. అప్పటివరకూ యుద్ధ సమయంలో తప్ప సైనికులెవరూ అక్కడకు వెళ్లేవారు కారు. పాకిస్తాన్, భారత్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో ఆరు నెలల గడపడం మొదలుపెట్టిన మొదటి బృందాలతో ఆయన కూడా వెళ్లారు. అప్పట్లో అక్కడ ఎలాంటి సదుపాయాలూ ఉండేవి కావు. ఉత్తరాలే ఏకైక కమ్యూనికేషన్. దాంతో మేమందరం ఆయనకు ఉత్తరాలు రాసేవాళ్లం. మేం రాసిన ఉత్తరం ఆయనకు చేరడానికి 15 రోజులు పడుతుంది. అయితే అప్పట్లో ఆయనకు నేనొక మంచి స్నేహితురాలిని మాత్రమే! చెన్నైలోని మా కజిన్ క్లాస్‌మేట్ ఆయన. అలా ఆయనతో పరిచయం ఏర్పడింది. ఓ సందర్భంలో ఆయన హైదరాబాద్ వచ్చారు. విక్రమ్‌కు హైదరాబాద్‌లో స్నేహితులు లేరు కాబట్టి కంపెనీ ఇవ్వమని మా కజిన్ అడగడంతో ఒకట్రెండు సార్లు కలిశాను. అలా మా స్నేహం మరింత పెరిగింది. అది ప్రేమగా మారిందనే విషయం, కలిసి 'బార్డర్' సినిమాకు వెళ్లినప్పుడు తెలిసింది. సినిమాలో సైనికుల కష్టాలు చూసి నేను కళ్లనీళ్లు పెట్టుకుంటూ ఉంటే, ఆయనేమో పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. కానీ అప్పటికి నేనింకా చిన్నదాన్ని. ఇంట్లో ఒప్పుకోరని అభ్యంతరం చెప్పాను. ఆ తర్వాత చాలా కాలం పాటు మా మధ్య ఉత్తరాలు, ఫోన్ కాల్స్ కొనసాగాయి. ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేసేనాటికి ఆయన ఒక కోర్సు కోసం హైదరాబాద్ ఈమ్ఇ సెంటర్‌కి వచ్చి ఇక్కడే మూడేళ్లు ఉండిపోయారు. ఆ సమయంలో పెద్దల అంగీకారంతో మేమిద్దరం 2004లో పెళ్లితో ఒక్కటయ్యాం.

**ఆ కొరతలు తప్పవు**


సైనికుడి భార్యగా ఆయనతో నాకున్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనదని చెప్పాలి. సగటు మహిళల్లాగే భర్తతో కలిసి కుటుంబ వేడుకలు, పండుగలు జరుపుకోవాలని నేనూ ఆశపడుతూ ఉంటాను. కానీ అలా అన్నిసార్లూ సాధ్యపడేది కాదు. టూర్లూ, షికార్లూ వీలుపడేవి కావు. పిల్లల పుట్టినరోజులు కూడా ఆయన లేకుండా జరుపుకోవలసి వస్తూ ఉండేది. అయితే పెళ్లికి ముందే సైనికుల జీవితాల పట్ల కొంత అవగాహన ఉండడంతో నేనెప్పుడూ దాన్నొక కొరతగా భావించలేదు. దేశాన్ని కాపాడే బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న విక్రమ్ అంటే నాకెంతో గౌరవం. ఆయన మాతో కలిసి ఉండే కొద్ది రోజులూ ఆనందంగా గడుపుతూ ఉంటాం. ఆయన అప్పుడప్పుడూ తన సైనిక అనుభవాలను నాతో పంచుకునేవారు. అయితే ముఖ్యమైన విషయాలే తప్ప తాను పాల్గొనే కొన్ని రహస్య మిషన్స్ గురించి చర్చించేవారు కారు. కొన్ని సందర్భాల్లో తనకెదురైన ప్రమాదకరమైన సంఘటనల గురించి చాలా కాలం తర్వాత ఎంతో తాపీగా, యధాలాపంగా చెప్పేవారు. ఆయన చెప్తున్న విషయాలు విన్నప్పుడు గుండె ఝల్లుమనేది. ఓ సందర్భంలో హిమపాతం నుంచి తృటిలో తప్పించుకున్నాననీ, మరో సందర్భంలో చెవి పక్క నుంచి తుపాకీ గుండు దూసుకువెళ్లిందనీ నాతో చెప్పారు. ఇలాంటివి విన్నప్పుడు ఒక సగటు భార్యగా భయాందోళనకు లోనయ్యేదాన్ని.

**అదే చివరిసారి అనుకున్న సందర్భం**

సైనికుల భార్యల జీవితాలు తీగ మీద నడక చందం. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ఇక ఆయనను చూడడం ఇదే చివరిసారి అనుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అప్పటికి మా పెళ్లై ఆరు నెలలు. ఓ రోజు అకస్మాత్తుగా సైన్యం నుంచి ఆయనకు పిలుపొచ్చింది. రాత్రికి రాత్రే సైనికులందరూ వెళ్లిపోయారు. వెళ్లినవాళ్లు ప్రాణాలతో తిరిగొస్తారనే నమ్మకం లేదు. పాస్‌పోర్టులు, బ్యాంక్ పాస్‌బుక్స్ చేతికి అందించి, తిరిగి రాకపోతే ఏం చేయాలో వివరిస్తుంటే విపరీతంగా భయపడిపోయాను. సినిమాల్లో తప్ప, నిజ జీవితంలో సైనికుల జీవితాలు ఎలా ఉంటాయో ఏమాత్రం అవగాహన లేని నేను గుండెలదురుతూనే ఆయనను సాగనంపాను. అయితే సినిమాల్లోలా సైనికులను ఏడుస్తూ సాగనంపే సన్నివేశాలు నిజ జీవితంలో ఉండవు. సంతోషంగా హారతిచ్చి, బొట్టు పెట్టి పంపిస్తాం. భయం, బాధ ఉన్నా, వాటిని మనసులోనే దాచుకుని దేశ ప్రజల భద్రత కోసం ప్రాణాలకు తెగిస్తున్న భర్తలను హుందాగా సాగనంపుతాం! వాళ్లు వెళ్లిపోయిన తర్వాత సైనికుల భార్యలుగా మేమందరం ఎంతో బాధ్యతగా నడుచుకుంటాం! పిల్లలూ, పెద్దల బాగోగులు చూసుకోవడంతో పాటు కంటోన్మెంట్లలోని జవాన్ల భార్యాపిల్లలను చూసుకోవలసిన బాధ్యత కూడా పైఅధికారుల భార్యలకు ఉంటుంది. కల్నల్ భార్యగా నేనలాంటి బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉంటాను. మేమందరం ఒకే కుటుంబంలా కలిసిమెలిసి జీవిస్తూ ఉంటాం.

# ఫేస్ స్టీమింగ్ ఉపయోగిస్తున్నారా..


## ఈ 5 తప్పులు చేయకండి..



అమ్మాయిలు అందంగా కనిపించడానికి చాలా రకాల ప్రయత్నాలు చేస్తారు. అందులో ఫేస్ స్టీమింగ్ ఒకటి. ఫేస్ స్టీమింగ్ ముఖ సంరక్షణకు ఒక గొప్ప పద్ధతి. ఇది చర్మాన్ని లోతుగా శుభ్రపరచడమే కాకుండా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ముఖానికి సహజమైన మెరుపును ఇస్తుంది. కానీ, ఫేస్ స్టీమింగ్ తప్పుగా చేస్తే అది ప్రయోజనానికి బదులుగా హాని కలిగిస్తుంది. తరచుగా ప్రజలు తమ ముఖానికి ఆవిరి పట్టేటప్పుడు కొన్ని సాధారణ తప్పులు చేస్తారు. దీని వలన చర్మం పొడిగా, ఎర్రగా లేదా చికాకుగా మారుతుంది. మీరు గ్లో కోసం ఫేస్ స్టీమింగ్ ఉపయోగిస్తే ఈ 5 తప్పులను నివారించండి.

**ఎక్కువసేపు ఆవిరి**

కొంతమంది ఎక్కువసేపు ఆవిరి పట్టడం వల్ల చర్మం మరింత మెరుస్తుందని అనుకుంటారు. కానీ, ఇలా చేయడం పెద్ద తప్పు. ఎక్కువసేపు ఆవిరిని వదులుతూ ఉండటం వల్ల చర్మంలోని సహజ తేమ తగ్గిపోతుంది. దీని వలన చర్మం పొడిబారడటమే కాకుండా ఎర్రగా మారుతుంది. అందువల్ల 5-10 నిమిషాల కంటే ఎక్కువసేపు ఫేస్ స్టీమింగ్ చేయకపోవడమే మంచిది.



**ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా**

మీరు మీ ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా నేరుగా ఆవిరి తీసుకుంటుంటే, అది మీ రంధ్రాలను మూసుకుపోయేలా చేస్తుంది. ఆవిరి పట్టే ముందు, ముఖం నుండి మురికి, మేకప్, నూనెను సరిగ్గా శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం. లేకుంటే చనిపోయిన చర్మం బ్యాక్టీరియా రంధ్రాలలోకి లోతుగా వెళ్తుంది. కాబట్టి ఆవిరి పట్టే ముందు మీ ముఖాన్ని తేలికపాటి క్లెన్సర్‌తో కడుక్కోవడం మంచిది.

**మరిగే నీటిని..**

నీరు ఆవిరి పట్టడానికి చాలా వేడిగా ఉంటే, అది మీ చర్మానికి హానికరం. చాలా వేడి ఆవిరి చర్మపు చికాకును కలిగిస్తుంది. అందువల్ల, నీటిని గోరువెచ్చగా ఉంచండి. బాగా మరిగే నీటిని ఉపయోగించవద్దు.

**రోజూ చేయడం**

ఫేస్ స్టీమింగ్ చర్మానికి మేలు చేస్తుంది, కానీ రోజూ చేయడం హానికరం. నిరంతరం ఆవిరి పట్టడం వల్ల చర్మంలోని సహజ నూనెలు తొలగిపోయి, చర్మం పొడిగా మరియు సున్నితంగా మారుతుంది. వారానికి 1-2 సార్లు మాత్రమే ఫేస్ స్టీమింగ్ చేయడం మంచిది.

**చల్లటి నీటితో..**

ఆవిరి పట్టిన తర్వాత చర్మ రంధ్రాలు తెరుచుకుంటాయి. మీరు వాటిని సరిగ్గా చూసుకోకపోతే మురికి, బ్యాక్టీరియా మళ్ళీ లోపలికి ప్రవేశిస్తాయి. ముఖం మీద ఆవిరి పట్టిన తర్వాత వెంటనే ముఖాన్ని చల్లటి నీటితో కడుక్కోవడం, మాయిశ్చరైజర్ రాయడం అవసరం.

# ముత్యాలతో మురిపెంగా...

లాకెట్: తెల్లని సీజెడ్ రాయికి అంతకన్నా పెద్ద సైజు ముత్యాన్ని జోడించి లాకెట్‌లా రూపొందిస్తారు. దీనిని సన్నని బంగారు గొలుసుకి అమరుస్తారు. ఈ ముత్యం గొలుసు మెడ వరకు వస్తుంది. అన్ని రకాల దుస్తుల మీద చక్కగా అమరుతుంది. టీషర్ట్, జీన్స్ లాంటి మోడరన్ దుస్తులు ధరించే యువతులకు బాగుంటుంది.

**బ్రాస్‌లెట్:** అంత చిన్నవి కాకుండా కొద్దిగా పెద్ద ముత్యాలను మందపాటి దారంతో కూర్చి బ్రాస్‌లెట్‌ను తయారు చేస్తారు. ఈ ముత్యాల బ్రాస్‌లెట్‌ను చేతికి పెట్టుకుంటే ధరించిన డ్రెస్ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. నేవీ బ్లూ, ముదురు గులాబీ, లావెండర్ రంగు దుస్తుల మీద హుందాగా ఉంటుంది. దీనిని ఉద్యోగినులు ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నారు.

ఉంగరం: శ్వేత వర్ణంలో మెరిసే ముత్యాన్ని బంగారు ఉంగరంలో అమరుస్తారు. ఈ ముత్యపు ఉంగరం సంప్రదాయ దుస్తులతోపాటు ఆధునిక దుస్తుల మీద కూడా రాయల్‌గా కనిపిస్తుంది. కాలేజీ యువతులనుంచి మధ్య వయసు మహిళల వరకు అందరూ ఈ ఉంగరాన్ని ఎంపిక చేసుకుంటున్నారు.

కమ్మలు: ముత్యాలతో రూపొందించిన వివిధ రకాల డ్రాప్స్, స్టడ్స్, హూప్స్, రింగ్స్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగినులతోపాటు గృహిణులు, కాలేజీలకు వెళ్లే అమ్మాయిలు వీటిని పెట్టుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఎలాంటి ముఖాకృతికైనా ఈ ముత్యాల కమ్మలు సొగసును అందిస్తాయి.



నవచిత్ర



## ఓజీ లో అకిరా..

ఓజీ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా సెప్టెంబర్ 25న రిలీజ్ ఫిక్స్ చేసారు. సరిగ్గా నెల రోజుల్లో రిలీజ్ ఉంది కాబట్టి మేకర్స్ సినిమా ప్రమోషన్స్ కి సిద్ధమవుతున్నారు. ఐతే సినిమాకు ఒక నాలుగు రోజుల ప్యాచ్ వర్క్ పని ఉందట. అది పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్ కూడా ఫినిష్ చేస్తారని తెలుస్తుంది. సుజిత్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఓజీ సినిమా గురించి ప్రతి అప్డేట్ ఫ్యాన్స్ కి పూనకాలు తెప్పిస్తుంది. ఇప్పటికే ఓజీ గ్లింప్స్ ఇంకా పవర్ స్టోర్మ్ సాంగ్ అంచనాలు పెంచగా త్వరలో మరో టీజర్ ని రిలీజ్ చేస్తారని తెలుస్తుంది. అకిరా నందన్ ఉన్నాడంటూ.. ఐతే ఓజీ సినిమాలో పవర్ స్టార్ తనయుడు అకిరా నందన్ ఉన్నాడంటూ కొన్ని వార్తలు వస్తున్నాయి. ఓజీ నుంచి వచ్చిన పవర్ స్టోర్మ్ సాంగ్ లో కొన్ని షాట్స్ చూస్తే అది అకిరా నందన్ లానే అనిపిస్తున్నాడు. ఐతే సినిమాలో పవన్ కళ్యాణ్ పాత్ర 3 దశల్లో కనిపిస్తుందట. టీనేజ్ రోల్ కూడా ఉంటుందని టాక్. అది పవన్ కళ్యాణ్ ప్లేస్ లో అకిరా నందన్ చేస్తున్నాడని అంటున్నారు. ఒకవేళ పవన్ కళ్యాణ్ చిన్నప్పటి రోల్ అకిరా చేస్తే మాత్రం ఇక ఫ్యాన్స్ కి ఫ్యూజులు అవుట్ అవుతాయని చెప్పొచ్చు. చేతులు మరిన స్టార్ హీరోయిన్ మూవీ? సినిమాలో అకిరా ఉంటే ఓజీ డబుల్ ధమాకా అన్నట్టే లెక్క. సినిమాపై ఉన్న అంచనాలకు ఈ అప్డేట్స్ కూడా సూపర్ ఎగ్జైట్ మెంట్ అందిస్తున్నాయి. ఓజీ సినిమా గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్ కథతో వస్తుంది. సుజిత్ ఈ సినిమాను చాలా ప్లానింగ్ తో తెరకెక్కిస్తున్నారు. తప్పకుండా పవర్ స్టార్ ఫ్యాన్స్ కి కావాల్సిన మాస్ ఫీస్ట్ అందించేలా ఈ సినిమా ఉంటుందని అంటున్నారు. పవర్ స్టోర్మ్ సాంగ్.. డివివి దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాలో పవన్ సరసన ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటించింది.



## అందాల ఎల్లోరా శిల్పంలా...!



బాలీవుడ్‌లో ఎన్నో సినిమాల్లో ముఖ్య పాత్రల్లో నటించడంతో పాటు, పలు ప్రత్యేక పాటల్లో తన అందాలతో అలరించిన ముద్దుగుమ్మ నోరా ఫతేహీ. హిందీ ప్రేక్షకులను మాత్రమే కాకుండా సౌత్‌లోనూ ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి ఆధరణ, అభిమానం సొంతం చేసుకున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందాల ఫోటోలను షేర్ చేయడం ద్వారా మళ్లీ వార్తల్లో నిలిచింది. ఈసారి అంతకు మించి అన్నట్లుగా నోరా ఫతేహీ అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఆకట్టుకుంది. నోరా ఫతేహీ తాజాగా ఒక మ్యూజిక్ వీడియోలో నటించింది. ఆ వీడియో షూటింగ్ సందర్భంగా సెట్స్ లో తీసిన ఫోటోలు అంటూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ ఫోటోలను ముద్దుగుమ్మ షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. ముగ్గురం కాబోతున్నామంటూ! వీడియో ఆల్బమ్‌లో నోరా ఫతేహీ ఓహ్ మామా టెటెమా.. అంటూ సాగే పాటలో నోరా ఫతేహి అందంతో పాటు, డాన్స్ ప్రతిభ ను కనబర్చి కన్నుల విందు చేసింది. తక్కువ సమయంలోనే 20 మిలియన్ వ్యూస్‌ను దక్కించుకోవడం ద్వారా నోరా ఫతేహీ క్రేజ్ ఏంటో చెప్పకనే చెప్పింది. కన్నుల విందు చేసే విధంగా ఉన్న ఈ పాటలో నోరా ఫతేహీ విభిన్నమైన అల్ట్రా మోడ్రన్ డ్రస్‌లు వేయడంతో పాటు, స్కిన్ షో చేసింది. అందంతో పాటు, డాన్స్ కలగలిపిన ఈ పాటతో నోరా ఫతేహా ఒక్కసారిగా తనవైపు అందరి దృష్టిని తిప్పుకుంది. ఈ మధ్య కాలంలో ఈ అమ్మడు ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం కామన్‌గా చూస్తూ ఉంటాం. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లుగా నోరా ఫతేహి ఆకట్టుకుంది. నడుము, నాభి అందం చూపించడం ద్వారా కవ్విస్తున్న ఈ అమ్మడు నిజంగా ఎల్లోరా శిల్పం అన్నట్లుగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బాహుబలి ఐటెం సాంగ్‌తో పాపులర్ తెలుగు ప్రేక్షకుల ముందుకు టెంపర్, బాహుబలి 1, కిక్ 2 సినిమాలతో వచ్చిన నోరా ఫతేహి ఈ మధ్య కాలంలో ఎక్కువగా బాలీవుడ్ సినిమాలకు పరిమితం అవుతోంది. గత ఏడాది మట్కా సినిమాతో వచ్చినప్పటికీ పెద్దగా ప్రయోజనం దక్కలేదు. తెలుగులో ఈమె ఇకపై ఎక్కువగా కనిపించకూ దదని భావిస్తున్నట్లుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇటీవల ఒక ఫిల్మ్ మేకర్ ఈమెను ప్రత్యేక పాట కోసం సంప్రదించిన సమయంలో సున్నితంగా తిరస్కరించి నట్లు సమాచారం అందుతోంది. హిందీలో మాత్రం బ్యాక్ టు బ్యాక్ ఈమె సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

## పెళ్లిళ్ల బ్రోకర్ చెప్పిన మాటకు నటి మైండ్ బ్లాక్

ఇది పెళ్లిళ్ల సీజన్. ఈ సీజన్ ని ఎన్ క్యాష్ చేసుకునేందుకు మ్యారేజ్ బ్యూరోలు తమవంతు ప్రయత్నాల్లో ఉన్నాయి. ఇది పెళ్లిళ్ల సీజన్. ఈ సీజన్ ని ఎన్ క్యాష్ చేసుకునేందుకు మ్యారేజ్ బ్యూరోలు తమవంతు ప్రయత్నాల్లో ఉన్నాయి. ఇదే సమయంలో నెట్ ఫ్లిక్స్ మ్యాచ్ మేకర్ ఫేం సిమా తపారియా చర్చల్లోకొచ్చారు. ఓసారి ముస్లిమ్ నటి నౌషీన్ అలీ నేరుగా సిమాను సంప్రదించి తనకు వరుడిని వెతికి పెట్టాల్సిందిగా కోరారు. అయితే ఆ సమయంలో సిమా నుంచి వచ్చిన జవాబు తీవ్ర ఆందోళనను కలిగించిందని నటి నౌషీన్ తెలిపారు. ముస్లిములకు వివాహం కోసం మ్యాచ్ దొరకడం చాలా కష్టమని సిమా అన్నారట. కాథలిక్, సిక్కు లేదా పంజాబీ ఎవరైనా ఫర్వాలేదని చెప్పగా, ముస్లిములకు వీళ్లలో ఎవరూ దొరకరు అని చెప్పారట. తన సోదరి సూచన మేరకు తాను సిమాను సంప్రదించానని నౌషీన్ వెల్లడించారు. కానీ మతం కారణంగా ఈరోజుల్లో భాగస్వామి దొరకడం సులువు కాదని చెప్పడం ఆందోళన కలిగించిందని నౌషీన్ ఆవేదన చెందారు. తాను ముస్లిమ్ కుటుంబంలో జన్మించినా కానీ ఆ మతాన్ని అనుసరించనని ఆమె చెప్పింది. వేరే మత విశ్వాసం కలిగి ఉంటే, హిందూ మతంలో వ్యక్తిని పెళ్లి చేసుకోవడం కుదరదు! అని సిమా అనడం తనకు షాకిచ్చిందని నౌషీన్ తెలిపింది. అయితే నాకు సరిపోయే జోడీ ఎవరు? అని కూడా నౌషీన్ అడిగారట. సిరీస్ నటిగా నౌషీన్ పాపుల్. సిందూర్ తేరే నామ్ కా సహా పలు షోలతో పాపులరయ్యారు. బుల్లితెర, వెండితెర అవకాశాలను అందిపుచ్చుకుంటున్న ఈ నటి మునుముందు స్టార్ గా మరో స్థాయికి ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నానని వెల్లడించారు.





## గుడ్ న్యూస్ చెప్పిన పరిణీతి చోప్రా.. ముగ్గురం కాబోతున్నామంటూ!



ఈ మధ్యకాలంలో చాలామంది హీరోయిన్స్ పెళ్లి , పిల్లల విషయంలో చాలా ఫాస్ట్ గా ఉంటున్నారు. అయితే కొంతమందేమో కెరీర్ ని దృష్టిలో పెట్టుకొని పెళ్లి లేటుగా చేసుకోవడంతో పాటు పిల్లల్ని కూడా లేటుగానే కంటున్నారు. కానీ మరి కొంతమంది హీరోయిన్లు మాత్రం పెళ్లి కరెక్ట్ ఏజ్ లోనే చేసుకుంటున్నారు. పిల్లల్ని కూడా కరెక్ట్ ఏజ్ లోనే కంటున్నారు. ఆ తర్వాత సినిమాల్లో రాణిస్తున్నారు. అలా తాజాగా మరొక బ్యూటీ తల్లి కాబోతున్నాను అనే గుడ్ న్యూస్ ని అభిమానులతో షేర్ చేసుకుంది. మరి తల్లి కాబోతున్న ఆ హీరోయిన్ ఎవరో కాదు పరిణీతి చోప్రా.. బాలీవుడ్ బ్యూటీ పరిణీతి చోప్రా తాజాగా తాను తల్లి కాబోతున్నాను అనే గుడ్ న్యూస్ ని అభిమానులతో పంచుకుంది.. ఈ గుడ్ న్యూస్ ని అభిమానులతో పంచుకుంటూ "ఓ వెండి పళ్లెంలో అందంగా ఉండే ఓ కేకులో చిట్టి పాదాలతో పాటు 1o1=3 అంటూ ఇద్దరం కాస్త ముగ్గురం కాబోతున్నాం" అంటూ ప్రెగ్నెన్సీ కి సంబంధించిన గుడ్ న్యూస్ చెప్పుకొచ్చింది. అంతేకాకుండా ఓ వీడియోలో.. పరిణితి చోప్రా, రాఘవ చద్దా ఇద్దరు నడుచుకుంటూ వెళ్తున్నారు. వాళ్ళిద్దరూ చేతులు పట్టుకొని నడుస్తూ వెళ్తున్నారు. అలాగే మా లిటిల్ యూనివర్స్ వస్తుంది అంటూ ఎమోజీ బొమ్మల్ని కూడా షేర్ చేసుకున్నారు. అలా ఫైనల్ గా ఈ జంట తల్లిదండ్రులు కాబోతున్నాం అనే గుడ్ న్యూస్ ని పంచుకున్నారు. ఇక పరిణీతి చోప్రా, రాఘవ్ చద్దాల విషయానికి వస్తే.. 2023లో పెళ్లి చేసుకున్న పరిణీతి చోప్రా, రాఘవ్ చద్దా ఇద్దరు గత రెండు సంవత్సరాలుగా ఎంతో అన్యోన్యంగా ఉంటూ తమ మధ్య ఉన్న ప్రేమని ప్రతి సందర్భంలో బయట పెడుతూ వస్తున్నారు. ఇక 2012 నుండి బాలీవుడ్ సినిమాల్లో రాణిస్తున్న పరిణీతి చోప్రా ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు అయినటువంటి రాఘవ్ చద్దాని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అలా పెళ్లి తర్వాత కూడా పరిణితి చోప్రా పలు సినిమాల్లో నటించింది. ఇక గత కొద్ది రోజులుగా కొత్త సినిమాలకు సంబంధించి ఎలాంటి అప్డేట్ ఇవ్వక పోయినప్పటికీ తన పర్సనల్ లైఫ్ కి సంబంధించి ఒక గుడ్ న్యూస్ చెప్పడంతో అభిమానులు అందరూ ఖుషి అవుతున్నారు. ఇక వీళ్ళు పెట్టిన పోస్ట్ చూసిన చాలామంది నెటిజెన్లు, అభిమానులు, సెలబ్రిటీలు కంగ్రాట్స్ అంటూ తెలియజేస్తున్నారు. అయితే పరిణితి చోప్రా రాఘవ చద్దాల గురించి ఇప్పటికే పలు ప్రెగ్నెన్సీ రూమర్లు వినిపించాయి. పెళ్లయి ఏడాది కాకముందు నుండే పరిణితి చోప్రా ప్రెగ్నెన్సీ వార్తలు చక్కర్లు కొట్టాయి. అలా ఫైనల్ గా ఈ జంట పేరెంట్స్ కాబోతున్నాం అనే గుడ్ న్యూస్ ని అభిమానులతో పంచుకున్నారు.

## బిగ్‌బాస్ హౌస్‌లోకి కుంభమేళా వైరల్ బ్యూటీ!




సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక.. ఎవరు ఎప్పుడు ఎలా ఫేమస్ అవుతున్నారో అర్థం అవ్వడం లేదు. ఇప్పటివరకు మామూలుగా మన మధ్యలో తిరిగిన వారే రాత్రికి రాత్రే ఫేమస్ అవుతున్నారు. అలా ఎవరు ఎప్పుడు ఫేమస్ అవుతారో ఊహించలేం. అలా సోషల్ మీడియా ద్వారా కుంభమేళా జరిగిన సమయంలో చాలామంది ఫేమస్ అయ్యారు. లేడీ సన్యాసిని, పూసలు అమ్ముకునే మోనాలిసా ఇలా ఎంతో మంది ఫేమస్ అయ్యారు. అయితే కుంభమేళా తొక్కిసలాట సమయంలో ఓ అమ్మాయి చాలా ఫేమస్ అయింది. తొక్కిసలాటలో చాలామంది ప్రాణాలు కోల్పోయారు అంటూ మీడియా ముందు ఏడ్చి వైరల్ అయింది. ఆమె ఎవరో కాదు తాన్యా మిట్టల్.. అలా ఒకే ఒక్క వీడియోతో దేశవ్యాప్తంగా ఫేమస్ అయిన తాన్యా మిట్టల్ తాజాగా బిగ్ బాస్ 19లోకి కంటెస్టెంట్ గా ఎంట్రీ ఇచ్చింది.. మరి బిగ్ బాస్ లోకి ఎంట్రీ ఇచ్చిన తాన్యా మిట్టల్ బ్యాక్ గ్రౌండ్ ఏంటి? ఆమె ఏం చేస్తుంది? అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. బిగ్ బాస్ హౌస్ లోకి మహా కుంభమేళా వైరల్ బ్యూటీ.. సల్మాన్ ఖాన్ హోస్ట్ గా చేస్తున్న హిందీ బిగ్ బాస్ సీజన్ 19 లో మహాకుంభమేళ ద్వారా ఫేమస్ అయిన తాన్యా మిట్టల్ కంటెస్టెంట్ గా ఎంట్రీ ఇచ్చింది. ఇన్స్టాలో 2.5 మిలియన్ ఫాలోవర్స్ ఉన్న తాన్యా మిట్టల్ కి సోషల్ మీడియాలో చాలా పాపులారిటీ ఉంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ బిగ్ బాస్ లోకి రావడంతో చాలామంది ఆమె అభిమానులు కప్పు గెలవాలని కోరుకుంటున్నారు. ఇక మరికొంతమందేమో తాన్యా మిట్టల్ ఎవరు? ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏంటి? అని సెర్చ్ చేస్తున్నారు. తాన్యా మిట్టల్ బ్యాక్ గ్రౌండ్.. మరి తాన్యా మిట్టల్ బ్యాక్ గ్రౌండ్ విషయానికి వస్తే.. తాన్యా మిట్టల్ చండీగఢ్ లోని గ్వాలియర్ లో పుట్టి పెరిగింది. ఉన్నత చదువులు చదివి సొంతంగా హ్యాండ్ మేడ్ లవ్ అనే సంస్థను కూడా స్థాపించింది. అలాంటి ఈ ముద్దుగుమ్మ మహిళల సాధికారత, విద్య, ఆరోగ్యం కోసం ఎప్పుడు ఆలోచిస్తుంది. ఇక ఈమె కేవలం హ్యాండ్ మేడ్ విత్ లవ్ బై తాన్యా అనే బ్రాండ్ ని స్థాపించడమే కాదు మోడలింగ్ రంగంలో రాణించి 2018లో మిస్ ఆసియా టైటిల్ ని కూడా గెలుచుకుంది. అలా అందాల పోటీలలో కూడా తాన్యా మిట్టల్ రాణించిందని చెప్పుకోవచ్చు. మల్టీ టాలెంటెడ్ పర్సన్ గా గుర్తింపు.. అలాంటి తాన్యా మిట్టల్ గురించి మరికొన్ని విషయాలు చూస్తే..ఆమె మల్టీ టాలెంటెడ్..ఎందుకంటే ఓవైపు హ్యాండ్ మేడ్ విత్ లవ్ బై తాన్యా అనే బ్రాండ్ ని స్థాపించడమే కాకుండా మరోవైపు పాడ్ కాస్టర్ గా..మోడల్ గా.. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గా అన్ని రంగాల్లో కూడా రాణిస్తోంది. ఇక తన బ్రాండ్ ద్వారా హ్యాండ్ కఫ్ లు, హ్యాండ్ బ్యాగులు, చీరలు వంటివి తయారు చేస్తుంది.. మిస్ ఆసియా టూరిజం యూనివర్సిటీ కిరీటం.. ఇక మోడలింగ్ రంగం విషయానికి వస్తే.. తాన్యా మిట్టల్ భారతదేశం తరఫున లెబనాన్ లో జరిగిన మిస్ ఆసియా టూరిజం యూనివర్సిటీ పోటీలలో పాల్గొని మిస్ ఆసియా టూరిజం కిరీటం కూడా గెలుచుకుంది..

## 'పరదా' అనుపమ.. మనసులు గెలుచుకుందిగా!



మాలీవుడ్ బ్యూటీ, హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ కు టాలీవుడ్ లో ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఇప్పటి వివిధ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. కమర్షియల్ సినిమాల్లో సగటు హీరోయిన్ గా, పక్కింటి అమ్మాయిగా కనిపించి మెప్పించిన అమ్మడు.. ఇప్పుడు పరదాతో సందడి చేస్తున్నారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఆ సినిమాలో అనుపమ లీడ్ రోల్ లో కనిపించారు. సీనియర్ నటి సంగీత, మాలీవుడ్ నటి దర్శనతోపాటు రాగ్ మయూర్ కీలక పాత్రలు పోషించారు. రిలీజ్ కు ముందు ప్రమోషనల్ కంటెంట్ తో మంచి హైప్ అందుకున్న పరదా మూవీ.. రీసెంట్ గా ఆగస్టు 22వ తేదీన థియేటర్స్ లో విడుదలైంది. అయితే సినిమాకు ఆశించిన స్పందన రాలేదని చెప్పాలి. కథ కొత్తదే అయినా.. ఆసక్తికరంగా మలచడంలో మాత్రం విఫలమయ్యారు మేకర్స్. దీంతో పరదా మూవీ అనుకున్నంత రేంజ్ లో హిట్ అవ్వలేదు. తద్వారా అనుపమ ఖాతాలో హిట్ చేరలేదు. అయితేనేం ఆమె ఈ సినిమాకు గాను చేసిన కృషిని అంతా ఇప్పుడు ప్రశంసిస్తున్నారు. చెప్పాలంటే.. అనుపమ పరదా మూవీని ఓ రేంజ్ లో ప్రమోట్ చేశారు. ప్రతి ప్రమోషనల్ ఈవెంట్ లో కనిపించారు. సినిమాలో తన నటనతో అందరినీ ఆకట్టుకున్నారు. కెరీర్ లో అత్యుత్తమ పాత్రలో కనిపించారు. డీ గ్లామర్ రోల్ చేసినా.. తన యాక్టింగ్ తో ఫిదా చేశారు. కథలో భావోద్వేగ భారాన్ని ఆమె నిజాయితీతో మోశారని చెప్పాలి. సుబ్బు పాత్రలో ఒదిగిపోయారు. అయితే నార్మల్ గా ప్రతి సినిమాలో కూడా తన కళ్లతోనే భావాలు పలికించే అమ్మడు.. పరదా మూవీలో ఎక్కువభాగం సన్నివేశాల్లో పరదా కప్పుకొనే కనిపిస్తూ ఉంటారు. కానీ తన బాడీ లాంగ్వేజ్ తో, డైలాగ్స్ తో మెప్పించారు. సన్నివేశాల్ని పండించే ప్రయత్నం చేసి సక్సెస్ అయ్యారు. సినిమా స్టార్టింగ్ లో ఒకలా కనిపించే ఆమె పాత్ర, చివరకొచ్చేసరికి పూర్తిగా మారుతుంది. ఏదేమైనా కొన్ని సినిమాలు వాణిజ్యపరంగా విజయం సాధించవు. కానీ అవి చిరస్మరణీయమైన ప్రదర్శనలను ఇస్తాయి. ఇప్పుడు పరదా మూవీ విషయంలో అదే జరిగింది. బాక్సాఫీస్ వద్ద మూవీ విఫలమైనప్పటికీ అనుపమ నటన టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. మనసులు గెలుచుకుంది.

## బొడ్డుపై పండ్లు, సలాడ్‌లు వేసారు.. నటి సంచలన వ్యాఖ్యలు!



కొన్నేళ్ల క్రితం దర్శకేంద్రుడు కే.రాఘవేంద్రరావుపై తీవ్ర ఆరోపణలు చేసింది తాప్సీ పన్ను. ఝుమ్మంది నాదం సినిమాతో వెండితెరకు పరిచయమైనప్పుడు తన నాభి (బొడ్డు)పై పూలు, పండ్లు వేసారని ఆరోపించింది తాప్సీ. నాభి అందాలను కెమెరాలో చిత్రీకరించారని, తనను అలా చూపించడం అసాధారణంగా అనిపించిందని వ్యాఖ్యానించింది తాప్సీ. టాలీవుడ్ నుంచి ఆల్మోస్ట్ నిష్క్రమించిన తర్వాత తాప్సీ కామెంట్లు పెను దుమారం రేపాయి. ఏరు దాటాక తెప్ప తగలేసిందని విమర్శలొచ్చాయి. అవకాశం ఇచ్చినప్పుడు ఇలాంటి కామెంట్లు చేయని తాప్సీ పూర్తిగా టాలీవుడ్ వదిలి వెళ్లాక ఆరోపించడం అందరినీ షాక్ కి గురి చేసింది. ఇప్పుడు డైసీ షా ఇంచుమించు అలాంటి వ్యాఖ్యలే చేసింది. అయితే ఈసారి కన్నడ సినీపరిశ్రమ వ్యామోహం గురించి డైసీ షా మాట్లాడింది. తన బొడ్డు (నాభి)పై పండ్లు, సలాడ్లు వేసారని డైసీ షా వ్యాఖ్యానించింది. అది తనకు అసౌకర్యంగా ఇబ్బందిగా అనిపించిందని తెలిపింది. కన్నడిగులకు నాభి అందాల ప్రదర్శన అంటే పిచ్చి వ్యామోహం ఉందని వ్యాఖ్యానించింది. మహిళలను అలా చూడటం మగాళ్లకు సంతృప్తినిస్తుందని కూడా డైసీ షా వ్యాఖ్యానించింది. మేల్ ఫాంటసీలో స్త్రీలను ఉపయోగించుకుంటారని, కన్నడ సినిమాలు చేస్తున్నప్పుడు తనకు ఇలాంటి అనుభవాలయ్యాయని తెలిపింది. అయితే డైసీ షా వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో భిన్నవాదనలు వినిపించాయి.

## యూఎస్ ఓపెన్‌లో హైడ్రామా.. రాకెట్‌ను విరగ్గొట్టిన డానియెల్ మెద్వదేవ్..



**న్యూఢిల్లీ-నవభూమి:** యూఎస్ ఓపెన్‌లో హైడ్రామా చోటు చేసుకుంది. ఈ టోర్నీ ఫస్ట్ రౌండ్‌లోనే మాజీ చాంపియన్ డానియల్ మెద్వదేవ్ ఓటమిని ఎదుర్కొన్నాడు. మెద్వదేవ్‌పై ఫ్రెంచ్ ఆటగాడు బెంజిమన్ బాంజీ విజయం సాధించాడు. ఈ మ్యాచ్ సమయంలో ఓ నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. మూడో సెట్‌లో మెద్వదేవ్ ఓడిపోతున్న సమయంలో ఓ ఫోటోగ్రాఫర్ గ్రౌండ్‌లోకి వచ్చాడు. ఆ సమయంలో మెద్వదేవ్ కాస్త శ్రుతి మించి ప్రవర్తించాడు .మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఫొటోగ్రాఫర్ అడ్డురావడంతో చైర్ అంపైర్ మరోసారి బాంజీకి ఫస్ట్ సర్వ్ చేసే అవకాశం ఇచ్చాడు. అప్పటికి 3-6, 5-7, 4-5 స్కోరుతో బాంజీ విన్నింగ్ పాయింట్ కోసం ఎదురుచూస్తున్నాడు. ఆ సమయంలో మెద్వదేవ్ హంగామా చేశాడు. ప్రత్యర్థికి మళ్లీ ఫస్ట్ సర్వ్ ఇవ్వడాన్ని నిరసించాడు. తన అరుపులతో స్టేడియంలోని ప్రేక్షకుల్ని రెచ్చగొట్టాడు. దీంతో ప్రేక్షకులు మెద్వదేవ్‌కు అనుకూలంగా అరిచారు. అందువల్ల ఆరున్నర నిమిషాల పాటు మ్యాచ్ ఆగిపోయింది. ఆట ఆరంభమైన తర్వాత మూడో సెట్‌లో బ్రేక్ పాయింట్ సాధించిన మెద్వదేవ్ ఆ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. మూడో సెట్‌లో దూకుడును నాలుగో సెట్‌లో కూడా మెద్వదేవ్ కొనసాగించాడు. 0-6 స్కోరుతో ఆ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఓటమి ఖాయనుకున్న దశలో మెద్వదేవ్ వరుసగా రెండు సెట్లు స్వంతం చేసుకుని మ్యాచ్‌ను టైబ్రేకర్‌కు తీసుకెళ్లాడు. అయితే చివరి సెట్‌లో మాత్రం ఫ్రెంచ్ ఆటగాడు బెంజిమన్ బాంజీ సత్తా చాటాడు 6-4 స్కోరుతో ఆ సెట్‌ను సొంతం చేసుకుని మ్యాచ్ గెలిచాడు. దీంతో మెద్వదేవ్ ఫస్ట్ రౌండ్‌లోనే యూఎస్ ఓపెన్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఆ కోపంలో మైదానంలోనే తన రాకెట్‌ను మెద్వదేవ్ విరగ్గొట్టేశాడు.

## లాస్ట్ ఓవర్, చివరి బంతికి 6 పరుగులు అవసరం..సంజు సామ్సన్ జట్టుకు ట్విస్ట్..



**న్యూఢిల్లీ-నవభూమి:** కరళ క్రికెట్ లీగ్ 2025లో ఆదివారం తిరువనంతపురంలో జరిగిన మ్యాచ్ చాలా ఉత్కంఠగా కొనసాగింది. కొచ్చి బ్లూ టైగర్స్‌తో ఆరీస్ కొల్లం సైలర్స్ తలపడ్డాయి. ఆ క్రమంలో చివరి బంతి వరకు నరాలు తెగే ఉత్కంఠతో సాగిన ఈ మ్యాచ్‌లో సంజు సామ్సన్ టీమ్‌కి మహమ్మద్ ఆషిక్ ట్విస్ట్ ఇచ్చి జట్టను గెలిపించాడు. మొదట బ్యాటింగ్ చేసిన కొల్లం సైలర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 236 పరుగుల భారీ స్కోర్ సాధించింది. విష్ణు వినోద్ (94), కెప్టెన్ సచిన్ బేబీ (91) విజృంభించారు. ఈ స్కోర్‌ని చూస్తే, కొచ్చి టైగర్స్‌కి టార్గెట్ చాలా కష్టమనిపించింది. కానీ, సంజు సామ్సన్ కేవలం 51 బంతుల్లో 121 పరుగులు చేసి అదరగొట్టాడు. అతడి బ్యాటింగ్ సమయంలో స్టేడియం అంతా హోరెత్తిపోయింది.

నవక్రీడ

## టీమ్ ఇండియాకు కొత్త స్పాన్సర్ షిప్.. పోటీలో టయోటా, ఫిన్‌టెక్ స్టార్టప్



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమ్ ఇండియా క్రికెట్‌కు సంబంధించి ఒక హాట్ హాట్ న్యూస్ వచ్చేసింది. మన ఇండియన్ క్రికెట్ టీమ్‌కి టైటిల్ స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్11 (%ఉముఎఱఅఒఱు చీవష రాజూశీఅంశీతీ%) తాజాగా షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ఇకపై టీమ్ ఇండియాకు స్పాన్సర్ చేయమని చెప్పింది. దీంతో కొత్త స్పాన్సర్ కోసం వేట మొదలెట్టింది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 9 నుంచి యూఏఈలో జరగబోయే ఆసియా కప్‌కి ముందు ఈ స్పాన్సర్‌షిప్ హడావిడి మొదలైంది. డ్రీమ్11 ఎందుకు వెనక్కి తగ్గిందంటే, ఇటీవల పార్లమెంట్‌లో ఆన్‌లైన్ గేమింగ్ రెగ్యులేషన్ బిల్ ఆమోదం పొందింది. ఈ బిల్ కారణంగా డ్రీమ్11తమ నిర్ణయాన్ని తెలియజేసింది. ఈ క్రమంలో రెండు పెద్ద సంస్థలు టీమ్ ఇండియాకు స్పాన్సర్ కోసం ముందుకొచ్చాయని నివేదికలు చెబుతున్నాయి. వాటిలో ఒకటి టయోటా మోటార్ కార్పొరేషన్, రెండోది ఒక ఫిన్‌టెక్ స్టార్టప్. టయోటా లాంటి గ్లోబల్ బ్రాండ్, ఇంకోవైపు కొత్తగా ఊపందుకుంటున్న ఫిన్‌టెక్ స్టార్టప్ ఈ రెండూ రేసులో ఉన్నాయి. కానీ ఇంకా అధికారిక టెండర్ ప్రాసెస్ మొదలు కాలేదు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**